ఆదివారం
గత వారంరోజుల పై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్
: fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
27-7-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 176 పేజీలు: 10+4 వెల: 8.00

మాల్దీవులతో బంధం మరింత పటిష్టం 2
యుఎస్ వీసా, పౌరసత్వ పరీక్షలు మరింత కఠినం 5

## అత్యంత విశ్వసనీయ గ్లోబల్ లీడర్‌గా ప్రధాని మోడీ



### మార్నింగ్ కన్సల్ట్ సంస్థ సర్వే వెల్లడి

**న్యూఢిల్లీ,జూలై 26:** ప్రధాని నరేంద్రమోదీ మరో ఘనత సాధించారు. ప్రపంచంలో అత్యంత విశ్వసనీయ నేతగా నిలిచారు. మార్నింగ్ కన్సల్ట్ సంస్థ నిర్వహించిన గ్లోబల్ లీడర్ సర్వేలో అత్యంత విశ్వసనీయత కలిగిన నేతగా మోడీ మొదటి స్థానంలో నిలిచారు. ఎన్నో యుద్ధాలు ఆపానంటూ గొప్పలు చెప్పుకునే >>2

## పురుషులకూ గర్భనిరోధక మాత్రలు!

నాలుగు వారాల్లోనే ఉత్తమ ఫలితాలు
కండోమ్‌లకు బదులు వైసిటి 529 మాత్రలు
మొదటి ట్రయల్‌లోనే సురక్షిత ఫలితాలు



**న్యూఢిల్లీ,జూలై 26:** పురుషులకు గర్భనిరోధకంలో నవ శకానికి నాంది పలికే విధంగా ప్రయోగాత్మక గర్భనిరోధక మాత్ర వైసీటీ529 మొదటి మానవ సురక్షిత పరీక్షల్లో విజయవంతంగా ఉత్తీర్ణత సాధించింది. ఈ సంచలన మాత్ర హార్మోన్లపై ఎలాంటి ప్రభావం చూపకుండానే స్పెర్మ్ ఉత్పత్తిని తాత్కాలికంగా నిలిపివేస్తుంది. ఇది జంటలు గర్భనిరోధక బాధ్యతను సమానంగా పంచుకునే అద్భుతమైన అవకాశాన్ని కల్పిస్తుంది. యువర్‌చాయిస్ థెరప్యూటిక్స్(వైసిటి) >>2

## శత్రువుకు వణుకుపుట్టించే 'రుద్ర' దళం



### ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది వెల్లడి

**న్యూఢిల్లీ, జూలై 26:** శత్రుమూకల ఆటకట్టించేలా భారత సైన్యంలో ఓ శక్తివంతమైన దళం ఏర్పాటయింది. భవిష్యత్తుముప్పును ఎదుర్కొనేలా 'ఆల్‌ఆర్మ్స్ బ్రిగేడ్'ను ఏర్పాటు చేసినట్లు సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది వెల్లడించారు. దీనిని 'రుద్ర' అని పేరు పెట్టినట్లు తెలిపారు. శనివారం 'కార్గిల్ విజయ్ దివస్' సందర్భంగా >>2



శనివారం ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి గవర్నింగ్ బాడీ సబ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డి.సిఎం భట్టి. చిత్రంలో మంత్రులు కోమటిరెడ్డి, శ్రీధర్ బాబు, డైరెక్టర్ జనరల్ శాంతి కుమారి

# పరిపాలనలో ఎఐ

### ఉపయోగించిన మొదటి రాష్ట్రం తెలంగాణ

### ఆరు నెలలకు ఒకసారి సబ్‌కమిటీ భేటీ

### ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి గవర్నింగ్ బాడీ సమావేశంలో డి.సిఎం భట్టి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై26:** దేశంలోనే అత్యుత్తమ శిక్షణ సంస్థగా ఎంసిఆర్‌డినీ నిలపాలి.. ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. 30 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ఉన్నతాధికారి అధిపతిగా ఉన్నారని పేర్కొన్నారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల విభాగం గవర్నింగ్ బాడీ సబ్‌కమిటీ సమావేశంలో కమిటీ చైర్మన్ హోదాలో ఆయన పాల్గొన్నారు. కమిటీ సభ్యులుగా మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి డైరెక్టర్ జనరల్ శాంతి కుమారి(రిటైర్డ్ సిఎస్) పాల్గొన్నారు. అధికారులు సిబ్బంది వారి సేవలను వినియోగించుకోవాలని స్వయం సమృద్ధి సాధించి, ఆర్థికంగా పురోగతి సాధించాలని, అప్పుడే ఆశించిన స్థాయిలో సంస్థ ఎదుగుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. సమావేశంలో మంత్రులు ఇచ్చిన సలహాలు >>2

### రాజకీయాల్లో వలంటీర్ వ్యవస్థ

# చాలా డేంజర్

### కార్యకర్తలు లేని రాజకీయాలు దేశ భవిష్యత్‌కు ప్రమాదకరం

### జైపాల్‌రెడ్డి పాత్ర లేకపోతే తెలంగాణ రాష్ట్రం వచ్చేది కాదు

### 'జైపాల్‌రెడ్డి డెమోక్రసీ' అవార్డు ప్రదానోత్సవంలో సిఎం రేవంత్



శనివారం హైదరాబాద్‌లో జెపాల్‌రెడ్డి డెమోక్రసీ అవార్డును మోహన్ గురుస్వామికి అందజేస్తున్న సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై26:** నాటి ఐడియాలజికల్ పాలిటిక్స్ పోయి ఇవాళ స్విగ్గీ పాలిటిక్స్ వచ్చాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దేశ రాజకీయాల్లో సైద్ధాంతిక రాజకీయాలు పోయి, మేనేజ్మెంట్ పాలిటిక్స్ కీ రోల్ ప్లే చేస్తున్నాయని అభిప్రాయపడ్డారు. కార్యకర్తలు పోయి వాలంటీర్ వ్యవస్థ వస్తోందని, ఇదిచాలా డేంజర్ అని పేర్కొన్నారు. కార్యకర్తలు లేని రాజకీయాలు దేశ భవిష్యత్‌కు ప్రమాదకరమని రేవంత్ స్పష్టం చేశారు. శనివారం హోటల్ తాజ్‌కృష్ణలో జరిగిన జైపాల్ రెడ్డి డెమోక్రసీ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిఎం రేవంత్ అనేక అంశాలపై కూలంకషంగా మాట్లాడారు. ఐసిఎఫ్ఏఐ అండ్ క్యాపిటల్ ఫౌండేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రముఖ ఆర్థిక నిపుణులు, విశ్లేషకులు మోహన్ గురుస్వామికి జెపాల్‌రెడ్డి డెమోక్రసీ తొలి అవార్డును సిఎం రేవంత్‌రెడ్డి ప్రధానం చేశారు. అనంతరం మాట్లాడుతూ యూనివర్సిటీలలో విద్యార్థి రాజకీయలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దేశ రాజకీయాల్లో ధన ప్రవాహం తగ్గించాల్సిన అవసరం ఉందని, ప్రతిపక్షాలు సహేతుకమైన సూచన చేస్తే తీసుకోవడానికి మాకుఇబ్బంది లేదని రేవంత్‌స్పష్టం చేశారు. అందుకే తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటి వరకు శాసనసభ నుంచి ఎవరినీ >>2

### ఉపాధ్యాయుల పదోన్నతులకు పచ్చజెండా

రెండు రోజుల్లో షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం

ఫైల్‌పై సంతకం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ 2

## సర్కార్ ఖజానాకు పెరిగిన అదాయం

అదనంగా రూ.1,420 కోట్లు రాక

రూ.20,266 కోట్లకు చేరిన నికర అప్పు



**హైదరాబాద్, జూలై 26, ప్రభాతవార్త:** రాష్ట్ర సర్కార్‌కు వచ్చే ఆదాయంలో పెరుగుదల చోటు చేసుకుంది. ప్రధానంగా పన్ను రాబడి పెరిగింది. ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలోని జూన్ నెలకు సంబంధించిన ఆర్థిక వివరాలతో కూడిన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదిక ప్రకారం అన్ని రకాల రాబడుల ద్వారా రాష్ట్ర ఖజానాకు జూన్ నాటికి రూ. 57,499 కోట్లు సమకూరాయి. >>2



### ఎస్ఎల్‌బిసి లైడార్

# సర్వేకు సన్నాహాలు

### భూ భౌతికస్థితి శోధనకు డెన్మార్క్ ఎలక్ట్రో మాగ్నటిక్ సాంకేతికత వినియోగం

### టన్నెల్ బోరింగ్ మిషన్ స్థానంలో డ్రిల్లింగ్ బ్లాస్టింగ్ విధానం కోసం సమాలోచనలు

**హైదరాబాద్,జూలై 26,ప్రభాతవార్త:** శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగం పనులు తిరిగి ప్రారంభించేందుకు భూభౌతిక పరిస్థితి అంచనా వేయడానికి ఎలక్ట్రో మాగ్నటిక్ సర్వే పరాకరాలు అమర్చిన హెలికాప్టర్‌తో లైడార్ సర్వే ఆగస్టు రెండో వారంలోగా చేపట్టడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభ్వుత్వం ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఎస్ఎల్‌బిసి సొరంగం ఇంకా 9.533 కిలోమీటర్లు తవ్వాల్సి ఉంది. ఈసంవత్సరం ఫిబ్రవరి 22న నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట ఇన్లెట్ వైపు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో ఇంజనీర్లు, కార్మికులతోపాటు ఎనిమిది మంది సొరంగంలో చిక్కుకోగా అందులో ఇద్దరి మృతదేహాలను మాత్రమే వెలికి తీశారు. మిగితా ఆరుగురి ఆచూకి నేటికి లభ్యంకాలేదు. దాదాపు రెండు నెలల పాటు సహాయక చర్యలు చేపట్టారు. చివరి 50 మీటర్ల ప్రాంతం మరింత ప్రమాదకరంగా ఉండటంతో పనులు నిలిపివేశారు. ఆ తర్వాత నిపుణుల సలహాలు, సూచనలతో ముందుకెళ్తున్నారు. ఇన్లెట్ వైపు మరో ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వం ఎస్ఎల్‌బిసి సొరంగం మొత్తం 43.931 కి.మీ. నిడివితో లైడార్ సర్వే చేపట్టనున్నారు. ఇన్‌లెట్ ఔట్‌లైట్‌వైపు తవ్వడం పూర్తైన సొరంగంలో గతంలో అనే షియర్ జోన్‌లు తటస్థపడ్డాయి. ఆ షియర్ జోన్‌లలో భవిష్యత్‌లో కూడా ఏలాంటి ప్రమాదాలు సంభవించకుండా సాయిల్ ట్రిట్‌మెంట్ జరపడానికి నిపుణలతో సలహాలు తీసుకోవాలనే ఉద్దేశ్యంతో తవ్వబోయే సొరంగంతోపాటు తవ్విన సొరంగంలో కూడా ఈ పరీక్షలు చేయాలని నిర్ణయించారు. ఇన్లెట్ వైపు ఫిబ్రవరిలో తవ్వకాలు మొదలు పెట్టాక 14వ కి.మీ. వద్ద షియర్ జోన్ నిమిషానికి పదివేల లీటర్ల బురదనీరు పైనుంచి కిందపడటం ప్రారంభించింది. ఇంజనీర్లు కార్మికులు నీటి ప్రవాహం అదుపు చేసే క్రమంలో బురదనీరుతో కప్పు కూలిపోవడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదకర షియర్ జోన్లు సొరంగం తవ్వే ప్రాంతాలు ఇంకా నాలుగైదు ఉన్నట్లు ఇంజనీర్లు ఇప్పటికే నిర్ధారణకు వచ్చారు. అవి కాకుండా ఇంకా ఏమైనా ఉన్నాయా అక్కడ భూభౌతిక పరిస్థితులు అంచనా వేయడానికి సాంకేతిక నిపుణలతో అధ్యయనం చేసి ముందకు పోవాలని ప్రభుత్వం యోచిస్తున్నది. సొరంగం తవ్వే మార్గంలో అంతర్గత నీటి ప్రవాహాలు, భూమి పొరలలో వ్యత్యాసాలు కాంటినెంటల్ క్రస్ట్ పొర, మాంటిల్ మధ్య ఉండే భూభౌతిక స్థితిఅధ్యయనం చేయనున్నారు. ఇన్లెట్ వైపు టన్నెల్ బోరింగ్ మిషన్‌తో కాకుండా డ్రిల్లింగ్ బ్లాస్టింగ్ విధానంలో సొరంగం తొలిచే ఆలోచన చేస్తున్నారు.. అత్యాధునిక డెన్మార్క్ ఎలక్ట్రో మాగ్నటిక్ సాంకేతిక సర్వే పరాకరాలు ఉపయోగించి, హెలికాప్టర్ ద్వారా >>2



# నేను, పొన్నం కలిసి పనిచేస్తాం..

### ఇక రాజకీయాలకు అతీతంగా కరీంనగర్ అభివృద్ధి: కేంద్ర మంత్రి బండి సంజయ్

### హుస్నాబాద్‌లో సైకిళ్లు పంపిణీ చేసిన కేంద్రమంత్రి

**చిగురుమామిడి, ప్రభాతవార్త:** కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో తాను రాజకీయాలు చేయబోనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి పనిచేస్తూ హుస్నాబాద్ సహా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఇద్దరం కలిసి హుస్నాబాద్ నియోజకవర్గంలో త్వరలోనే నవోదయ స్కూల్ ను ఏర్పాటు చేసి వచ్చే విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు ప్రారంభయ్యేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీంతోపాటు ఈ ప్రాంతంలో సైనిక్ స్కూల్ ను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. మంత్రి పొన్నం ప్లాస్టిక్ ను నిర్మూలించడంలో భాగంగా హుస్నాబాద్ లో 'స్టీల్ బ్యాంక్' ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్క ప్రజా ప్రతినిధి సమాజానికి తనవంతుగా ఏదో ఒక మంచి కార్యక్రమం చేపట్టాలని కోరారు. మోదీ స్ఫూర్తితో తాను 'మోదీ గిఫ్ట్' పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందిరికీ ఉచితంగా సైకిళ్లను అందిస్తుండటం సంతోషంగా ఉందన్నరు. అతిత్వరలోనే నర్సరీనుండి 6వ తరగతి చదివే విద్యార్థులందరికీ బ్యాగు, స్టీల్ వాటర్ బాటిల్, నోట్ బుక్స్, పెన్ను, పెన్సిల్ తో కలిపి 'మోదీ కిట్స్' ఇవ్వబోతున్నా. ప్రతి ఏరియాలో వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తా. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు గల్లా ఎగరేసుకునేలా చేస్తా. అందుకోసం స్కూళ్లలో మోలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తా. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ >>2

## రేపు కేబినెట్ భేటీ

### సిగాచీ ప్రమాద నివేదికపై చర్చ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై26:** సోమవారం తెలంగాణ కేబినెట్ భేటీ కానుంది. పాశమైలారం సిగాచీ ప్రమాదంపై నిపుణుల కమిటీ ఇచ్చిన రిపోర్టుపై ప్రభుత్వం ఈ సమావేశంలో కీలక చర్చలు జరపనుంది. కమిటీ సూచనలపై చర్చించి కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. కాగా, సిగాచీ దుర్ఘటనపై రెండు రోజుల క్రితమే సీఎస్‌కు నిపుణుల కమిటీ నివేదిక సమర్పించింది. సిగాచీ కంపెనీ సరైన రక్షణా చర్యలు పాటించకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్పష్టం చేసింది. ఈ నివేదికలో పరిశ్రమల భద్రతా ప్రమాణాలపై పలు కీలక సూచనలు చేసింది. అగ్ని ప్రమాదాల విషయంలో సిగాచీ కంపెనీ ఎలాంటిభద్రతా ప్రమాణాలు >>2



## బిఆర్ఎస్ ఏ పార్టీలోనూ విలీనం కాదు


### మాజీ మంత్రి కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై26:** తెలంగాణ ప్రజల కోసం పుట్టిన పార్టీ.. తెలంగాణ ప్రజల కోసం పోరాడే పార్టీ బిఆర్ఎస్ అని.. ఇప్పుడే కాదు.. ఎప్పటికీ ఏ పార్టీలో విలీనమయ్యే ప్రసక్తే లేదని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ స్పష్టం చేశారు. బిఆర్ఎస్‌ను బిజెపి పార్టీలో విలీనం చేస్తామని ఎంపి సిఎం రమేష్ చేసిన వ్యాఖ్యలపై ఆయన శనివారం ఎక్స్ వేదికగా స్పందించారు. >>2

## జూరాలకు పోటెత్తిన వరద

### 12 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల.. శ్రీశైలం డ్యాం 2గేట్లు ఎత్తివేత

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 26, ప్రభాతవార్త:** జూరాల డ్యామ్‌కు వరద పోటెత్తుతున్నది. ఎగువన కర్ణాటక ప్రాంతంలో గత మూడు రోజులకు కురుస్తున్న వర్షాలకు వరద ప్రవాహం పెరుగుతున్నది. జలాశయానికి శనివారం 75,000క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదైంది. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 4.284టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. >>2



శనివారం శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు ఎత్తివేసిన దృశ్యం

## రాష్ట్రమంతా వాన ముసురు

### సగటు వర్షపాతం1.99 సెం.మీ నమోదు

### జనగాం, జగిత్యాల, పెద్దపల్లి, నిర్మల్, మంచిర్యాలలో లోటు వర్షపాతం

### ఐదు జిల్లాల్లో అత్యధిక వర్షపాతం

### భద్రాచలంలో 32 అడుగులకు చేరిన గోదావరి

### హుస్సేన్ సాగర్ నాలుగు తూము గేట్లు, కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత



శనివారం భద్రాచలం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

**హైదరాబాద్,జూలై 26,ప్రభాతవార్త:** తెంగాణలో వాన ముసురు పట్టుకొంది. తెలంగాణ వ్యాప్తంగా శనివారం 1.99సెం.మి సగటు వర్షాపాతం నమోదైంది. నైరుతి రుతుపవన కాలంలో రెండు డ్రైస్పెల్స్ రావడంతో మొన్నటి వరకు తెలంగాణలో దుర్భిక్ష పరిస్థితులు ఉండేవి. గత ఐదురోజులుగా వర్షాలు పడటంతో ఒక్కసారిగా మార్పు వచ్చింది. జనగామ, జగిత్యాల, పెద్దపల్లి, నిర్మల్, మంచిర్యాలలో లోటువర్షాపాతం నమోదైంది. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, రంగారెడ్డి, సిద్దిపేట, నారాయణపేట జిల్లాలో అత్యధికవర్షాపాతం నమోదైంది. 23 జిల్లాలో సాధారణ వర్షాపాతం నమోదైంది. ఎడతెరిపి లేని వర్షాలకు హైదరాబాద్లోని పలు ప్రాంతాల్లో రోడ్లు జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతాలు నీట >>2




విజయ్ దివస్ సందర్భంగా న్యూఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారకం వద్ద శనివారం అమరవీరులకు నివాళులర్పిస్తున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్

# పరిపాలనలో ఎఐ

>> పాటించంచాలని చెప్పారు. పరిపాలనలో దేశంలోనే మొట్టమొదట ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను పూర్తిస్థాయిలో ఉపయోగించిన రాష్ట్రంగా తెలంగాణ ఎదగాలి అందుకు తగిన విధంగా శిక్షణ ఇవ్వండి అని చెప్పారు. ప్రిన్సిపల్ సెక్రెటరీ నుంచి గ్రామస్థాయి అధికారి వరకు శిక్షణ ఇవ్వండి అని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహకారంతో పనిచేయడంపై శిక్షణ పూర్తయిన తర్వాత ఉద్యోగులకు సర్టిఫికెట్ సైతం ఇవ్వాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు. ఎన్ఏసి గుర్తింపు పొందేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు శిక్షణ ఇవ్వండి తద్వారా కేంద్ర ప్రభుత్వం నిధులు సాధించేందుకు అవకాశం ఉంటుందని మంత్రులు అధికారులను ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల లీడర్లకు జిల్లా స్థాయిలో, మండల స్థాయిలో రెండు రోజులపాటు శిక్షణ ఇచ్చి వారు ఆర్థికంగా ఉన్నత స్థానానికి ఎదిగేందుకు కృషి చేయండి అని చెప్పారు. గత పది సంవత్సరాలు ఎంసిఆర్‌హెచ్ ఆర్డిపై దృష్టి సారించలేదు ఇకనుంచి 6 నెలలకు ఒకసారి సబ్ కమిటీ సమావేశం అవుతుందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న సాంకేతిక పరిజ్ఞానం, ఇతర అంశాల్లో మార్పులను దృష్టిలో పెట్టుకొని ఎంసిఆర్‌డి అధికారులు సిబ్బందికి సైతం శిక్షణ ఇవ్వాలని అన్నారు.

# లైడార్ సర్వేకు సన్నాహాలు

>> లైడార్ సర్వే భూమి ఉపరితలంలో వాయుమార్గంలో చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఎన్‌జిఆర్‌ఐ భూగర్భ పరిశోధకులు ఆచార్య తివారీ పర్యవేక్షణలో పరీక్షలు చేయించాలని తెలంగాణ ప్రభుత్వం ప్రాథమికంగా ఒక నిర్ణయానికి వచ్చింది. నీటిపారుదల శాఖ అధికారులు భూ భౌతిక పరిస్థితి పరిశోధన, అధ్యయనం కోసం నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌తో ఒక అవగాహన కుదుర్చుకొన్నారు. అత్యంత లోతైన సముద్రాలు, హిమాలయాల్లోనూ భూభౌతిక పరిస్థితి అంచనవేసి నిర్ధారణ చేసిన ఎన్‌జిఆర్‌ఐ శాస్త్రవేత్తలకు ఇక్కడి భూభాగంలో అంతరగిక పోరల్లో ఉండే పలకల అంశాలను వాటి పటుత్వంను గుర్తిస్తారు. సర్వే కోసం హెలికాప్టర్ల వినియోగానికి ప్రభుత్వం అనుమతిచ్చింది. ఎన్‌జిఆర్‌ఐ బృందం అటవీ ప్రాంతంలోని సొరంగమార్గం 44కి.మి నిడివిని సందర్శించి క్షేత్రస్థాయిలో ఉపరితలంలో ఉన్న భూభౌతిక విధానంను పరిశీలించారు. అంతేకాదు ఆర్మీ కల్నల్ పరీక్షిత్ మెహ్రా శుక్రవారం ఔట్ లెట్ సందర్శించి అక్కడ నీటిపారుదలశాఖ అధికారులు, టన్నెల్ తవ్వకం పనులు చేసే కాంట్రాక్టు సంస్థ జెపిప్రతినిధులతో సమావేశమై క్షేత్రస్థాయి అంశాలపై ఒక ప్రాథమిక అవగాహనకు వచ్చారు. ఎస్ఎల్‌బిసి సొరంగం మొత్తం 43.931 కి. మీ. తవ్వాల్సి ఉంటుంది. ఇన్లెట్ వైపు 13.936 కి.మీ. పూర్తయ్యింది. ఔట్లెట్ వైపు 20,435 కి.మీ. తవ్వారు. ఔట్‌లెట్ వైపు బేరింగ్‌లు పాడైపోవడంతో అమెరికాలోని రాబిన్‌సన్ కంపెనీ నుంచి వాటిని తెప్పించారు. సొరంగం 9,533 కి.మీ. తవ్వితే శ్రీశైలం నుంచి గ్రావిటీ ద్వారా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోకి నీటిని తరలించేందుకు మార్గం సుగమం అవుతోంది. సర్వే అనంతర ఫలితాలను బట్టి ఎస్ఎల్‌బిసి సొరంగం తొలిచే విషయంలో నిర్ణయం తీసుకోనున్నారు. స్పష్టత వచ్చిన తరువాత పనులు చేపట్టడం త్వరగా పనులు పూర్తయ్యేందుకు టన్నెల్ బోరింగా, లేకా డ్రిల్లింగ్ బ్లాస్టింగ్ విధానం వినియోగించాలా అనే అంశంపై స్పష్టత రానున్నది.

# గ్లోబల్ లీడర్‌గా ప్రధాని మోడీ

>> అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎనిమిదో స్థానానికి పరిమితమయ్యారు. మార్నింగ్ కన్సల్ట్ సంస్థ ఈ సర్వేను జులై 4 నుంచి 10 మధ్య నిర్వహించింది. అందులో ప్రధాని మోదీకి 75 శాతం మంది మద్దతు ప్రకటించారు. ఆ వివరాలను బీజేపీ నేత అమిత్ మాలవీయ ఎక్స్‌లో పోస్టు చేశారు. భారతీయులతోపాటు ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది విశ్వసించే నేతగా ప్రధాని మోజీ అగ్రస్థానంలో నిలిచారని ఆయన కొనియాడారు. భారత్ సురక్షితమైన నాయకుడి చేతుల్లో ఉందని మాలవీయ అన్నారు. 59శాతంతో దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జేమ్యుంగ్ రెండో స్థానంలో నిలవగా, 57 శాతంతో అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలి, 56 శాతంతో కెనడా ప్రధాని మార్క్ కార్నీ వరుసగా మూడు, నాలుగు స్థానాలు దక్కించుకున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 44 శాతంతో ఎనిమిదో స్థానానికి పరిమితమయ్యారు. గ్లోబల్ లీడర్ సర్వే అంతర్జాతీయ వేదికపై మోదీకి కొనసాగుతున్న ప్రజాదరణను చాటిచెప్పింది. ప్రపంచవ్యాప్తంగా ప్రజాదరణ కలిగిన నేతగానూ ప్రధాని మోదీ పలు మార్లు తొలిస్థానంలో నిలిచారు. 2021 సెప్టెంబరులో మార్నింగ్ కన్సల్ట్ నిర్వహించిన సర్వేలో ప్రధానికి 70 శాతం మద్దతు లభించింది. 2022 ప్రారంభంలో 71శాతంతో అత్యంత ప్రజాదరణ పొందిన నేతగా ప్రపంచంలోనే మొదటిస్థానంలో నిలిచారు. ఆ తర్వాత ఏప్రిల్, సెప్టెంబర్, డిసెంబర్‌లో నిర్వహించిన సర్వేల్లో 76 శాతం మద్దతు లభించింది.

# కలిసి పనిచేస్తాం..

>> కుమార్ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే టెన్త్ విద్యార్థులకు బంపర్ ఆఫర్ ప్రకటించారు. "ప్రభుత్వ పాఠశాలల్లో చదవండి. సైకిల్‌ను బహుమతిగా పొందండి"అని ఆఫర్ ఇచ్చారు. ఇకపై తాను ఎంపీగా ఉన్నంత కాలం ప్రతి ఏటా ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుకునే విద్యార్థులందరికీ ఉచితంగా సైకిళ్లను అందజేస్తానని ప్రకటించారు. కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి ఎదుగుతారనే దానికి సిద్దిపేట జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, పోలీస్ కమిషనర్ లే నిదర్శనమన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో "మోదీ గిఫ్ట్" పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ చదివే వందలాది మంది విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు.

అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ తోపాటు జిల్లా కలెక్టర్ హైమావతి, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, స్థానిక ఆర్డీవో, డీఈవో తదితరులు పాల్గొన్నారు. అనంతరం కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూఈ సైకిల్ "మోదీ గిఫ్ట్". ఎన్నికల్లో గెలిపించిన ప్రజలకు ఏదో ఒక మంచి పని చేయాలంటూ ప్రధాని మోదీ సూచన చేసిన మేరకు, వారి స్ఫూర్తితోనే ఈ సైకిళ్లను పంపిణీ చేస్తున్నా. నాకు పిల్లలకు సైకిళ్లను పంపిణీ చేయాలనే ఆలోచన రావడానికి కారణాలున్నాయి. ఈరోజు కార్గిల్ దివస్. కార్గిల్ అమరవీరుల త్యాగాలను కేంద్రం వృథా చేయలేదు. ఆనాడు వాజ్ పేయి, ఈనాడు నరేంద్రమోదీ పాకిస్తాన్ ఉగ్రవాదుల వెన్నులో వణుకు పుట్టించారు. పెహల్గాం దాడుల అనంతరం అన్ని పార్టీల ఎంపీల బృందం అన్ని దేశాలకు వెళ్లి పాకిస్తాన్ కుట్రలను ప్రపంచానికి బట్టబయలు చేసిన విషయాన్ని గుర్తు చేసుకోవాలి.. అని అన్నారు.

# ఉపాధ్యాయుల పదోన్నతులకు పచ్చజెండా

## రెండు రోజుల్లో షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం

## ఫైల్‌పై సంతకం చేసిన ముఖ్యమంత్రి రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై26:** తెలంగాణా రాష్ట్రంలో ఉపాధ్యాయుల పదోన్నతులకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. దీనికి సంబంధించిన ఫైల్‌పై శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతకాలు చేశారు. ఈ నేపథ్యంలో త్వరలో ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు రానున్నాయి. దీనికి సంబంధించి రెండు రోజుల్లో షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2000 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించే అవకాశం ఉంది. స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ హెడ్మాస్టర్లుగా పదోన్నతి రావాల్సి ఉంది. గతేడాది సుమారు 1500 మంది స్కూల్ అసిస్టెంట్లకు ఈమేరకు పదోన్నతి ఇచ్చారు. కొన్ని కారణాల వల్ల మల్టీజోన్2లో మిగిలిపోయినవి, పదవీ విరమణ వల్ల సుమారు 750 గెజిటెడ్ హెచ్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతి ఇచ్చి వీటిని భర్తీ చేయాల్సి ఉంటుంది. కొంతకాలంగా ఉపాధ్యాయులు దీనికోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా దీనికి సంబంధించిన ఫైల్ క్లియర్ అయ్యింది. పదోన్నతులతో ఖాళీ అయ్యే స్కూల్ అసిస్టెంట్ పోస్టులను ఎస్జీటీలతో భర్తీ చేయనున్నారు. అదేవిధంగా డీఎస్సీ-2012 తర్వాత పీఈటీ, భాష పండితులకు కూడా అప్‌గ్రేడ్ చేయాల్సి ఉంది. వీరు దాదాపు 800 మంది ఉన్నారు. వారి పదోన్నతికి కూడా ప్రభుత్వం అనుమతించినట్లు సమాచారం. ఇలా దాదాపు 2 వేల మంది పదోన్నతులు పొందే అవకాశం ఉంది. జూన్ 30 వరకు ఉన్న ఖాళీలను ఆధారంగా తీసుకుని ఈ ప్రక్రియ చేపట్టనున్నట్లు సమాచారం. ఇప్పటికే చాలా పాఠశాలల్లో రెగ్యులర్ హెడ్‌మాస్టర్లు లేకపోవడం వల్ల ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ కొరత తీర్చేందుకు ప్రభుత్వం వేగంగా ఈ ప్రక్రియను పూర్తిచేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

## వారం - వర్జ్యం

27-07-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
తదియ రా.10.48
మఖ సా.4.27
వర్జ్యం : రా.12.51-2.32
దు.సా.4.54-5.46
శుభసమయం : సా.7.30-8.30
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం :** సోదరులను కలిసి ఉల్లాసంగా గడుపుతారు. కోర్టుకేసుల నుండి బయటపడతారు. ఆకస్మిక ప్రయాణాలు.

**వృషభం:** కాంట్రాక్టులు దక్కించుకొంటారు. సంతానం నాకు నూతన విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.

**మిథునం:** రాజకీయ, కళారంగాల వారికి యోగదాయకం. ఆరోగ్య సమస్యలు ఎదురై చికాకులు పెడతాయి.

**కర్కాటకం :** వృత్తి, వ్యాపారాలలో ఎదురైన చికాకులు కొంతవరకు తొలగుతాయి. ఉద్యోగులు ఉన్నతహోదాలు పొందుతారు.

**సింహం:** పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. గృహం, వాహనాలు కొనుగోలు యత్నాలు కలిసి వస్తాయి.

**కన్య :** కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. సేవకార్యక్రమాలపై ఆసక్తి చూపుతారు.

**తుల :** మీ ప్రతిభా పాటవాలు వెలుగులోకి వస్తాయి. కీలక నిర్ణయాలలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకొంటారు.

**వృశ్చికం:** దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం కొంత ఊరట చెందుతారు. ఉద్యోగ యత్నాలు ఫలిస్తాయి.

**ధనుస్సు:** సభలు, సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు. బంధువుల నుండి కీలక సమాచారం అందుకొంటారు.

**మకరం:** స్థిరాస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**కుంభం:** సంఘంలో గౌరవం పొందుతారు. దీర్ఘకాలిక సమస్యల నుండి బయటపడతారు.

**మీనం :** తండ్రి ద్వారా ఆస్తిలాభం పొందుతారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. పలుకుబడి పెరుగుతుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మాల్దీవులతో బంధం మరింత పటిష్టం

## ఇరువురు నేతల భేటీ తర్వాత మీడియా మీట్



శనివారం మాలేలో మాల్దీవులకు చెందిన వివిధ పార్టీ నేతలతో భేటీ అయిన ప్రధాని మోడీ

**మాలె,జూలై 26:** మాల్దీవులతో సంబంధాలను బలోపేతం చేయడానికి భారత్ ఆసక్తిగా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. సామర్థ్య నిర్మాణానికి మద్దతు ఇవ్వడానికి కట్టుబడి భారత్ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. మాల్దీవుల పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ, శనివారం దేశ ఉపాధ్యక్షుడు ఉజ్ హుస్సేన్ మహ్మద్, ఉపాధ్యక్షుడు హుస్సేన్ మహ్మద్ లతీఫ్ సహా పలువురు నేతలతో భేటీ అయ్యారు. భారత్ మాల్దీవుల మధ్య కీలక సంబంధాల అంశాలపై దృష్టి సారించారని తెలిపారు. మౌలిక వసతులు, సాంకేతికత, వాతావరణ మార్పు, ఇంధనం వంటి అనేక రంగాల్లో మా దేశాలు సన్నిహితంగా పనిచేస్తున్నాయి. ఇది మన ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంది. రానున్న సంవత్సరాల్లో ఈ భాగస్వామ్యం మరింతగా బలోపేతం చేసుకోవాలని ఆశిస్తున్నా అని ప్రధాని మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అలాగే మాల్దీవుల పార్లమెంట్ స్పీకర్ అబ్దుల్ రహీం అబ్దుల్లాను కూడా ప్రధాని కలిశారు. వారితో భారత్ మాల్దీవుల మధ్య బలమైన స్నేహబంధం, అలాగే రెండు దేశాల పార్లమెంట్ మధ్యఉన్న సన్నిహిత సబంధాల గురించి చర్చించినట్లు ప్రధాని మోదీ తెలిపారు. మాల్జీవుల మాజీ అధ్యక్షుడు నషీద్‌ను ప్రధాని మోదీ కలుసుకున్నారు. ఇరుదేశాలమధ్య బలమైన స్నేహబంధానికి ఆయన ఎల్లప్పుడూ మద్దతుదారుగానే ఉన్నారని ప్రధాని మోదీ అన్నారు. భారత్‌తో విడదీరాయని బంధం ఉందని మొహమ్మద్ ముయిజ్జు అన్నారు. భారత్, మాల్దీవులు మధ్య దౌత్య సంబంధాలకు అతీతంగా విడదీయరాని బంధం ఉందని మొహమ్మద్ ముయిజ్జు ఉద్ఘాటించారు. ఇరుదేశాల సుదీర్ఘ బంధానికి హిందూ మహా సముద్రమే సజీవ సాక్ష్యమన్నారు. మాల్దీవులు పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమైన ముయిజ్జు, భారత్ ఇస్తోన్న నిరంతర మద్దతు, స్థిరమైన స్నేహానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఏడాదితో ఇరుదేశాల మధ్య దౌత్యసంబంధాలకు 60 పూర్తి అవుతోన్న నేపథ్యంలో ఉమ్మడి చరిత్ర, శాశ్వత భాగస్వామ్యానికి రెండు దేశాల సంబంధాలు ప్రతిబింబంగా నిలుస్తాయని చెప్పారు. ఇరుదేశాల మధ్య శతాబ్దాల నాటి లోతైన సంబధాలు ఉన్నాయన్నారు. ఎలాంటి విపత్తులు, సంక్షోభాల సమయంలోనైనా భారత్ తమకు అండగా నిలిచిందని ముయిజ్జు కొనియాడారు. వేగంగా స్పందించి భారత్ ఆపన్నహస్తాన్ని అందించిందని ఆయన ప్రశంసించారు.

# వలంటీర్ వ్యవస్థ చాలా డేంజర్

>> సస్పెండ్ చేయలేదని కూడా రేవంత్ రెడ్డి చెప్పారు. దేశ రాజకీయాల్లో జైపాల్ రెడ్డి ఒక నిలువెత్తు శిఖరం అని కొనియాడిన సిఎం రేవంత్... పీవీ, జైపాల్ రెడ్డి లాంటి వారి స్ఫూర్తి తెలంగాణ రాజకీయాల్లో ఉండాలని ఆకాంక్షించారు. విద్యార్థి నాయకుడిగా, శాసన సభ్యుడిగా, పార్లమెంట్ సభ్యుడిగా, రాజ్యసభ సభ్యుడిగా, కేంద్రమంత్రిగా వివిధ హోదాల్లో జైపాల్ రెడ్డి పని చేసి, దేశానికే తలమానికమైన పనులు చేశారని చెప్పారు. జైపాల్ రెడ్డి గొప్పతనం గురించి చెబుతూ సీఎం రేవంత్ ఇంకా ఏమ న్నారంటే.. 1969లో తొలిసారి కల్వకుర్తి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. నాలుగుసార్లు శాసనసభ్యుడిగా, 5 సార్లు లోక్ సభ సభ్యుడిగా, 2 సార్లు రాజ్యసభ సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా పనిచేశారు. ఆయన ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కల్వకుర్తి ప్రాంతంలో విద్యుత్ అవసరమని గుర్తించి అభివృద్ధికి బాటలు వేశారు. రాజకీయాలలో ధన ప్రవాహం తగ్గించాలని ఆయన ప్రయత్నించారు. తెలంగాణ ఏర్పాటులో ఆయన పాత్ర లేకపోతే ఇవాళ తెలంగాణ వచ్చేది కాదు. చర్చ లేకుండానే పార్లమెంట్‌లో తెలంగాణ బిల్ ఆమోదించేలా జైపాల్ రెడ్డి ప్రత్యేక పాత్ర పోషించారని చెప్పారు. జైపాల్‌రెడ్డి చొరవతోనే తెలంగాణ ఏర్పాటు చేశామని సోనియా గాంధీ ఒక సందర్భంలో నాతో చెప్పారు. కాంగ్రెస్‌ను వీడినా, తిరిగి కాంగ్రెస్ లో చేరినా సైద్ధాంతిక విభేదాలే తప్ప.. పదవుల కోసం ఆయన పార్టీలు మారలేదని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

# సర్కార్ ఖజానాకు పెరిగిన అదాయం

>> ఇది అంచనా వేసిన రాబడి రూ.2,84,837 కోట్లలో 20.19 శాతం. ఇదే సమయంలో జూన్ నాటికి ప్రభుత్వం అన్ని రకాలుగా రూ.52,559 కోట్లను ఖర్చు చేసింది. ఇది అంచనా వ్యయం రూ.2,63,846 కోట్లలో 19.95 శాతం. ?ఇందులో మూలధన వ్యయం కింద అంచనా వేసిన రూ.36,504 కోట్లలో జూన్ నాటికి రూ.4,755 కోట్లను ఖర్చు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి సంబంధించి జూన్ నెలలో పన్నుల ద్వారా వచ్చిన రాబడి రూ.13,112 కోట్లుగా నివేదికలో కాగ్ పేర్కొంది. వస్తు సేవల పన్ను, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, అమ్మకం పన్ను, రాష్ట్ర ఎక్సైజ్ సుంకాలు, కేంద్ర పన్నుల్లో వాటా, ఇతర పన్నులు, సుంకాల ద్వారా గత ఏప్రిల్‌లో రూ.10,916 కోట్ల ఆదాయం వచ్చింది. మేలో అది రూ.11,692 కోట్లు రాగా, జూన్‌లో రూ.13,112 కోట్ల మేర సమకూరింది. ఈ లెక్కన మే నెల కంటే జూన్ నెలలో రాష్ట్ర ఖజానాకు రూ.1,420 కోట్లు అదనంగా వచ్చాయి. దీంతో జూన్ నాటికి జీఎస్టీ ద్వారా రూ.12,622 కోట్లు, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.3,712 కోట్లు సమకూరింది. అలాగే అమ్మకం పన్ను ద్వారా రూ.8,466 కోట్లు, ఎక్సైజ్ సుంకాల ద్వారా రూ.4,595 కోట్లు ఖజానాకు చేరాయి. ఇక కేంద్ర పన్నుల్లో వాటా కింద జూన్ నెలలో రూ.4,385 కోట్లు, ఇతర పన్నులు, సుంకాల ద్వారా మరో రూ.1,940 కోట్ల రాబడులు సమకూరినట్లు కాగ్ తన నివేదికలో వెల్లడించింది. కాగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నికర అప్పు రూ.20,266 కోట్లకు చేరింది. ఒక్క జూన్‌లోనే రూ.10,876 కోట్ల రుణాలు తీసుకుంది.




సిపిఐఎం పార్టీ మాజీ నాయకుడు సుభాష్ ముండా వర్ధంతి సందర్భంగా రాంచీలో శనివారం పార్టీ కార్యకర్తలతో కలిసి నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న సిపిఐఎం నాయకురాలు బృందా కారత్

# రాష్ట్రమంతా వాన ముసురు

>> మునిగాయి. రోడ్లపై వరద నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫలితంగా ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద ట్రాఫిక్ జామ్లు ఏర్పడుతున్నాయి. మాసబ్ ట్యాంక్ సమీపంలో రోడ్లపైకి భారీగా నీరు చేరడంతో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. నగరంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చే వరదనీటితో హుస్సేన్ సాగర్ నిండుకుండలా మారింది. దీంతో అధికారులు నాలుగు తూము గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. తెలంగాణలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం వద్ద జలకళ సంతరించుకుంది. భారీ వర్షాలతోపాటు ఎగువ ప్రాంతాల నుంచి వరద పోటెత్తడంతో కాళేశ్వరం పుష్కర ఘాట్ల వద్ద గోదావరి, ప్రాణహిత నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో కాళేశ్వరం వద్ద నీటిమట్టం 8,700 మీటర్లకు చేరుకుంది. మరోవైపు పుష్కర ఘాట్ మెట్ల వద్ద ఏర్పాటు చేసిన జ్ఞానదీపాలు కొంతవరకు నీటిలో మునిగి బాహుబలి సినిమాలోని దృశ్యాన్ని తలపిస్తున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో పాటు తెలంగాణ వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. శనివారం ఉదయం 7 గంటలకు గోదావరి నీటిమట్టం 32.5 అడుగులు దాటి ప్రవహిస్తోంది. నీటిమట్టం పెరగటంతో స్నాన ఘట్టాల ప్రాంతం వద్ద చాలా మెట్లు వరదనీటిలో మునిగాయి. కామారెడ్డి జిల్లాలోని వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గాంధారి మండలం పోతంగల్ కుర్దు నాగ్లూర్ శివారులోని పొలాలకు సుమారు 30 మంది రైతులు వరినాట్లు వేయడానికి వెళ్లారు. పనులు ముగించుకుని సాయంత్రం తమ ఇళ్లకు వెళ్లేందుకు వారంతా ఆ ప్రాంతంలోని కాటేవాడి వాగును దాటుతుండగా వరద ఉధృతి పెరగడంతో వారంతా చిక్కుకున్నారు. సుమారు మూడు గంటలపాటు వరదలో నిరీక్షి ంచారు. వరద తగ్గుముఖం పట్టిన తర్వాత గుంపుగా వాగు దాటారు. అనిశ్చితి ఒవైపు ఆనందం మరోవైపు నెలకొంది. కడెం గేట్లు ఎత్తివేయడంతో పాలనురుగులా వదర కింది ప్రవహిస్తోంది ప్రాజెక్టు నీటి మట్టం 700అడుగులు గరిష్ఠం కాగా ప్రస్తుతం అందులో 695 అడుగులకు నీరు చేరింది. మేడారం వద్ద జంపన్న బ్రిడ్జిని తాకేలా ప్రవహిస్తోంది లక్నవరం సరస్సు జలమయం అయింది.

# జూరాలకు పోటెత్తిన వరద

>> పవర్ హౌస్ కు 34,286క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 47000క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అదేవిధంగా బీమా లిఫ్టు -2కు 750 క్యూసెక్కులు, కోయిల్ సాగర్ లిఫ్ట్ కు 315 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750, ఆర్డీఎస్ కెనాల్ కు 150 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 550క్యూసెక్కులు, కుడి కాలువకు 480క్యూసెక్కులు, సమాంతర కాలువకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 72,445క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదయింది. కాగా శ్రీశైలం జలాశయానికి వరద పెరుగుతున్నది. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా డ్యాం జలకళను సంతరించుకున్నది. దీంతో ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలానికి జూరాల పవర్‌హౌజ్ ద్వారా 34286క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 35820క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 31928క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుకుంటున్నది. డ్యాం నుంచి 1,02,122క్యూసెక్కులు దిగువకు విడుదలవుతున్నాయి. రెండు గేట్లు 10అడుగుల మేర ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులకుగానూ 882.40అడుగులకు చేరగా, 215.8070 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 201.1205 టీఎంసీలకు చేరింది. పవర్‌హౌజ్‌కు 66244క్యూసెక్కులు విడుదల చేయగా కుడి,ఎడమ జల విద్యుత్ కేంద్రాల వద్ద విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది.

# రేపు కేబినెట్ భేటీ

>> పాటించలేదని నిపుణుల కమిటీ నివేదికలో వెల్లడించింది. పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవించకుండా ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేసింది. పరిశ్రమల్లో విపత్తు నివారణకు రాష్ట్రవ్యాప్తంగా ఇండస్ట్రియల్ మేనేజ్మెంట్ అథారిటీని ఏర్పాటు చేయడం అత్యవసరమని సూచించింది. ఈ అథారిటీ పరిశ్రమలు భద్రతా ప్రమాణాలు పాటించేలా పర్యవేక్షించాలని పేర్కొంది.

# పురుషులకూ గర్భనిరోధక మాత్రలు!

>> అభివృద్ధి చేసిన వైసీటీ529, సంప్రదాయ హార్మోనల్ గర్భనిరోధక మాత్రలకు పూర్తిగా భిన్నమైనది. ఇది పురుషుల టెస్టోస్టెరాన్ స్థాయిలను ఏ మాత్రం మార్చకుండానే స్పెర్మ్ ఉత్పత్తిని తాత్కాలికంగా ఆపేస్తుంది. ఈ మాత్ర రెటినాయిక్ యాసిడ్ రిసెప్టర్ ఆల్ఫా (ఆర్ఏఆర్ఆల్ఫా) అనే ప్రోటీన్‌ను నిరోధించడం ద్వారా పనిచేస్తుంది. ఈ ప్రోటీన్ స్పెర్మ్ ఉత్పత్తి ప్రక్రియలో కీలక పాత్ర పోషిస్తుంది. ప్రారంభ అధ్యయనాల ప్రకారం ఔషధం తీసుకోవడం ఆపిన తర్వాత పురుషులు తమ సంతానోత్పత్తి సామర్థ్యాన్ని పూర్తిగా తిరిగి పొందుతారు. తాజాగా ఎలుకలపై జరిపిన పరీక్షల్లో, వైసీటీ529 కేవలం నాలుగు వారాల్లోనే స్పెర్మ్ ఉత్పత్తిని గణనీయంగా తగ్గించి, 99 శాతం గర్భాలను నిరోధించడంలో విజయవంతమైంది. మొదటి దశ (ఫేజ్ 1ఎ) క్లినికల్ ట్రయల్‌లో 16 మంది ఆరోగ్యవంతమైన పురుషులు (32నుంచి59 సంవత్సరాల వయస్సు) పాల్గొన్నారు. వీరంతా గతంలో వాసెక్టమీ (స్పెర్మ్‌ను రవాణా చేసే నాళాలను కత్తిరించే శస్త్రచికిత్స) చేయించుకున్నవారు. ఔషధం శాశ్వతంగా సంతానోత్పత్తిని ప్రభావితం చేసే అవకాశాన్ని తొలగించడానికి ఈ జాగ్రత్త తీసుకున్నారు. పరీక్షలో పాల్గొన్నవారు 10, 30, 90, లేదా 180 మిల్లీ గ్రామ్‌ల డోస్‌లలో వైసీటీ529 లేదా ప్లాసిబో (నకిలీ ఔషధం) తీసుకున్నారు. కొంతమంది ఉపవాసం తర్వాత, మరికొంతమంది అధిక కొవ్వు, అధిక కేలరీల ఆహారం తీసుకున్న తర్వాత 30 మిల్లీగ్రాముల డోస్ తీసుకున్నారు. వైసీటీ529 మాత్రం హార్మోన్లపై ప్రభావం చూపకపోవడం వల్ల ఈ సమస్యలను సమర్థవంతంగా నివారిస్తుంది. ఇది పురుషులకు గర్భనిరోధకంలో ఆకర్షణీయమైన, సురక్షితమైన ఎంపికగా మారుతుంది. ఈ మొదటి ట్రయల్ సురక్షిత ఫలితాలు ఇవ్వడంతో ప్రస్తుతం 28 రోజులు, 90 రోజుల పాటు వైసీటీ529ను తీసుకునే 50 మంది పురుషులతో రెండవ దశ (ఫేజ్ 1బీ/2ఏ) ట్రయల్ కొనసాగుతోంది. ఈ ట్రయల్ స్పెర్మ్ సంఖ్యపై ప్రభావాన్ని, దీర్ఘకాలిక సురక్షితను అంచనా వేస్తుంది. ఔషధం పూర్తి సమర్థతను నిర్ధారించడానికి మరిన్ని విస్తృత అధ్యయనాలు అవసరం, కానీ ప్రస్తుత ప్రారంభ ఫలితాలు అత్యంత ఆశాజనకంగా ఉన్నాయి.

# వణుకుపుట్టించే 'రుద్ర' దళం

>> ఆయన అమరవీరులకు నివాళులర్పించారు. భారత సైన్యం ప్రస్తుత సవాళ్లను విజయవంతంగా ఎదుర్కోవడంతో పాటు భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఉండేలా ఈ యూనిట్‌ను ఏర్పాటు చేసినట్లు జనరల్ ద్వివేది వెల్లడించారు. పదాతిదళం, యాంత్రిక పదాతిదళం, సాయుధ యూనిట్లు ఫిరంగిదళం, ప్రత్యేక దళాలు, మానవరహిత వైమానిక వ్యవస్థలు వంటి వ్యవస్థలతో కూడిన దళం ఇది అని వెల్లడించారు. సరిహద్దులోని శత్రువుల వెన్నులో వణుకు పుట్టించేందుకు భైరవ్ అనే లైట్ కమాండో బెటాలియన్ యూనిట్లను కూడా ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కాగా ఇప్పటికే రెండు పదాతిదళ బ్రిగేడ్‌లు రుద్రలో భాగమైనట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్ గురించి కూడా ఆయన మాట్లాడారు. పాక్‌లోని ఉగ్రమూకల సదుపాయాలను నేలమట్టం చేయడంతో పాటు ఆ దేశ దుందుడుకు చర్యలను కూడా అరికట్టామన్నారు. భారత్ నిర్ణయాత్మకమైన విజయం సాధించిందని వ్యాఖ్యానించారు.

# ఏ పార్టీలోనూ విలీనం కాదు

>> హెచ్‌సియు భూములు తాకట్టు పెట్టడం, ఫ్యూచర్ సిటీలో రూ.1,660 కోట్ల కాంట్రాక్ట్ ఇవ్వడం కుంభకోణాల నుంచి అటెన్షన్ డైవర్షన్ చేసేందుకే బిఆర్ఎస్ విలీనం అనే పనికిరాని, పస లేని చెత్త అంశాన్ని మళ్లీ తెరపైకి తెస్తున్నారని ఆరోపించారు. సిఎం రమేష్, సిఎం రేవంత్ ఇద్దరూ కలిసి వస్తే..హెచ్‌సియు రూ. 10000 కోట్ల స్కాం పైనా..రూ.1,660 కోట్ల రోడ్ కాంట్రాక్ట్ స్కాంపై.. రెండింటిపైనా కలిసి తాను చర్చకు సిద్ధం అని ట్వీట్ చేశారు. దేశంలో ఎక్కడా జరగని దిక్కుమాలిన కుమ్మక్కు రాజకీయం తెలంగాణలో జరుగుతున్నదని మండిపడ్డారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బావమరిదికి రూ. 1137 కోట్ల అమృత్ కాంట్రాక్టు..రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో బిజెపి ఎంపి సిఎం రమేశ్‌కు రూ.1,660 కోట్ల రోడ్డు కాంట్రాక్టు..ఇంతకన్నా దిగజారుడు రాజకీయం.. దౌర్భాగ్యపు దందా ఇంకోటి ఉంటదా..? అని ప్రశ్నించారు.

సిఎం రేవంత్.. సిఎం రమేష్ ఇద్దరి బాగోతం తాను బయటపెట్టడంతో కుడిదిలో పడిన ఎలుకలా ఇద్దరూ కొట్టుకుంటున్నారని విమర్శించారు. లేని ఫ్యూచర్ సిటీకి రోడ్డు అట.. దానికి రూ.1,660 కోట్ల కాంట్రాక్టు అట..అంటూ ఎద్దేవా చేశారు. హెచ్‌సియు భూములు తాకట్టు పెట్టి రూ.10 వేల కోట్లు దోచుకున్న పనికి సహకరించినందుకు ఒక రోడ్డును క్రియేట్ చేశారని ఆరోపించారు.

తాను ఆనాడు చెప్పింది ఈనాడు రుజువైందని, దొంగతనం బయటపడటంతో.. అటెన్షన్ డైవర్షన్‌కు పనికి రాని కథలు చెబుతున్నారని మండిపడ్డారు.

# విద్యార్థుల ఆత్మహత్యల పెరుగుదలపై కదిలిపోయిన సుప్రీంకోర్టు

## నివారణకు సంచలన మార్గదర్శకాలు విడుదల

## విశాఖలో నీట్ విద్యార్థి ఆత్మహత్యపై సిబిఐ దర్యాప్తునకు ఆదేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 26:** దేశంలోని విద్యాసంస్థల్లో పెరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలను అరికట్టేందుకు సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కీలక మార్గదర్శకాలను సూచించింది. దేశవ్యాప్తంగా విద్యార్థులకు మానసిక ఆరోగ్యం, మద్దతు అందించేందుకు ఉద్దేశించిన 15 సమగ్ర మార్గదర్శకాలను సుప్రీంకోర్టు తాజాగా జారీ చేసింది. ఈ మార్గదర్శకాలు స్కూళ్లు, కళాశాలలు, కోచింగ్ సెంటర్లు, విశ్వవిద్యాలయాలు, శిక్షణ అకాడమీలు, హాస్టళ్లు సహా అన్ని విద్యా సంస్థలకూ వర్తిస్తాయి. విద్యా ఒత్తిడి, పరీక్షల భయం, సంస్థాగత మద్దతు లోపం వల్లే విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని కోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. తప్పనిసరిగా మానసిక ఆరోగ్య కౌన్సెలింగ్ విద్యా సంస్థల్లో తప్పనిసరి చేయాలని, మానసిక ఆరోగ్య కౌన్సెలింగ్, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలు, నియంత్రణ పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా బెంచ్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యంగా పరీక్షల సమయంలో, విద్యా సంవత్సరం మార్పు సమయంలో చిన్న బ్యాచ్‌లకు ప్రత్యేక కౌన్సెలర్లు లేదా మెంటర్లను నియమించాలి. వారు గోప్యంగా మద్దతును అందించాలని కోర్టు ఉద్ఘాటించింది. సుప్రీంకోర్టు జారీ చేసిన 15 మార్గదర్శకాలలో ముఖ్యమైనవి ఇవే...బోధన, బోధనేతర సిబ్బంది అందరూ సంవత్సరానికి రెండు సార్లు తప్పనిసరిగా మానసిక ఆరోగ్య శిక్షణ పొందాలి. ఈ శిక్షణలో మానసిక సహాయం, ఒత్తిడి సంకేతాల గుర్తింపు, స్వీయహాని సందర్భాల్లో స్పందన, సరైన సహాయానికి రిఫరల్ ప్రక్రియలపై దృష్టి ఉంటుంది. విద్యార్థులతో సున్నితంగా, సమగ్రంగా వ్యవహరించేలా సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి. లైంగిక వేధింపులు, ర్యాగింగ్, ఇతర ఫిర్యాదులను పరిష్కరించేందుకు అంతర్గత కమిటీలు ఏర్పాటు చేయాలి. బాధిత విద్యార్థులకు తక్షణమే మానసిక సామాజిక మద్దతు అందించాలి. తల్లి దండ్రులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్ర మాలు, విద్యార్థులకు మానసిక ఆరోగ్య సాక్షరత, భావోద్వేగ నియంత్రణ, జీవన నైపుణ్యాలను విద్యా కార్యకలాపాల్లో భాగంగా చేర్చాలి. టెలిమానస్ వంటి జాతీయ సూసైడ్ హెల్ప్‌లైన్ నంబర్లను హాస్టళ్లు, తరగతి గదులు, సాధారణ ప్రాంతాలు, వెబ్‌సైట్లలో పెద్ద అక్షరాలతో స్పష్టంగా ప్రదర్శించాలి. విద్యార్థుల మానసిక ఆరోగ్య రికార్డులను అత్యంత గోప్యంగా నిర్వహించాలి. ఎన్సీఆర్బీ డేటా ఆధారంగా..ఈ మార్గదర్శకాలు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) 2022 డేటా ఆధారంగా జారీ చేయబడ్డాయి. 2022లో దేశవ్యాప్తంగా నమోదైన 1,70,924 ఆత్మహత్యలలో 13,044 విద్యార్థులవి. అంటే ప్రతి 100 ఆత్మహత్యలలో 8 మంది విద్యార్థులు ఉన్నారని ఎన్సీ ఆర్బీ నివేదించింది. 2001లో ఈ సంఖ్య 5,425గా ఉండగా, 2022లో 2,248 మంది విద్యార్థులు పరీక్షలలో విఫలమైన కారణంగా ఆత్మహత్య చేసుకున్నారు. ఈ గణాంకాలు విద్యా సంస్థల్లో ఉన్న సిస్టమాటిక్ లోపాలను స్పష్టంగా సూచిస్తున్నాయని కోర్టు పేర్కొంది. ఈ చారిత్రాత్మక తీర్పు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో నీట్‌కు సిద్ధమవుతున్న 17 ఏళ్ల విద్యార్థిని 2023 జూలై 14న ఆత్మహత్య చేసుకున్న కేసు సందర్భంగా వెలువడింది. ఆమె తండ్రి సీబీఐ దర్యాప్తు కోరగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు 2024 ఫిబ్రవరి 14న ఆ దరఖాస్తును తిరస్కరించింది. దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన తండ్రి ఫిర్యాదుతో కోర్టు ఇప్పుడు సీబీఐ దర్యాప్తుకు ఆదేశించింది. సుప్రీంకోర్టు రాజ్యాంగంలోని ఆర్టికల్ 32, 141 ప్రకారం ఈ మార్గదర్శకాలను జారీ చేసింది. పార్లమెంటు లేదా రాష్ట్ర శాసనసభలు తగిన చట్టం రూపొందించే వరకు ఇవి చట్టంగా అమలులో ఉంటాయి. ఈ మార్గదర్శకాలు, సుప్రీంకోర్టు మాజీ జడ్జి జస్టిస్ రవీంద్ర ఎస్ భట్ నేతృత్వంలోని విద్యార్థుల మానసిక ఆరోగ్య జాతీయ టాస్క్ ఫోర్స్ పనిని మరింత బలపరుస్తాయని కోర్టు తెలిపింది.



గోవా గవర్నర్‌గా అశోక్‌గజపతిరాజు బాధ్యతలు స్వీకరిస్తున్న దృశ్యం

## గోవా గవర్నర్‌గా అశోక్ గజపతిరాజు బాధ్యతలు

**విజయవాడ, జూలై 26, ప్రభాతవార్తప్రతినిధి:** గోవా గవర్నర్‌గా పూసపాటి అశోక్ గజపతిరాజు ప్రమాణం చేశారు. ఎపికి చెందిన అశోక్ గజపతిరాజును ఇటీవల రాష్ట్రపతి గోవా గవర్నర్‌గా నియమించారు. బాంబై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్‌అరాధే శనివారం ఉదయం అశోక్ గజపతిరాజుతో ప్రమాణం చేయించారు. రాజ్‌భవన్ బంగ్లా దర్బార్‌హాలులో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రమాణస్వీకారం చేసిన వెంటనే ఆయన బాధ్యతలను స్వీకరించారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమోద్‌సావంత్, మంత్రివర్గసభ్యులు, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎపి అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు నారా లోకేష్, సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్ తదితరులు హాజరై అశోక్‌గజపతిరాజుకు అభినందనలు తెలిపారు. గవర్నర్ పదవికి వన్నె తీసుకునిరావాలని ఆకాంక్షించారు. ఎంపీగా, కేంద్రమంత్రిగా అశోక్ గజపతి రాజు గతంలో పనిచేసారు. రాజకుటుంబానికి చెందినప్పటికీ ఆయన అత్యంత సాదాసీదాగా ఉండేవారు. ఆయనను టిడిపి కేంద్ర ప్రభుత్వానికి గవర్నర్ పదవికి సిఫార్సు చేసింది.

## రాష్ట్రంలో భారీ నుంచి అతిభారీ వర్షం

**హైదరాబాద్, జూలై 26,ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఆదివారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున్న ఆ రెండు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.గంటకు 30 నుంచి 40 కి. మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నట్టు తెలిపింది.

## తెలంగాణ ఎన్ఆర్ఐపై దురుసుతనం తగదు

### బాల్కొండ ఎమ్మెల్యేకు మంత్రి వివేక్ హితవు

**హైదరబాద్, జూలై 26, ప్రభాతవార్త:** బాల్కొండ ఎమ్మెల్యేకు తెంగాణ ఎన్ఆర్ఐ పట్ల దురుసుతనం తగదని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం బిఆర్ఎస్ దాడిలో గాయపడ్డ ఎన్ఆర్ఐ అడ్వైసరీ కమిటీ మెంబర్ నంగి దేవేందర్ రెడ్డిని తన నివాసంలో కలిసి మంత్రి వివేక్ వెంకటస్వామి పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేవేందర్‌రెడ్డి త్వరగా కోలుకోని గల్ఫ్ ప్రవాసీ యులకు సేవలను కొనసాగించాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. ప్రజాసమస్యలపై పోరాడే ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. బాల్కొండ శాసనసభ్యుడు తెలంగాణ ఎన్ఆర్ఐ లకు ఎలాంటి సందేశం ఇద్దామను కుంటున్నడని మంత్రి వివేక్ ప్రశ్నించారు.ప్రజాపాలనాలో మృతధన సహాయం ఎంత మందికి అందిందో ఆధారాలతో సహా ఇంటికివచ్చి సమాచారం ఇస్తామని ఎన్ఆర్ఐ అడ్వైసరీ కమిటీ మెంబర్ నంగి దేవేందర్‌రెడ్డి ఇంటికి వస్తే, గూండాలతో దాడి చేయిం చడం ప్రజాస్వామ్యం లో చెల్లదు.. దాడులకు ప్రతిదాడులు చెయ్యటం పెద్ద విషయం కాదు కానీ కాంగ్రేస్ పార్టీ సిద్ధాంతం ఆది కాదు అని మంత్రి అన్నారు.

## ఎపి మద్యం కేసులో హైదరాబాద్‌లో సిట్ సోదాలు

**హైదరాబాద్, జూలై 26, ప్రభాతవార్త:** ఎపిలో సంచలనం రేపిన మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి ఆ రాష్ట్ర సిట్ పోలీసులు శనివారం నా డు హైదరాబాద్‌లోని పలు చోట్ల సోదాలు చేశారు. ఈ కేసులో కీలక నిందితుడు రాజ్ కసిరెడ్డికి సంబంధించి నానాక్‌రాంగూడలో గల కార్యాలయం లో సిట్ అధికారులు నాలుగు గంటల పాటు సోదాలు చేసి, పలు పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. దీంతో పాటు గచ్చిబౌలి, బంజారాహిల్స్‌లో గల భారతీ సిమెంట్స్ కార్యాలయం, బాలాజి గోవిందప్ప కార్యాలయంలోనూ సోదాలు జరిగాయి. నానక్‌రాంగూడలోని చాణక్యకు చెందిన టిగ్రిల్ రెస్టారెంట్‌లోనూ సిట్ అధికారులు సోదాలు నిర్వహించారు. మద్యం కేసులో సిండికేట్ గా వున్న నిందితులు హైదరాబాద్‌లో గతంలో సమావేశాలు నిర్వహించినట్లు తేలడంతో వీరు ఎక్కడ భేటీ అయ్యారనే దానిపై సిట్ అధికారులు ఆరా తీశారు ఏడు అధికారు ల బృందంతో వచ్చిన సిట్ బృందం రాత్రి ఎనిమిది గంటల వరకు సోదాలు నిర్వహించింది. సోదాల సమయంలో అక్కడ వున్న సిబ్బందిని ఎక్కడికి వెళ్లకుండా, ఎవరికి ఫోన్లు చేయకుం డా సిట్ అధికారులు కట్టడి చేశారు. సిట్ అధికారుల తనిఖీ సమయంలో స్థానిక పోలీసులు వారికి సహకరించారు.



## చౌటుప్పల్‌లో ఘోర రోడ్డుప్రమాదం

### ఆంధ్రకు చెందిన ఇద్దరు డిఎస్పీలు దుర్మరణం

**చౌటుప్పల్, ప్రభాతవార్త:** హైదరాబాద్-విజయవాడ ప్రధాన జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం ఖైతాపురం గ్రామం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకొని ఆంధ్రకు చెందిన ఇద్దరు డీఎస్పీలు మృతి చెందారు. వేగంగా వెళ్తున్న లారీ.. ఏపీకి చెందిన పోలీసులు వెళ్తున్న కారును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న డీఎస్పీ చక్రధరరావు, శాంతారావు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. అడిషనల్ ఎస్పీ ప్రసాద్ కు తీవ్ర గాయాలు అయ్యాయి. కారు డ్రైవర్ నర్సింగరావు పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స నిమిత్తం హుటాహుటిన స్థానిక ఆసుపత్రికి తరలించారు. కాగా ఏపీకి చెందిన పోలీసు అధికారులు విజయవాడ నుండి హైదరా బాద్ వస్తుండగా మార్గమధ్యంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సంఘటన విషయం తెలుసుకున్న ఏసీపీ పట్నొల్ల మధుసూదన్‌రెడ్డి సంఘటన స్థలికి చేరుకుని ప్రమాద విషయాన్ని సమీక్షి ంచారు. క్షతగాత్రు లను ఆస్పత్రికి తరలించారు మృతదేహాలను చౌటుప్పల్ ఆస్పత్రికి తరలిం చారు ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఓర్వలేక కెటిఆర్ నిందలు

### నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి

**హైదరాబాద్, జూలై 26, ప్రభాతవార్త:** ప్రతి ఇంటికి సంక్షేమ కార్యక్రమాలు వెళ్తున్నాయని ఓర్వలేకనే కేటీఆర్ నిందలు వేస్తున్నారని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్ రెడ్డి విమర్శించారు. సిఎల్‌పిలో శనివారం మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో 99శాతం సీట్లు కాంగ్రెస్ గెలుస్తుందని జోస్యం చెప్పారు. 24 గంటలపాటు సీఎం పనిచేస్తున్నారుని వివరించారు. ప్రతిపక్ష పార్టీ జాగ్రత్తగా ఉండాలి, ఇష్టానుసారంగా మాట్లాడితే ఖబడ్దార్ అని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీనే గెలుస్తుందని అన్నారు. నిబంధనల ప్రకారమే రిత్విక్ కంపెనీకి ఫ్యూచర్‌సిటీ రోడ్డు కాంట్రాక్ట్ వచ్చిందన్నారు. ఎల్‌అండ్‌టీ వంటి కంపెనీలు బిడ్డింగ్‌లో పాల్గొన్నాయన్నారు. బిఆర్ఎస్ హయాంలో పనులన్ని ఆంధ్ర కాంట్రాక్టర్లే చేశారని చెప్పారు.

# బిసి బిల్లు ప్రవేశపెట్టిందే బిజెపి

### మోడీ కేబినెట్‌లో 27 మంది మంత్రులు వారే

### కాంగ్రెస్ హాయాంలో బిసి ముఖ్యమంత్రులెందరు?

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు



బిజెపి కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 26, ప్రభాతవార్త:** కులగణన ఒక బూటకమని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్‌రావు ఆరోపించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ కులగణన చేపట్టి 46శాతం బీసీలు ఉన్నారని తేల్చారని, 42శాతం బీసీలకు రిజర్వేషన్ ప్రకటించి అందులో 10శాతం ముస్లింలుక ఇస్తే బీసీలకే మిగిలింది 32 శాతమేనని కులగణన ఒక బూటకమని విమర్శించారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చి 19నెలలు కావస్తున్నా నెట్టెంపాడు, జూరాల ప్రాజెక్టు లను పూర్తి చేయలేదని, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. పాలమూరు తనకు రాజకీయ బిక్ష పెట్టిందని తన ఆత్మ పాలమూరు అని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో ఎంత మందిని బిసి ముఖ్య మంత్రులు చేశారో చెప్పాలని, మోడీ కేబినెట్లో 27 మంది బీసీ మంత్రులు ఉన్నారని స్పష్టం చేశారు. రేవంత్ కేబినెట్లో కేవలం ఇద్దరు బీసీమంత్రులుకు మాత్రమే అవకాశం కల్పించారని ఆరోపించారు. రాష్ట్రంలో బీసీ హాస్టల్‌లో పిల్లలు చనిపోతున్నా పట్టించుకోవడం లేదని, పురుగుల అన్నం తిని ఆస్పత్రి పాలవుతున్న వారిని అడిగేదిక్కు లేకుండా పోయిందని చెప్పారు. పాలమూరు ప్రాజెక్టులను పట్టించుకోకుండా అవార్డుల కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్తున్నారని ఆరోపించారు. అంతకుముందు పాలమూరు ఎంపీ డీకే అరుణమ్మ మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన పార్టీ భారతీయ జనతా పార్టీ జైశ్రీరామ్ అంటూనే గత పార్లమెంటు ఎన్నికల్లో తన ఓటమి కోసం పార్టీలోని కొందరు పనిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని అందుకు సంబంధించిన ఆధారాలన్నీ పార్టీ అధిష్టానానికి ఇవ్వడం జరిగిందన్నారు. అంతకముందు డీకే అరుణ వర్సెస్ బీజేపీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతికుమార్ కార్యకర్తల మధ్య కొంత వాగ్వాదం చోటు చేసుకున్నది. కార్య క్రమంలో జాతీయ శాంతికుమార్‌ను సస్పెండ్ చేయాలంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. కౌన్సిల్ సభ్యురాలు జి.పద్మజారెడ్డి, బండారి శాంతి కుమార్,రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు నాగురావు నామాజీ, రాష్ట్ర అధికార ప్రతినిధి కట్ట సుధాకర్‌రెడ్డి, నాయకులు ఎగ్గిని నర్సింలు, డోకూర్ పవన్ కుమార్ రెడ్డి, పడాకుల బాలరాజు, జిల్లా అధ్యక్షులు పి శ్రీనివాస్ రెడ్డి, కొత్తకోట కిరణ్ కుమార్ రెడ్డి, నాగిలి గారి రమేష్ కుమార్, రాజేష్, కొండా ప్రశాంత్‌రెడ్డి నాగేశ్వర్‌రెడ్డి, పాండురంగారెడ్డి, రాపోతుల శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపి డికె అరుణ

## నేను ఓడిపోవాలని దావత్‌లు ఇచ్చారు..

### పార్టీ వ్యతిరేకులపై చర్యలు తీసుకోవాలి

### రాష్ట్రఅధ్యక్షుడి ఎదుట ఎంపి డికె అరుణ వ్యాఖ్య

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 26, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ ఎంపిగా నేను ఓడిపోవాలని, అందుకోసం పనిచేసిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఎంపి డికె అరుణ కోరారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన పాలమూరు జిల్లా కార్యకర్తల సమ్మేళనానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పార్టీలైన్ క్రాస్‌చేసినోళ్ల తోకలు కత్తిరించాల్సిందేనని కోరారు. కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలని, క్రమశిక్షణకు మారుపేరు బిజెపి అని చెబుతామని, ఎవరికి టికెట్ ఇచ్చినా అందరం కలిసే పనిచేస్తామని చెప్పి పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జైశ్రీరామ్ అంటాము కదా.. శ్రీరామునిమీద ఒట్టేసి చెప్పండి మీరంతా బిజెపికి అనుకూలంగా పనిచేశారా? గత ఎన్నికల్లో నేను ఓడిపోవాలని ఎవరు పనిచేసారో.. ఎవరు అనుకూలంగా పనిచేసారో పార్టీ దగ్గర రిపోర్ట్ ఉన్నదని, ఆ రిపోర్ట్‌ను రాష్ట్ర అధ్యక్షుడు పునఃపరిశీలించాలని కోరారు. ఇలా క్రమశిక్షణరాహిత్యంగా వ్యవహరిస్తున్న వారిని వెంటనే పార్టీ నుంచి తొలగించాలి. రాష్ట్ర నూతన అధ్యక్షుడు రామచందర్‌రావు ఆ దిశగా ఆలోచించాలని కోరారు. మీరు న్యూట్రల్‌గా ఉంటారని మేమంతా నమ్ముతున్నామంటూ చెప్పుకొచ్చారు.

# రాంచందర్‌రావు మంచోడు.. కదలడు, మెదలడు!

### దళితులను వంచించింది కెసిఆర్, ఎస్‌సి సబ్‌ప్లాన్ తెచ్చింది కాంగ్రెస్: ఎఐసిసి కార్యదర్శి సంపత్‌కుమార్

**హైదరాబాద్, జూలై 26, ప్రభాతవార్త:** బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు మంచోడు, సౌమ్యుడు కదలడు, మెదలడు ముద్దపప్పు అని, హరీశ్ రావుకు మెంటల్ ఎక్కినట్లు ఉంది.. మాట్లాడేందుకు ఏమిలేక అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ఎఐసిసి కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. శనివారం గాంధీభవన్‌లో ఎఐసిసి సెక్రటరీ సంపత్ మాట్లాడుతూ రాంచందర్‌రావు ముద్దపప్పు తెలంగాణ బిజెపి ఇక సప్పగా ఉంటది మెత్తగా ఉంటది అంటూ వ్యాఖ్యానించారు. ప్రభుత్వం అవసరం ఉన్న ప్రతి చోటా విడుతల వారీగా నీళ్లు విడుదల చేస్తుందని అది నిరంతరం చేసే ప్రక్రియ దీనికి హరీష్ రావు ముందే ఓవర్ యాక్షన్ చేస్తూ నీళ్లు విడుస్తారా లేదా? నేను వెళ్లి విడుదల చేస్తా అని అంటాడని విమర్శించారు. ప్రభుత్వం విడుదల చేయగానే నేను చెప్పిన కాబట్టి నీళ్లు విడుదల చేశారని గొప్పలు చెప్పుకోవడానికి ప్రకటనలు చేస్తున్నాడని దుయ్యబట్టారు. ఆగస్టు 15కు గాంధీ భవన్‌లో జెండా ఆవిష్కరణ చేస్తారా చెయ్యరా మహేష్ కుమార్‌గౌడ్‌పై హరీశ్ చేయడం మానుకోవాలని సూచించారు. ఇక్కడ ఆగస్టు 15 కి జనవరి 26 జెండా ఆవిష్కరణ చేస్తామని సంపత్ ధీమా వ్యక్తంచేశారు. ఇక్కడ జెండా ఆవిష్కరణ చేయగానే నేను అన్నాను కాబట్టి చేశారు అంటాడు హరీష్ రావు గొప్పలు చెప్పుకొంటాడని సంపత్ వ్యాఖ్యానించారు. కెటిఆర్‌కు దళితుల పక్షాన విజ్ఞప్తి దళితులను వాడుకొని రాజకీయం చేయకు అని హితవు చెప్పారు. పదేళ్లు అధికారంలో ఉండి ఉద్యమంలో దళితుల పాత్ర కీలకం దళితులను వాడుకొని అధికారంలో వచ్చిన మీరు దళితులను మోసం చేశారని ఆరోపించారు. పదేళ్ళ దళితుల పట్ల మీ వైఖరి,ఈ రెండేళ్ళ పాలనపై మా వైఖరి పై చర్చకు సిద్ధమా? అని ఆయన సవాల్ విసిరారు. దళిత ముఖ్యమంత్రి అన్న దగ్గరి నుండి ఉపముఖ్యమంత్రి రాజయ్య ను బర్తరఫ్ చేయడం, దళితులకు మూడుఎకరాల భూములు,నేరెళ్ళ ఘటనలో దళితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన చరిత్ర బిఆర్ఎస్ పార్టీదని పదేళ్ళ పాలన సంఘటనలు వివరించారు. అనేక మంది దళిత యువతి, యువకులను పొట్ట పెట్టుకున్న రోజులు ప్రజలు మరిచిపోలేదని అన్నారు. దళిత పక్షపాతి అయినా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని దళిత వ్యతిరేకమైందిగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆరో పించారు. ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నాం,మీ ప్రభుత్వం గతంలో ఒక్కరూ కూడ దళితులు క్యాబినెట్ లో లేరని అన్నారు. ఇప్పుడు నలుగురు మంత్రులు ఉన్నారని ఆయన చెప్పారు.ఎస్‌సి సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పట్టించిన చరిత్ర మీది 30 వేల కోట్ల రూపాయలు కేటాయించిన చరిత్ర మాది అన్నారు. అన్ని రంగాల్లో దళితులు అభివృద్ధి చెందుతున్నారని ఆయన తెలిపారు. రాజ్యాంగ పరి రక్షకుడు రేవంత్ రెడ్డి దళిత పరి రక్షకుడు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పై అడ్డగోలుగా మాట్లాడితే దళిత సమాజం ఊరుకోదని కెటిఆర్‌ను హెచ్చరించారు.

## అహంకారంతో పోలీసులను దూషించడం తగదు

### కెటిఆర్‌కు భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి హితవు

**హైదరాబాద్, జూలై 26,ప్రభాతవార్త:** పోలీసులను దుర్భాషలాడటమే కాకుండా అన్నం తింటున్నారా లేక గడ్డి తింటున్నారా అని కెటిఆర్ నోరు జారడం తగదని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి హితవు చెప్పారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ కెటిఆర్ తీరు తెలంగాణ ప్రజలు తల వంచుకునేలా ఉందని ఆవేదన చెందారు. కెసిఆర్ అధికారంలో ఉన్న పదేళ్ల పాటు పనిచేసింది ఇదే పోలీసులు అన్న విషయా న్ని మరిచి పోతున్నారని గుర్తుచేశారు. తమ హయాంలో పోలీసులు, అధికారులను మెచ్చుకున్న కెటిఆర్ ఇప్పుడు దూషిస్తున్నాడని అన్నారు. అసెంబ్లీలో చిత్తుగా ఓడిపోయారు.. పార్లమెంటు ఎన్నికల్లో జీరో చేశారు.. అయినా అహంకారం తగ్గలేదని అన్నారు. అవినీతి డబ్బుతో కేటీఆర్ కు అహంకారం పెరిగిపోయిందని భాష్యం చెప్పారు. అవినీతి డబ్బు మదంతో కెటిఆర్ మాట్లాడు తున్నారని ఆరోపించారు. కెటిఆర్ తన తీరు మార్చుకోకపోతే కాంగ్రెస్ కార్యకర్తలు తగిన బుద్ధి చెపుతారని హెచ్చరించారు.

# కెటిఆర్.. సిఎం రమేష్ ప్రశ్నలకు జవాబు ఇవ్వు

### ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్

**హైదరాబాద్, జూలై 26,ప్రభాతవార్త:** బిజెపి లో బిఆర్ ఎస్ విలీనం కోసం సిఎం రమేష్ ఇంటికి వెళ్ళావా లేదా? సిఎం రమేష్ అడిగిన ప్రశ్నకు ముందు సమాధానం చెప్పు అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నిలదీశారు. సిఎల్‌పిలో ఆయన శనివారం మాట్లాడుతూ కెటిఆర్ సొల్లు వాగుడు కట్టిపెట్టు తెలంగాణ కు పట్టిన శని నువ్వు మీ అయ్యానే అని దుయ్యబట్టారు. సోనియమ్మ ఇచ్చిన తెలంగాణ ను సర్వనాశనం చేసిన కోవర్టులు మీరే అని అన్నారు. పసిపాప లాంటి రాష్టాన్ని పీల్చి పిప్పి చేసిన దుర్మార్గులు మీరు అని అని ఆవేదన చెందారు. పదేళ్లు అధికారం లో ఉన్నపుడు ఆంధ్రా వాళ్ళతో తిరిగింది మీరు కాదా అని నిలదీశారు. ఇప్పుడు బంక చెర్లను అడ్డుపెట్టుకొని తెలంగాణ సెంటిమెంట్ రగిలించడానికి ప్రయత్నం చేస్తున్నావ్ అని అన్నారు. కెటిఆర్ ముందు సీఎం రమేష్ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పు?సిబిఐ,ఈడీ విచారణ ఆపాలని సిఎం రమేష్ ని బతిమాలు కున్నావా లేదా?సీఎం రమేష్ అడిగిన ప్రశ్నలకు నోరెందుకు విప్పడం లేదని అన్నారు. ఢిల్లీలో నీ చీకటి పనులను నీ చెల్లె ఇప్పుడో బయట పెట్టిందన్నారు. కెటిఆర్ నీకు ధైర్యముంటే కవిత, సీఎం రమేష్‌లకు సమాధానం చెప్పు అని సవాల్ విసిరారు. లేకపోతే నోరుమూసుకొని గెస్ట్ హౌస్ లో పడుకో అని హితవు చెప్పారు.

## కొనసాగుతున్న నీటి పారుదల శాఖ మాజీ ఇఎన్‌సి మురళీధర్‌రావు కస్టడీ విచారణ

**హైదరాబాద్, జూలై 26, ప్రభాతవార్త:** నీటి పారుదల శాఖలో పదవీ విరమణ పొందిన తరువాత కూడా 14 ఏళ్ల పాటు ఈఎన్‌సిగా పనిచేసిన మురళీధర్ రావు ఎసిబి కస్టడీ విచారణ కొనసాగుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలకు సంబంధించి విచారణ సాగుతుండగా ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన కేసులో మురళీధర్ రావు అరెస్టవడం తెలిసిందే. ఆయన వద్ద వందల కోట్ల రూపాయల ఆస్తులు లభిండచంతో మరింతగా విచారిం చేందుకు ఐదు రోజుల పాటు కస్టడీ నిమిత్తం గత బుధవారం నాడు ఎసిబి అధికారులు అదుపులోకి తీసుకోవడం తెలిసిందే. అప్పటి నుంచి ఆయన ను బంజారాహిల్స్‌లోని ఎసిబి ప్రధాన కార్యాలయంలో ప్రతీ రోజు ఎనిమిది గంటల పాటు విచారిస్తున్నారు. ఈ విచారణ శనివారానికి నాలుగవ రోజుకు చేరగా ఆదివారంతో ముగియనుంది. కాగా మురళీధర్ రావు కస్టడీ విచారణలో ఎసిబి సంచలన విషయాలను వెలికి తీసింది. తన కుమారు డు అభిషేక్‌కు చెందిన కంపెనీల్లో ఆయన వందల కోట్ల రూపాయలు పెట్టుబడులుగా పెట్టినట్లు ఎసిబి గుర్తించింది. ఈ క్రమంలో ఆయన ఎపితో పాటు తమిళనాడు, కర్నాటకలోనూ భారీగా అక్రమాస్తులు సంపాదించాడని ఎసిబి గుర్తించింది. ఈ ఆస్తుల్లో మెజారిటీ తన కుమారుడి పేరిటే వుంచినట్లు ఎసిబి విచారణలో తేలింది. కాగా మురళీధర్ రావు తన కుమారుడు అభిషేక్‌తో పాటు ఇతర కుటుంబ సభ్యుల పేరిట ఆరు లాకర్లను బ్యాంకులో తీసుకున్నారని ఎసిబి గుర్తించింది. వీటిలో ఇప్పటి వర కు నాలుగింటిని ఎసిబి అధికారులు తెరిచి అందులోని డాక్యుమెంట్లను జప్తు చేశారు. క స్టడీ విచారణలో భాగంగా మురళీధర్ రావుతో పాటు ఆయన కుమారుడు అభిషేక్‌ను కూడా ఒకేచోట వుంచి ఎసిబి అధికారులు విచారించి కీలక విషయాలను వెలుగులోకి తెచ్చారు. కాగా ఆదివారం సాయంత్రం మురళీధర్ రావును జైలుకు పంపిన తరువాత సోమవారం నాడు కస్టడీ విచారణకు సంబంధించి ఎసిబి అధికారులు కోర్టుకు నివేదిక ఇవ్వనున్నారు.

# ఆదిలాబాద్‌లో రెచ్చిపోయిన అంతర్రాష్ట్ర దొంగలు

### ఎస్‌బిఐ ఎటిఎంపై దాడి.. రూ.14 లక్షల లూటీ

### నగల దుకాణం దోపిడీకి యత్నం

**హైదరాబాద్, జూలై 26, ప్రభాతవార్త:** తెలంగాణలో ఎటిఎంలపై దొంగల దాడులు ఆగడం లేదు. గడచిన రెండు నెలల వ్యవధిలో నాలుగుచోట్ల ఎటిఎంలపై దాడులకు పాల్పడి లక్షలాది రూపాయలు దోచుకున్న అంతరాష్ట్ర దొంగలు తాజాగా శనివారం తెల్లవారుజామున ఆదిలాబాద్ పట్టణంలో మరో ఎటిఎంపై దాడికి దిగారు. ఈ సందర్భంగా అందులోని 14 లక్షల రూపాయలను దోచుకున్నారు. ఈ ఎటిఎంపై దాడికి దిగడానికి ముందు దొంగలు సమీపంలోని ఓ నగల దుకాణంపైనా దాడికి యత్నించారు. వివరాలు ఇలావున్నాయి. ఆదిలాబాద్ పట్టణంలోని జిల్లా కలెక్టరేట్ కార్యాల యం వున్న రాంనగర్ బస్తీలో ప్రధాన రహదారిపై గల ఎస్‌బిఐ ఎటిఎంపై దొంగలు పక్కా పథకంతో దాడికి దిగారు. తెల్లవారు జామున మూడు గం టల సమయంలో ముఖాలకు ముసుగులు ధరించిన దుండగులు ముందుగా అక్కడ గల సిసి కెమెరా లపై బ్లాక్ పెయింట్ స్ప్రే చల్లారు. అనంతరం గ్యాస్ కట్టర్లతో ఎటిఎంను బద్దలు కొట్టి అందులోని 14 లక్షల రూపాయలను దోచుకున్నారు. శనివారం నాలుగో శనివారం అవడం, మరుసటి రోజు ఆదివారం రావడంతో ఎటిఎంలో భారీగా డబ్బులు వుంచుతారని భావించిన దుండగులు ముందస్తు వ్యూహం ప్రకారం దాడికి పాల్పడ్డారు. ఈ ఎటిఎంపై నాలుగేళ్ల క్రితం బిహార్‌కు చెందిన దొంగల ముఠా దాడిచేసి 20 లక్షల రూపాయలను దోచుకుంది. అప్పట్లో ఓ నగల దుకాణంలోనూ లూటీ జరిగింది. కాగా తాజా ఘటనకు ముందు దుండగులు ఎటిఎంకు సమీపంలోనే గల నగల దుకాణంపై దాడికి యత్నించారు. నగల దుకాణం షటర్ల తాళాలు బద్దలు కొట్టేందుకు యత్నించగా అవి పగలక పోవడంతో ఎటిఎంపై దాడికి దిగారు. కాగా ఘటనా స్థలికి డిఎస్‌పి జీవన్ రెడ్డితో పా టు ఇతర అధికారులు వచ్చి పరిశీలించారు. సమీపంలోని సిసి కెమెరాలను పరిశీలించగా దుండగులు కారు లో వచ్చినట్లు తేలింది. దీనిపై జిల్లా వ్యాప్తంగా అలర్ట్ ప్రకటించి దుండగులు ప్రయాణించిన కారు కోసం గాలింపు చేబట్టారు. అంతరాష్ట్ర దొంగల ముఠా ఈ దోపిడీకి పాల్పడి ఉండవచ్చని పోలీ సులు భావిస్తున్నారు. బ్యాంకు అధికారుల ఫిర్యాదు మేరకు ఆదిలాబాద్ పట్టణ పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేబట్టారు.



ఆదిలాబాద్‌లో దోపిడీకి గురైన ఎటిఎం


తెలంగాణ ప్రభుత్వం
బండ్లగూడ జాగీర్ మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం
రంగారెడ్డి జిల్లా
C.No. E1/15/2025-26 ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండర్ ప్రకటన తేది: 25.07.2025
బండ్లగూడ జాగీర్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌చే ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా మునిసిపల్ సాధారణ నిధుల క్రింద ఆ కార్పొరేషన్‌లో అభివృద్ధి పని కొరకు నమోదిత కాంట్రాక్టర్ల నుండి టెండర్లు కోరబడుతున్నవి. పనుల సంఖ్య: 01. పనుల ధర: రూ.6.00 లక్షలు: 1) బిడ్ దాఖలు ప్రారంభ తేది: 26.07.2025 ఉ.11.00 గం. 2) బిడ్ దాఖలు ముగింపు తేది: 01.08.2025 మ.03.00 గం. వెబ్ పైన సైట్‌ను వీక్షించవచ్చును. పని యొక్క వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ @ tender.telangana.gov.in వద్ద చూడవచ్చును. తదుపరి వివరాలు మరియు స్పష్టతలకు మునిసిపల్ ఇంజనీర్, పై కార్పొరేషన్ వారి నుండి అన్ని పని రోజులలో కార్యాలయ వేళలలో పొందవచ్చును.
AEE: 9121106496 సం/- కమిషనర్, బండ్లగూడ జాగీర్ మునిసిపల్ కార్పొరేషన్
DIPR.No.5607-PP/CL/Advt/1/2025-26, తేది: 26.07.2025

రాష్ట్రంలో బిసి రిజర్వే షన్ల పెంపు ఆర్డినెన్స్ ముసాయిదాపై గవర్నర్ కేంద్ర హోం శాఖను న్యాయసలహా కోరడంతో రిజర్వేషన్ల ఖరారు కొంత ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. శుక్రవారం లోపు రిజర్వేషన్లపై తుదినిర్ణయం చెప్పాలనిప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌ను హైకోర్టు ఆదేశించింది. బిసి రిజర్వేషన్ల ఖరారుపై హైకోర్టును మరి కొంత గడువు కోరాలని రాష్ట్ర ప్రభుత్వానికి నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఈ అంశంపై హైకోర్టు ఎలా స్పందిస్తుందో అని రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. ఇదిలా ఉండగా ఉన్న తలనొప్పులు చాలవన్నట్లుగామహారాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి ఆదిలాబాద్‌లోని 14 కరమెరి మండలంలోని ముకద్దంగూడ, కోట, అంతాపూర్, పరందోలి, గౌరీ, బోలాపటార్, లెండి గూడ, ఏసాపూర్, ఇంద్రానగర్, పద్మావతి, పాల్స గూడ, నారాయణగూడ, మహారాజ్ గూడ, శంకర్‌లోధి అనే 14గ్రామాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉండేవి. తెలంగాణ ఆవిర్భావం అనంతరం ఉమ్మడి ఆదిలాబాద్ కిందకు వచ్చాయి. వాటిని మా రాష్ట్రంలో చేసుకుంటామని ప్రకటిచండంతో ఆయా గ్రామాల్లో స్థానిక ఎన్నికలు జరుగుతాయా లేదా అనే సందిగ్ధంనెలకొంది. స్థానిక ఎన్నికలు నిర్వహణ, బిసిబిల్లు తదితర అంశాలపై 25న జరిగే క్యాబినెట్ మీటింగ్‌లోచర్చించి నిర్ణయం తీసుకోవాలని నిర్ణయంతీసుకుంది. అనూహ్యంగా ఈక్యాబినెట్ మీటింగ్ 28కివాయిదా పడటంతో మీటింగ్ అనంతరం స్థానిక ఎన్నికల నిర్వహణపై స్పష్టతవచ్చేఅవకాశంఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. స్థానిక ఎన్నికల అంశంలో బిసిరిజర్వేషన్ అంశంపై ఇటు గవర్నర్ ఆమోదం కాని, అటు కేంద్రప్రభుత్వ అనుమతి కాని వచ్చేవరకు అప్పటివరకు స్థానిక ఎన్నికల నిర్వహణపైస్పష్టత కనిపించే అవకాశం లేదు. ఇదే సమయంలో స్థానిక ఎన్నికల నిర్వహణపై హై కోర్టును మరింత గడువు కోరడం తప్ప మరో గత్యంతరం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

# స్థానిక ఎన్నికలు సందిగ్ధమేనా?

అమరవాది సంపత్‌కుమార్

స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పటి నుంచి ప్రభుత్వానికి అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ఒక వైపు పెండింగ్ బిల్లులు చెల్లిస్తేనే స్థానిక ఎన్నికలకు సహకరిస్తాం లేకపోతే అడ్డుకుంటామన్న మాజీ సర్పంచ్‌ల హెచ్చరికలు, మరో వైపు స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం కల్పించాలనే డిమాండ్ వస్తుండగా అక్టోబర్ 30లో స్థానిక ఎన్నికల నిర్వహించాలని వీటికి సంబంధించి ఏర్పాట్లకు నెలరోజులు సమయం ఇస్తున్నామన్న గడువు కూడా తీరడంతో ఏమి చేయాలో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. వీటిని పరిష్కరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు రిజర్వేషన్ల పెంపు కోసం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్‌పై ఇప్పటికే అడ్వకేట్ జనరల్‌తోపాటు పలువురు సీనియర్ న్యాయవాదులతో గవర్నర్ చర్చించారు. అనంతరం ఈ బిల్లును కేంద్రానికి ఆయన పంపారు. పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్ 285 క్లాజ్ ఎ సవరించాలని ఇటీవల రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే 285 క్లాజ్ ఎ సెక్షన్‌లో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా అమలవుతాయని ఉంది. అందులో 50 శాతానికి మించకుండా అనే వాక్యాన్ని తొలగిస్తూ చట్టాన్ని సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. ఈ ఆర్డినెన్స్ ముసాయిదాపై న్యాయ సలహా కోసం తాజా గవర్నర్ కేంద్రానికి పంపించారు. అయితే గతంలో సుప్రీంకోర్టు సైతం 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఉండకూడదంటూ ఇచ్చిన తీర్పును ఈ ఆర్డినెన్స్ ఉల్లంఘించినట్లు అవుతుందా? లేదా? అంటూ గవర్నర్ అనుమానం వ్యక్తం చేశారు. అందులో భాగంగా న్యాయ సలహా కోసం కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు ఈ ఆర్డినెన్స్ పంపారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు సెప్టెంబర్ 30లోగా గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. మొదటి నెల రోజుల్లో రిజర్వేషన్లనుఖరారు చేయాలని, ఆ తర్వాతి 2 నెలల్లో ఎన్నికలు నిర్వహించాలని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. రిజర్వేషన్లు నెల రోజుల్లో ఖరారు చేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి తెలిపింది. అంటే శుక్రవారం(జులై 25)లోగా రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేయాల్సి ఉన్నది. కానీ ఇప్పటివరకు స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లపై స్పష్టత రాలేదు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం ఈ నెల 10న జరిగిన రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. దీనికి చట్టబద్ధత కల్పనకు పంచాయతీరాజ్ చట్టానికి సవరణలతో ఆర్డినెన్స్ తీసుకువచ్చి గవర్నర్‌కు పంపించగా, తాజాగా గవర్నర్‌ను




ఆర్డినెన్స్ ముసాయిదాపై న్యాయ సలహా కోసం కేంద్రానికి పంపించారు. అయితే ఆర్డినెన్స్ ఇప్పటివరకు గవర్నర్ ఆమోదం కానీ, కేంద్ర ప్రభుత్వ ఆమోదం కానీ లభించలేదు. ఈ అంశం అంత త్వరగా తేలేది కాకపోవడంతో స్థానిక సంస్థల ఎన్నికలపై రాజకీయవర్గాలలో ఉత్కంఠ నెలకొంది. ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటున్న అధికార యంత్రాంగం రాష్ట్రంలో బిసి రిజర్వేషన్లపై స్పష్టత వచ్చిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే సంకేతాలు ఉండటంతో అధికార యంత్రాంగం ముందస్తుగా అన్ని ఏర్పాట్లకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఓటర్ల జాబితాను గ్రామాలు, వార్డుల వారీగా సిద్ధం చేశారు. పోలింగ్ సిబ్బంది డాటాను సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఇటీవల కలెక్టర్లను ఆదేశించింది. జిల్లా, రెవిన్యూ డివిజన్, మండలం, పంచాయతీ, వార్డుల సంఖ్య ఆధారంగా వివరాలు ఉండాలని తెలపడంతో అందుకు సంబంధించిన వివరాలను కూడా అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం 566 ఎంపిపిలు, జడ్పీటీసీలు, 5773 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయని, వాటికి ఎన్నికలు జరుగుతాయని ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీచేసింది. గతంలో కంటే ఈసారి ఎంపీటీసీ స్థానాలు తగ్గాయి. రాష్ట్రంలో 71 గ్రామ పంచాయతీలు జీహెచ్ఎంసీ, నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీల్లో కలవడంతో ఎంపీటీసీ స్థానాలు తగ్గాయి. గత లెక్కల ప్రకారం ప్రస్తుతం 5,817 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, 570 ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల డైరెక్టర్ సృజన ఈ నెల 7న ఎంపీటీసీ డీలిమిటేషన్ షెడ్యూల్‌కు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీలు, వార్డుల సంఖ్యను ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. మొత్తం గ్రామ పంచాయతీల సంఖ్య 12,778, వార్డులసంఖ్య 1,12,694గా లెక్క తేల్చింది. గత ఎన్నికల నాటికి గ్రామపంచాయతీలు 12,848 ఉన్నాయి. కొన్ని గ్రామ పంచాయతీలు, మండలాలు పురపాలక, నగర పాలక సంస్థల్లో విలీనం కావడం వల్ల పంచాయతీల సంఖ్య తగ్గిందని అధికారులు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక ఇప్పటివరకు ఒక్కసారి మాత్రమే పంచాయతీ ఎన్నికలు 2019లో జరిగాయి. గత ఫిబ్రవరి 1వ తేదీతో పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. ఆ తర్వాత సార్వత్రిక ఎన్నికలు రావడంతో పంచాయతీ ఎన్నికలు వాయిదా పడ్డాయి. మళ్లీ జూన్‌లో పంచాయితీ ఎన్నికలు ఉంటాయని అనుకుంటే కులగణన చేస్తున్న నేపథ్యంలో పంచాయతీ ఎన్నికలు ఆలస్యమయ్యాయి. అయితే ఎప్పుడు ఎన్నికలు వచ్చినా సిద్ధంగా ఉండేలా యంత్రాంగం ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటోంది. రాష్ట్రంలో బిసి రిజర్వేషన్ల పెంపు ఆర్డినెన్స్ ముసాయిదాపై గవర్నర్ కేంద్ర హోం శాఖను న్యాయ సలహా కోరడంతో రిజర్వేషన్ల ఖరారు కొంత ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. శుక్రవారం లోపు రిజర్వేషన్లపై తుది నిర్ణయం చెప్పాలని ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌ను హైకోర్టు ఆదేశించింది. బిసి రిజర్వేషన్ల ఖరారుపై హైకోర్టును మరికొంత గడువు కోరాలని రాష్ట్ర ప్రభుత్వానికి నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఈ అంశంపై హైకోర్టు ఎలా స్పందిస్తుందో అని రాజకీయవర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. ఇదిలా ఉండగా ఉన్న తలనొప్పులు చాలవన్నట్లుగా మహారాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి ఆదిలాబాద్‌లోని 14 కరమెరి మండలంలోని ముకద్దంగూడ, కోట, అంతాపూర్, పరందోలి, గౌరీ, బోలాపటార్, లెండి గూడ, ఏసాపూర్, ఇంద్రానగర్, పద్మావతి, పాల్స గూడ, నారాయణగూడ, మహారాజ్ గూడ, శంకర్‌లోధి అనే 14గ్రామాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉండేవి. తెలంగాణఆవిర్భావం అనంతరం ఉమ్మడి ఆదిలాబాద్ కిందకు వచ్చాయి. వాటిని మా రాష్ట్రంలో చేసుకుంటామని ప్రకటిచండంతో ఆయా గ్రామాల్లో స్థానిక ఎన్నికలు జరుగుతాయా లేదా అనే సందిగ్ధంనెలకొంది. స్థానిక ఎన్నికల విషయంలో ఒక అడుగు ముందుకు, మూడు అడుగులు వెనక్కి అనేచందంగా మారిందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. స్థానిక ఎన్నికలు నిర్వహణ, బిసి బిల్లు తదితర అంశాలపై 25న జరిగే క్యాబినెట్ మీటింగ్‌లోచర్చించి నిర్ణయం తీసుకోవాలని నిర్ణయం తీసుకుంది. అనూహ్యంగా ఈ క్యాబినెట్ మీటింగ్ 28కి వాయిదా పడటంతో మీటింగ్ అనంతరం స్థానిక ఎన్నికల నిర్వహణపై స్పష్టత వచ్చే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. స్థానిక ఎన్నికల అంశంలో బిసి రిజర్వేషన్ అంశంపై ఇటు గవర్నర్ ఆమోదం కాని, అటు కేంద్ర ప్రభుత్వ అనుమతి కాని వచ్చేవరకు అప్పటి వరకు స్థానిక ఎన్నికల నిర్వహణపై స్పష్టత కనిపించే అవకాశం లేదు. ఇదే సమయంలో స్థానిక ఎన్నికల నిర్వహణపై హై కోర్టును మరింత గడువు కోరడం తప్ప మరో గత్యంతరం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ●

పశ్చిమ బెంగాల్

# మమత కొత్త బాణం !

ఎ.వి.వి ప్రసాద్

తమిళనాడు, మహారాష్ట్రలో ఊపందుకొంటున్న హిందీ వ్యతిరేక ఉద్యమం ఇప్పుడు పశ్చిమ బెంగాల్‌లో కూడా ఉధృతమవుతోంది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ 'హిందీ వ్యతిరేక కారు' ఉపయోగిస్తూ ఎన్నికలకు వెళ్లే వ్యూహం రూపొందిస్తున్నట్లుగా కనిపిస్తోంది. వచ్చే సంవత్సరం జరిగే ఎన్నికలకు ఇప్పటి నుంచే ఓటర్లను సిద్ధంచేసే పనిలో ఆమె నిమగ్నమయ్యారనీ, అందుకు ఒక ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకొన్నారనీ, దానిలో భాగంగానే భాషా ఆందోళన ప్రకటించారనీ అంటున్నారు. గత సోమవారం 'తృణమూల్ కాంగ్రెస్ అమర వీరుల సంస్మరణ' సందర్భంగా ఆమె ఓ కొత్త నినాదం తెరపైకి తేవడం గమనించవలసిన అంశం. బెంగాలీ మాట్లాడే ప్రజలు బిజెపి పాలిత రాష్ట్రాల్లో చాలా వేధింపులకు గరవుతున్నారనీ, దానికి వ్యతిరేకంగా బెంగాలీలందరూ 'నా నేల నా భాష' ఉద్యమంలో భాగం కావాలనీ ఆమె పిలుపు నిచ్చారు. 'మీ భాషను వ్యతిరేకించే వారిని ఎదుర్కోండి' అంటూ ఆమె ఇచ్చిన పిలుపు బెంగాల్‌లోనే కాక ఇతర రాష్ట్రాల్లో కూడా సంచలనం సృష్టిస్తోంది. భాషను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించడం కొత్తకాకపోయినా, ప్రజలను రెచ్చగొట్టే విధంగా ప్రకటనలు చేయడం ఇటీవల ఎక్కువవుతోంది. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన త్రిభాషా విధానాన్ని వ్యతిరేకించడంలో ముందున్న ముఖ్యమంత్రులు స్టాలిన్, పినరై విజయన్ కొత్త కొత్త ఆందోళనలు రూపొందిస్తుండడంతో మమతా బెనర్జీ కూడా అటువంటి విధానమే అనుసరిస్తున్నారు. పశ్చిమ బెంగాల్‌లో బెంగాలీ కేవలం సంభాషణ భాష మాత్రమే కాదనీ, ఒక గొప్పసంస్కృతికి చిహ్నమనీ మమత చేస్తున్న వాదనలో వాస్తవం ఉన్నాఎన్నికల ఓట్ల కోసం ఆమె భాషా ఆందోళన జరపడమేమిటనే విమర్శలు వినిపిస్తున్నాయి. రవీంద్రనాథ్ టాగోర్, నజ్రుల్ ఇస్లాం వంటి మహాకవులు ఉద్భవించిన నేల అయినా గతంలో ఎటువంటి వివాదం తలెత్తకుండానే రాజకీయాలు నడిచాయి. జ్యోతిబసు సుదీర్ఘ కాలం ముఖ్యమంత్రిగా ఉన్నా భాషాపరమైన ఆందోళనలు తలెత్తకుండానే పాలనచేశారు. బెంగాల్‌తో పాటు ఇతర ఏ భాషనైనా సమానంగా గౌరవించే సంస్కృతి మొదటి నుంచి అక్కడ విలసిల్లుతోంది. హిందీతో పాటు ఉర్దూ, పార్సీ, బిహారీ, ఒడిశా, తమిళం, తెలుగు వంటి భాషల ప్రభావం బెంగాల్‌లో ఎక్కువే ఉంది. ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతాలలో వలస ప్రజలు అధికం కనుక ఎన్నో దశాబ్దాలుగా అక్కడ మిశ్రమ సంస్కృతి కొనసాగుతోంది. ఎన్నిభాషలు ఎంతగా వ్యాప్తి చెందినా'వంగ సంస్కృతికి ఎలాంటిలోటు రాకుండా అంతా కలిసిమెలిసి జీవనం సాగిస్తున్నారు. అయితే టిఎంసి అధికారంలోకి వచ్చిన తర్వాత భాషా పరమైన వాదనలు పెరగడం, హిందీ వ్యతిరేకతను ఒక ఉద్యమంగా మార్చడంతో ప్రజలు కూడా ఆ బాటే పడుతున్నారు. 'బెంగాలీకి తగినంత గుర్తింపు' లభించేదాకా ఈ భాషా ఆందోళన కొనసాగుతుందని మమత అంటున్నారు.


మమతా బెనర్జీ

రాజకీయ లక్ష్యాలను భాష చుట్టూ తిప్పడమే ఇక్కడ ఆశ్చర్యం కలిగించే విషయం. ఈ విషయంలో తమిళనాట పరిస్థితి వేరు, బెంగాల్‌లో పరిస్థితి వేరనే చెప్పాలి. బెంగాలీ భాషకు సవాల్ విసురుతున్నది ఇంగ్లీషే గాని హిందీ కాదన్నది చాలా మంది అభిప్రాయం. రాష్ట్రంలో త్రిభాషా విధానం అవలంబిస్తున్నారు. బంగ్లా మీడియం పాఠశాలలకు మొదటి భాషగా బెంగాలీ, ఇంగ్లీషు మీడియం పాఠశాలలకు ఇంగ్లీషు, నేపాల్ మీడియం పాఠశాలలకు నేపాలీ, హిందీ మీడియం పాఠశాలలకు హిందీ మొదటి భాషగా, రెండో భాషగా ఇంగ్లీష్ లేదా హిందీ, మూడో భాషగా ఆ రెండూ కానిభాషలు ఉండాలనే నియమం పాటిస్తున్నారు. ఇంగ్లీష్, బంగ్లాతోపాటు రాష్ట్ర అధికార భాషలలో హిందీ, ఉర్దూ, ఓల్ చికీ, కుర్మాలీ, ఒడియా, తెలుగు కూడా ఉన్నాయి. రాష్ట్రంలో 202 మాతృభాషలు ఉన్నా, 5 శాతం కంటే ఎక్కువ ప్రజలు మాట్లాడే భాష బంగ్లా కనుక దానికి ఎక్కువ ప్రాధాన్యం లభించవలసిన అవసరం ఉంది. కానీ అది మాత్రమే మాట్లాడాలనడం ఒక విధంగా నిరంకుశత్వమే అవుతుంది. భాషా వాదం దక్షిణాది రాష్ట్రాల్లో ఉన్నంతగా ఉత్తరాదిలో ఎప్పుడూ ఉధృతం కాలేదు. ఇప్పుడు ఎవరైనా ఆరంభిస్తే దానిలో రాజకీయమే గాని భాషాభిమానం కనిపించదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పశ్చిమ బెంగాల్ విద్యావిధానం, జాతీయ విధానం మధ్య వైరుధ్యాలు ఎక్కువ లేకపోవడంతో భాషాపరమైన ఆందోళనలు లేకుండానే ఇంతకాలం సాగింది. బెంగాల్ లోని రాజకీయ పార్టీలు భాషాపరమైన 'వార్'కు విముఖత చూపడానికి హిందీ, ఇంగ్లీష్ పట్ల వారికి గల అభిమానమే. మమత ప్రభుత్వం గతంలో ఒకటి నుంచి టెన్త్‌వరకు బెంగాలీని తప్పని సరి చేసే నిబంధన తేవడంతో అది డార్జిలింగ్ కొండల్లో నిప్పు రాజేసింది. అక్కడి ప్రజలు ప్రత్యేక రాష్ట్రాన్ని డిమాండ్ చేస్తూ 104 రోజులు సమ్మె చేశారు కూడా. కాగా ప్రభుత్వ వ్యూహం బెడిసి కొట్టింది. ఆమె తాజాగా అనుసరిస్తున్న బంగ్లా విధానంలో కొంత కఠినత్వాన్ని ప్రదర్శిస్తున్నట్లుగా కనిపిస్తోంది. 'మీరు బెంగాల్‌కు వస్తున్నట్లయితే బెంగాలీలోనే మాట్లాడాలి. బయటినుంచి వచ్చిన వారు బెంగాలీ సంస్కృతిని విచ్ఛిన్నం చేస్తే సహించం' అంటూ ఆమె చేసిన ప్రకటన ఎటువంటి పరిణామాలకు దారితీస్తుందో? అనే సందేహం వ్యక్తమవుతోంది. రానున్న వారాలు, నెలల్లో కొత్తబ్రాండ్ సాంస్కృతిక రాజకీయాలు బెంగాలీ తెరపైప్రత్యక్షం కావొచ్చు. అనేక వివాదాలతో సతమతమవుతున్న మమత వాటినుంచి బయటపడడానికి భాషా వాదాన్ని ప్రయోగిస్తున్నట్లుగా కనిపిస్తోంది. మమత వదులుతున్న కొత్త బాణం ఎన్నికల గురిని ఎంతవరకు ఛేదించగలుగుతుందో చూడాలి. లేక బూమెరాంగ్ అయితే అధికారంపై ఆశలు వదులుకోవలసివస్తుంది. బిజెపిని వెనక్కి నెట్టడానికి మమత బెంగాలీ సాంస్కృతిక 'అస్మిత'ను ప్రేరేపిస్తే జాతీయస్థాయిలో ఆమెకు వ్యతిరేకతను పెంచదా? చూడాలి. ●

ఫ్రాన్స్

# మధ్యప్రాచ్యం యుద్ధవిరమణకు 'శాంతికిరణం'

గన్ని మోహన్

మూడేళ్లుగా ఇజ్రాయెల్‌తో పోరాడుతూ ఆకలి కేకలతో చిన్నారుల నుంచి పెద్దలవరకూ అల్లాడిపోతున్న పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తిస్తున్నట్లు ప్రకటించి యూరోప్‌లోని అతిపెద్ద దేశంఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ సంచలనం కలిగించారు. మధ్యప్రాచ్యంలో శాంతిస్థాపనకు ఇది అత్యవసరమని, ఫ్రాన్స్ ప్రజల మనోభీష్టానికి అనుగుణంగానే ఈనిర్ణయం తీసుకున్నామని మేక్రాన్ ప్రకటించారు. తక్షణమే కాల్పుల విరమణ, బందీల విడుదల, మానవతాసాయం రెట్టింపు చేయడం వంటి చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. అక్కడ శాంతి నెలకొల్పేందుకు మరో ప్రత్యామ్నాయం కనిపించడంలేదని, ప్రత్యేక దేశంగా గుర్తించడం ప్రపంచదేశాల ముందున్న తక్షణ కర్తవ్యమని చేసిన ప్రకటన సహజంగానే అమెరికా, ఇజ్రాయెల్ దేశాలకు ఆగ్రహం కలిగించింది. అయినా కూడా పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తించాల్సిందేనని, అందుకు ఐక్యరాజ్య సమితి ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో తామే స్వయంగా ప్రతిపాదన తెచ్చి ప్రత్యేక దేశంగా గుర్తించాలని నొక్కిచెపుతామని, అందుకు శాయశక్తులా కృషిచేస్తామని ప్రకటించి మేక్రాన్ అగ్రరాజ్యానికి మరింత ఆగ్రహం తెప్పించారు. ఇజ్రాయెల్‌పై ఆకస్మికదాడి చేసి యుద్ధాన్ని కొనితెచ్చుకున్న హమాస్ అధీనంలో ఉన్నపాలస్తీనా ఎప్పటికైనా మాదేనని, ఇక మేమే పాలిస్తామని చెపుతూ వచ్చిన ఇజ్రాయెల్, ఆదేశానికి మద్దతిస్తున్న అమెరికాకు సుతరాము ఇష్టంలేకపోయినా ఫ్రాన్స్ మాత్రం యూరోప్ దేశాల్లో ముందడుగువేసింది. ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధుల సభలోనేఫ్రాన్స్ పాలస్తీనాకు గుర్తింపునిస్తున్నట్లు స్వయంగా ప్రకటిస్తామని మేక్రాన్‌వెల్లడించారు. గాజాలో యుద్ధం నిలిచిపోయి, అక్కడి జనాభాను ఆకలి నుంచి రక్షించడం ప్రస్తుత అత్యవసర కర్తవ్యమని, ప్రతి ఒక్కదేశం బాధ్యత అని చెపుతున్న మేక్రాన్‌కు తోడుగా మరికొన్ని యూరోప్, యూరోపేతర దేశాలు కూడా నిలిచాయి. పశ్చిమాసియాలో చిన్న అరబ్బుదేశంగా ఉన్న పాలస్తీనాను ఇప్పటికేకొన్ని ముస్లింలీగ్ దేశాలు గుర్తించాయి. ఫ్రాన్స్ అధ్యక్షుడి ప్రకటనపై పాలస్తీనాతోపాటు కొన్నిప్రపంచ దేశాలు కూడా స్వాగతించాయి. సమితిపరిధిలోని 140కిపైగా దేశాలు ఇప్పటికే పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తించాలని ఒత్తిడిపెంచాయి. యూరోప్‌లోని ఐర్లాండ్, స్పెయిన్, నార్వేదేశాలు కూడా ఫ్రాన్స్‌తోపాటే నడిచాయి. రెండేళ్లక్రితం అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ నిర్వహించిన ఆకస్మిక దాడి అనంతరం ఇజ్రాయెల్ ప్రారంభించిన యుద్ధంఒక్కసారిగా పాలస్తీనాను అతలాకుతలం చేసింది. ఓపక్క హమాస్‌ను అంతం చేయాల్సిందేనని, ఇక ఆ సంస్థ మనుగడలో ఉండకూడదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలు చేస్తూఇజ్రాయెల్‌ను మరింతగా దాడులకు ప్రోత్సహిస్తున్న సంగతి తెలిసిందే. ఉగ్రవాదంపై కట్టుదిట్టమైన పోరును కొనసాగించడం స్వాగతించదగినదే అయితే సామాన్య పౌరులు లక్షల్లో పిట్టల్లా నేలరాలిపోతుంటే సామాజిక బాధ్యతను కూడా గుర్తెరగాలని యూరోప్ దేశాలు భావిస్తున్నాయి. పాలస్తీనాలో శాంతి నెలకొనాలని పోప్‌ఫ్రాన్సిస్ నుంచి అగ్ర నేతలు అందరూకూడా విశేష కృషిచేసినా దాడులు ఆగలేదు. గాజా వెస్ట్‌బ్యాంక్, రమల్లా వంటి నగరాలు మొత్తం స్మశానవాటికల్లా మారిపోయాయి. 55వేలమందికిపైగా చనిపోయినట్లు సమితి మానవహక్కుల విభాగం ప్రకటించింది కూడా. అలాగే అంతర్జాతీయ న్యాయస్థానం ఇప్పటికే ఇజ్రాయెల్‌కు సమన్లు జారీచేసింది. అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తున్నదని హెచ్చరించింది కూడా. అయినా కూడా ఇజ్రాయెల్ పాలకులు ఎక్కడా తగ్గిందిలేదు. సరికదా మానవతా సాయం పైనా దాడులుచేసి వారికి ఆహారం కూడా అందకుండాచేస్తున్నారు. ఇదే ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ పాలస్తీనాను గుర్తిస్తున్నట్ల ప్రకటించడానికి కారణమైంది. ఇప్పుడు ఫ్రాన్స్ దారిలో ప్రపంచ దేశాలు మొత్తం ఒక్కటిగా మారే అవకాశం ఉంది. ఈముప్పును ముందే ఊహించినఅమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్‌ప్రధాని బెంజమిన్ నెతన్యాహులు ఇప్పుడు మేక్రాన్‌పై మండిపడుతున్నారు. మధ్యప్రాచ్యంలో శాంతిస్థాపనకుమేక్రాన్ చర్యలు విఘాతం కలిగిస్తున్నాయంటూ ఎదురుదాడికి దిగారు. ఫ్రాన్స్ జి7దేశాలు, జి20 దేశాలతోపాటు ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో సభ్యదేశం. అందువల్లనే ధైర్యంగా ముందడుగు వేసి పాలస్తీనాలో శాంతిస్థాపనకు ఉపక్రమించాల్సిందేనన్న సందేశంఇచ్చింది. వాస్తవానికి ముందు ఇజ్రాయెల్‌పై హమాస్ దాడులుచేసిన సందర్భంలో ఇజ్రాయెల్‌కు సంపూర్ణమద్దతును మేక్రాన్ ప్రకటించారు. తదనంతర పరిణామాల్లో పాలస్తీ, వెస్ట్‌బ్యాంగ్, గాజా స్ట్రిప్, రమల్లా వంటి ప్రాంతాల్లో అమెరికా మద్దతుతో జరిపిన దాడులపట్ల ఫ్రాన్స్ అధ్యక్షుడు తీవ్ర నిరాశను వ్యక్తంచేసారు. ప్రస్తుతం పాలస్తీనా వాసులు ఎదుర్కొంటున్న విపత్కర పరిస్థితులకు వెన్నంటి ఉండాల్సిందేనని మేక్రాన్ భావించారు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌మాత్రం గాజాలోయుద్ధం ఉధృతంచేయాలని ఇజ్రాయెల్‌కు పిలుపునిచ్చారు. గాజాలో కాల్పుల విరమణ చర్చలు వైఫల్యానికి కారణం హమాస్ అని ఆ సంస్థకు కొనసాగే హక్కులేదని, ఇజ్రాయెల్ సైనిక చర్య సబబేనని సమర్థించారు. హమాస్‌కు శాంతిఒప్పందంపైఆసక్తి లేదని, చావుకోరుకుంటున్నదని చేసిన వ్యాఖ్యలు పాలస్తీనా వాసుల్లోభయాందోళనలురేకెత్తించాయి. గాజాకు తాము సెతం 60మిలియన్ డాలర్ల మానవతాసాయం అందించామన్నారు. కానీ హమాస్‌వల్లనే పాలస్తీ నావాసులకు జీవించడమే ముప్పుగా మారిందని ఆగ్రహావేశాలు వ్యక్తంచేసారు. ఇలాంటితరుణంలో ఫ్రాన్స్ అధ్యక్షుడు చేసిన ప్రకటన అటుపాలస్తీనా వాసులేకాదు ప్రపంచ దేశాల్లో సింహభాగం స్వాగతించాయి. కారణం ప్రస్తుతం పాలస్తీనాలోనెలకొన్న పరిస్థితులేనని చెప్పక తప్పదు. మొత్తంమీద నరమేధం, మారణహోమం, మానవప్రేరేపిత విలయంతో అట్టుడికిపోతున్న పాలస్తీనాకు మేక్రాన్‌చేసిన ప్రకటన శాంతిస్థాపనకు ఆశాకిరణంగా కనిపించింది. ●


ఇమ్మాన్యుయేల్ మేక్రాన్

# స్మార్ట్‌ఫోన్ వాడేవారికి శాపంగా రీల్స్, షార్ట్ వీడియోలు?


డాక్టర్ నీలం సంపత్

కృత్రిమ మేధస్సుతో మనిషి సృష్టికి ప్రతి సృష్టి చేస్తున్న వేళ ఆ ఆర్టిఫీషియల్ ఇంటలీజెన్స్ సృష్టించిన విషవలయంలో పడుతున్న మనిషి వర్తమాన స్థితి భారతీయ పురాణాల్లో ఒకటైన , మోహినీ భస్మాసుర ఉదంతాన్ని గుర్తు చేస్తోంది. కరోనా కల్లోలంతో బలవంతపు ఒంటరితనానికి బానిసగా మారిన మనిషి తన దైనందిన జీవనంలో వివిధ పాత్రల నూతన జీవన యానాన్ని కొనసాగించడానికి అనివార్యంగా మొబైల్ ఫోన్‌తో సహజీవనాన్ని ప్రారంభించడం ఆ మనిషిని ఊహించని రీతిలో ప్రమాదాల సుడిగుండంలోకి నెట్టి వేస్తోంది. కరోనా కథ ముగిసిన తర్వాత అందరు చుట్టూ వుంటున్నా మనిషి స్వయం కల్పితఒంటరితనంలో జీవితాన్ని కొనసాగిస్తూ స్మార్ట్‌ఫోన్ సహాయంతో కాసింత కాలక్షేపం కోసమో, కావలసిన వినోదం కోసమో చూడడం, చేయడం ప్రారంభించిన రీల్స్, షార్ట్ వీడియోస్ వలలోపడి అందులో నుండి బయటకు రాలేక విలవిల్లాడుతున్న వైనం నిస్సందేహంగా ఆందోళన కలిగిస్తోందని చెప్పక తప్పదు. ఈ ప్రపంచంలో అన్నింటికన్నా విలువైనది కాలమేననే సత్యం లోక విదితమే. ఐతే ఆధునిక సాంకేతికత విషపుత్రికగా పురుడు పోసుకున్న రీల్స్, షార్ట్ వీడియోల వ్యాపకం వయస్సుతో సంబంధం లేకుండా రెండు మూడేళ్ల వయస్సు పిల్లల నుండి పండు ముదుసలి వరకు అన్ని వయస్సుల ప్రజలు ప్రతి రోజూ చేతిలో స్మార్ట్ ఫోన్‌తో తమకు అందుబాటులో వున్న ఇరవై నాలుగు గంటల్లో సింహభాగం రీల్స్, షార్ట్ వీడియోస్ చూడడానికే కాదు చేయడానికి ఉపయోగిస్తున్న నేపథ్యంలో మద్యం, మత్తు పదార్థాల కన్నా అత్యంత భయంకరమైన దుర్వ్యసనంగా మారడం దురదృష్టకరం. ఇంట్లో, వసారాలో, రోడ్లపై, ద్విచక్ర వాహనాలపై, బస్సుల్లో, రైళ్లలో, కార్యాలయాల్లో, కార్ఖానాల్లో, పార్కుల్లో అన్ని పబ్లిక్ ప్లేసుల్లో ఎక్కడ చూసినా వయస్సుతో సంబంధం లేకుండా చేతుల్లో స్మార్ట్ ఫోన్లతో రీల్స్ చూసే వారు, రీల్స్ చేసేవారు వాస్తవిక ప్రపంచంలో కాకుండా ఏదో ఊహాలోకంలో విహరిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఒకటీ రెండు నిమిషాల నిడివి గల ఓ వీడియో ద్వారా తమ జీవితంలో ఓ అలౌకికమైన ఆనందాన్ని పొందాలని తపన పడుతున్న మనిషి సదరు షార్ట్ వీడియోల ద్వారా తన కోరికను తీర్చుకోగలుగుతున్నాడా? అని పరిశీలించినప్పుడు ఆక్షణాల్లో మానవాళి పొందే ఆనందం కన్నా వాటి ద్వారా తమ జీవితాలను విధ్వంసం చేసుకోవడానికి తానే కారణంగా మారుతున్న వైనం నిస్సందేహంగా ఆందోళన కలిగిస్తోంది. కుటుంబంతో పాటు సంఘ జీవనానికి దూరమోతూ ఓవైపు సామాజిక అల్లికను ఛిద్రం చేయడంతో పాటు దైనందిన జీవనంలో అపరిమితంగా స్క్రీన్‌ను చూస్తూ తీవ్రమైన మానసిక ఒత్తిళ్లతో పాటు కంటి చూపు పాడవడం, విద్యా పరమైన, ఉద్యోగ పరమైన, వృత్తిపరమైన బాధ్యతలను నిర్వహించడంలో వైఫల్యం చెందుతున్న వైనం దురదృష్టకరంగా పరిణమిస్తోంది. రీల్స్‌తో కొంత మంది భార్యాభర్తల కాపురాల్లో చిచ్చు రగులుతోందనే ఆరోపణలువినపడుతున్నాయి. మరోవైపు రీల్స్ చేయడం ద్వారా వాటిని వైరల్ చేయడం ద్వారా గణనీయమైన సంఖ్యలో వ్యూస్‌నూ, లైక్స్‌నీ సంపాదించుకునే క్రమంలో అనతికాలంలోనే సోషల్ ఇన్ ఫ్లూయన్సర్లుగా మారి లక్షల రూపాయల సంపాదనతో సెలబ్రిటీలుగా జీవితాలను కొనసాగించవచ్చనే ఆశ కూడా ఈ దుర్వ్యసనాన్ని మరింత బలంగా మారుస్తుందేమోననే భావన సర్వత్ర వెల్లువెత్తుతోంది. లక్షల సంఖ్యలో వ్యూస్ నీ, లైక్స్‌నీ, షేర్స్‌ని సంపాదించడానికి సామాజిక జీవనాన్ని విధ్వంసం చేసే రీల్స్‌నీ, షార్ట్ వీడియోలను తయారు చేసి తమ విలువైన సమయాన్ని కోల్పోవడంతో పాటు లక్షలూ, కోట్ల సంఖ్యలో ఇంటర్ నెట్ వినియోగదారులను ఆకర్షిస్తూవారిని శారీరక, మానసిక ఒత్తిళ్లకు గురిచేస్తున్న వైనం ఆందోళన కలిగిస్తోంది. ఐతే ఈజూదంలో గెలిచేది లక్షలో ఒకరి కన్నా తక్కువే కావడం మిగతా వారంతా బాధితులుగా మారుతుండడం ఓ విషాదంగా భావించక తప్పదు. గతేడాది కర్ణాటక రాష్ట్రంలో ఓ టూరిస్ట్ స్పాట్‌లో కొండ అంచుపై నిలబడి రీల్స్ చేసే క్రమంలో ప్రముఖ సోషల్ మీడియా ఇన్ ఫ్లూయన్సర్ అన్వీ కామత్ లోయలో పడి మరణించడాన్ని మరిచిపోక ముందే కొండ అంచుపై కారుని నడిపిస్తూ ఓ రీల్ చేయాలని భావించిన యువతి బ్రేక్‌ను నొక్క బోయి ఎక్స్‌లేటర్‌ని నొక్కి లోయలో పడి దుర్మరణం చెందింది. మరో దురదృష్టకర సంఘటనలో పరుగెత్తుతున్న రైలు నుండి దూకుతూ వీడియో చేసే క్రమంలో మరో యువతి ఘోర ప్రమాదానికి గురై చావు బతుకులతో పోరాడుతున్న వైనం బాధాకరం. నిన్న గాక మొన్న బీహార్ రాష్ట్రంలో ఓ పన్నెండేళ్ల బాలుడు రైలు క్రింద పడుకొని రీల్ చేసిన వైనం ఒళ్లు గగుర్పొడిచేలా చేసింది. రాజస్థాన్‌లోని ఓ జలాశయంపై ఇనుప గ్రిల్‌పై తన కూతురిని నిలిపి రీల్ చేయడానికి ప్రయత్నించిన తల్లిదండ్రుల చర్య గుండెల్ని జలదరింపజేసింది. అత్యంత దురదృష్టకరమైన మరో సంఘటనలో విషపూరితమైన నాగుపామును ముద్దాడుతూ ఓ స్నేక్ క్యాచర్ చేసిన రీల్ పర్యవసానంగా ప్రాణాలు కోల్పోవాల్సివచ్చింది. వేలం వెర్రిగా మరో ఘటనలో ప్రయాణీకులూ, పాదచారులూ, వేగంగా పరుగులు తీస్తున్న వాహనాల కూడలిలో కరెన్సీనోట్ల కట్టలను వెదజల్లి షార్ట్ వీడియోని చిత్రీకరించిన ఉదంతం పబ్లిక్ న్యూసెన్స్‌తో పాటు ప్రమాదాలకు కారణంగా మారిన వైనం ఆందోళన కలిగించింది. గతంలో నోయిడా ఢిల్లీలో, నాలుగు రోజుల క్రితం హైదరాబాద్ నగరంలో అర్థరాత్రి ఓ యువజంట మోటర్ సైకిల్ పై చేసిన రొమాన్స్ తాలూకు షార్ట్ వీడియో అశ్లీలతకు నిలువెత్తు నిదర్శనంగా సోషల్ మీడియాలో వైరలైంది. ఇన్‌స్టా రీళ్లలో అధికశాతం మంది ఎంటర్ టైన్‌మెంట్, సమాచారాత్మక, ప్రేరణాత్మక, ట్రెండింగ్, వ్యక్తిగత అనుభవాలను పంచుకునే వీలున్న వ్లాగ్ రీల్స్, ఫ్యాషన్ రిటైల్ రీల్స్, డ్యాన్స్, కామెడీ, సమస్య పరిష్కారాత్మక, రొమాంటిక్ రీల్స్‌నే చూస్తుండడం, చేస్తుండడం బహిరంగ రహస్యమే. తుఫాన్‌లా కొనసాగుతున్న ఈ రీల్స్ ఒరవడి మానవాళి దైనందిన జీవనంలో అత్యంత విలువైన కాలాన్ని గ్రహణంలా మింగేస్తున్నవైనం ఆందోళన కలిగిస్తోంది. మనిషి ప్రతిరోజూ తన ఆరోగ్య రక్షణ కోసం అనివార్యంగా నిద్రించాల్సిన ఏడెనిమిది గంటల సమయం కూడా నిద్రపోలేకపోవడం బాధాకరం. ప్రతి రోజూ సింహభాగం రీల్స్ చూడడంలో, చేయడంలో గడుపుతున్న ఫలితంగా ఇంటా, బయటా, వృత్తిలో చివరికి ఉద్యోగ జీవనంలో సైతంవారిలోని సృజనాత్మక నశించిపోతుంది. రీల్స్‌కు బానిసగా మారి యాంత్రిక జీవనంలో కొట్టుమిట్టాడుతున్నాడు. కాలం విలువను మరిచి పోతున్నాడు. కుటుంబంలో, సమాజంలో తన చుట్టూ పదులూ, వందల సంఖ్యలో మనుషులు తిరుగుతున్నా వారెవ్వరితో సంబంధం లేని ఒంటరి జీవితాన్ని గడపాల్సి వస్తోంది. ఫలితంగా హైపర్ టెన్షన్, బి.పిలతో తీవ్రమైన మానసిక ఒత్తిళ్లూ, పరిణామంగా గుండె జబ్బు లాంటి రోగాల కుంపటిగా మారుతున్నాడు. రీల్స్ రూపంలో పదేపదే చెత్తను చూస్తున్న ఫలితంగా మనిషిలో నేర ప్రవృత్తి సైతం పెరిగిపోయే ప్రమాదముందని మనో వైజ్ఞానిక వేత్తలనుకుంటున్నారు. డెబ్బై కోట్లపై చిలుకు స్మార్ట్‌ఫోన్ వినియోగదారులున్న మన దేశంలో మెజారిటీ సభ్యులురీల్స్ ఊబిలో పీకలలోతుకు చిక్కుకుపోయిన వైనంతో వ్యక్తిగతంగా, వృత్తి పరంగా, సంఘ జీవనంలోను విజయాన్ని సొంతం చేసుకోవడానికి అవసరమైన అంకిత భావాన్ని, దృఢ దీక్షను ప్రదర్శించడంలో మనస్సును లగ్నం చేయలేక పరాజితులుగా మారిపోతుండడం అత్యంత దురదృష్టకరంగా అభివర్ణించక తప్పదు. నేటి సమాజంలో ఓ మహమ్మారి రూపాన్ని సంతరించుకుని కోట్లాది ప్రజలను తమ సుడిగుండంలో బంధించి వేధిస్తున్న రీల్స్ బారి నుండి కాపాడే చట్టపరమైన యంత్రాంగమేదీ అందుబాటులో లేకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో కేవలం స్వయం నియంత్రణ ద్వారానే రీల్స్ ముప్పునుండి ప్రజలు తమను తాము కాపాడుకోవడం సాధ్యమంటూ వివిధ అధ్యయనాలు అందిస్తున్న నివేదికల ప్రకారం మార్పుముందుగా వ్యక్తినుండి తర్వాత ప్రతి కుటుంబంలో నుండి రావాలి. టైమ్ లిమిట్ పెట్టుకో వడం, ఎంత కష్టమైనా ఈ అలవాటు స్థానంలో, ఆ సమయంలో ఆటలాడడం, పాటలు వినడం, డ్రాయింగ్, మొబైల్‌కు దూరంగా వుంటూ కుటుంబ సభ్యులతో, స్నేహితులతో బిజీగాఆనందంగా గడపడం లాంటి సూచనల్లో కొన్నింటినైనా పాటిస్తే రీల్స్ జాఢ్యం విషవలయం నుండి విముక్తి లభిస్తుంది. ●



# న్యాయవ్యవస్థకు వికేంద్రీకరణ అవశ్యం

## చీఫ్ జస్టిస్ బిఆర్‌గవాయి



**అమ్రావతి,జూలై 26:** న్యాయాన్ని ప్రజల ముంగిటకు చేర్చాలంటే న్యాయ వ్యవస్థను వికేంద్రీకరించడం అత్యవసరమని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) గవాయ్ స్పష్టం చేశారు. మహారాష్ట్రలోని అమరావతి జిల్లా దర్యాపూర్‌లో నూతన కోర్టు భవనాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. న్యాయ మౌలిక సదుపాయాల కమిటీ అధిపతిగా తాను కొత్త తాలూకా, జిల్లా స్థాయి కోర్టుల ఏర్పాటుకు ఒక నమూనాను సిద్ధం చేసినట్లు చెప్పారు. ఈ ప్రతిపాదనపై పని జరుగుతోందని, కానీ ఎప్పటిలాగే కోర్టులు, ప్రభుత్వంలో ఆలస్యం పరంపరం కొనసాగుతోందని ఆయన వ్యాఖ్యానించారు. అయితే మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో పాటు అంతకుముందు పనిచేసిన సీఎంలు కూడా మహారాష్ట్రలో న్యాయ మౌలిక సదుపాయాల పనులకు సానుకూలంగా ఉన్నారని, తగిన నిధులు కూడా సమకూరుస్తున్నారని సీజేఐ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జూనియర్ లాయర్లకు సీజేఐ కీలక సూచనలు చేశారు. కెరీర్‌లో ముందడుగు వేసే ముందు అప్రెంటిస్‌షిప్ చేయాలని సూచించారు. ఆ తర్వాతే సొంత ప్రాక్టీస్ మొదలు పెట్టాలన్నారు. అనుభవం లేకుండా కోర్టులో వాదించి, ఆరు నెలల్లో ఖరీదైన కార్లు కొనాలనుకుంటే సరికాదన్నారు. ఆ ఆలోచనను పునరాలోచించుకోవాలని సూచించారు. న్యాయవాద వృత్తితో వచ్చే స్థాయి, ప్రతిష్ఠ తలకెక్కకూడదని హితవు పలికారు. జూనియర్ లాయర్లు సీనియర్లకు సీటు ఇవ్వకపోవడం తాను చూసినట్లు గుర్తు చేసుకున్నారు. అలాగే, ఒక జూనియర్ న్యాయవాదిని న్యాయమూర్తి మందలించినప్పుడు అతను కోర్టులో స్పృహ తప్పి పడిపోయిన సందర్భాన్ని కూడా చూసినట్లు చెప్పారు. న్యాయ వ్యవస్థలో న్యాయమూర్తులు, న్యాయవాదులు ఇద్దరూ సమాన భాగస్వాములని పేర్కొన్నారు. న్యాయవాదులు, న్యాయమూర్తులు ప్రజల పట్ల సేవభావంతో వ్యవహరించాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. అనంతరం దర్యాపూర్‌లో జరిగిన తన తండ్రి ఆర్.ఎస్. గవాయ్ 10వ వర్ధంతిలో సీజేఐ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తాను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా కాకుండా, స్థానిక జిల్లా నివాసిగా హాజరైనట్లు సీజేఐ జస్టిస్ గవాయ్ తెలిపారు. ఆయన తండ్రి, కేరళ, బిహార్ గవర్నర్‌గా పనిచేశారు. ఈ ఏడాది మేలో సీజేఐ పదవిని చేపట్టిన గవాయ్ అప్పటి నుంచి న్యాయవ్యవస్థ వికేంద్రీకరణ ద్వారానే ప్రజలకు సులభంగా న్యాయం అందుతుందని చెబుతూ వస్తున్నారు.

# జస్టిస్ వర్మ అభిశంసనకు అన్నీ సిద్ధం


## కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు



**న్యూఢిల్లీ,జూలై 26:** అవినీతి ఆరోపణల్లో చిక్కుకున్న జస్టిస్ యశ్వంత్ వర్మను తొలగించేందుకు సిద్ధం చేసిన ప్రతిపాదనను లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నట్టు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. న్యాయవ్యవస్థలో జరుగుతున్న అవినీతిపై పోరాడేందుకు అన్ని పార్టీలు ఏకతాటిపైకి వచ్చేందుకు అంగీకరించాయని ఆయన పేర్కొన్నారు. ఈ తీర్మానానికి మద్దతుగా అధికారంలోని కూటమి, ప్రతిపక్ష పార్టీలకు చెందిన 150 మందికి పైగా ఎంపీలు సంతకాలు చేశారని తెలిపారు. ఎటువంటి సందేహం లేకుండా ఉండండి. జస్టిస్ యశ్వంత్ వర్మను తొలగించే ప్రక్రియ లోక్‌సభలో జరుగుతుందని కిరణ్ రిజిజు అన్నారు. మరోవైపు యశ్వంత్ వర్మపై వచ్చిన ఆరోపణలపై దర్యాప్తునకు స్పీకర్, ఓం బిర్లా ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటుచేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. రాజ్యసభలో ఇటువంటి తీర్మానం కోసం ప్రతిపక్షాలు సమర్పించిన నోటీసును ఎగువ సభ ఆమోదించలేదని, దిగువ సభలో ఈ ప్రక్రియను ప్రారంభించడానికి మార్గం సుగమం అవుతుందని అధికార వర్గాలు తెలిపాయి. ఢిల్లీలోని జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంటి ఆవరణలో జరిగిన అగ్నిప్రమాదంలో కాలిపోయిన కరెన్సీ కట్టలు బయటపడటంతో వివాదం మొదలైంది. దీనిపై అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా అంతర్గత విచారణ కోసం ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ నోట్ల కట్టలు దొరికింది నిజమేనని పేర్కొంది. దీంతో రాజీనామా చేయాల్సిందిగా జస్టిస్ వర్మకు సూచించారు. అయినా తన పదవికి రాజీనామా చేయడానికి వర్మ నిరాకరించారు. దీంతో ప్రధాన న్యాయమూర్తి అభిశంసనకు సిఫారసు చేస్తూ ప్రధాని మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాశారు. యశ్వంత్ వర్మను తొలగించాలని కోరుతూ పార్లమెంటు ఉభయసభల్లో ఎంపీలు అభిశంసన తీర్మానాన్ని ఇచ్చారు. తన వాదన వినకుండానే చర్యలు తీసుకుంటున్నారని ఆరోపిస్తూ జస్టిస్ వర్మ తాజాగా సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. వర్మ పిటిషన్ నుంచి తప్పుకుంటున్నట్లు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ తెలిపారు. విచారణ కమిటీలో తాను ఉన్నందున దాన్ని మరో బెంచ్‌కు బదిలీ చేస్తామని పేర్కొన్నారు.

# స్కాట్లాండ్ పర్యటన సొంత గోల్ఫ్ రిసార్టుల ప్రచారం కోసమే

## అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై విమర్శలు



**వాషింగ్టన్, జులై 26:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు గోల్ఫ్ అంటే ఎంతో ఇష్టం. వీలైనప్పుడల్లా గోల్ఫ్ ఆడుతుంటాడు. అయితే తాజాగా ఆయన స్కాట్లాండ్ పర్యటన విమర్శలకు కారణమైంది. అక్కడ ఆయనకున్న సొంత గోల్ఫ్ రిసార్టుల ప్రచారం కోసమే ఈ పర్యటన చేస్తున్నారంటూ ఆరోపణలు వస్తున్నాయి. అయిదు రోజుల పర్యటన కోసం మిలియన్ డాలర్ల ప్రజాధనాన్ని ఖర్చు చేయనున్నట్లు పలు నివేదికలు అంచనావేశాయి. ఆయన వినియోగించే విమానం 'ఎయిర్‌ఫోర్స్ వన్' ప్రయాణానికి గంటకు 2,73,063 డాలర్లు ఖర్చు అవుతుందట. ఇంత మొత్తం వ్యయంతో ఆయన చేపట్టిన స్కాట్లాండ్ పర్యటన విమర్శలకు కేంద్రంగా మారింది. వాస్తవానికి ట్రంప్ బ్రిటన్ పర్యటన సెప్టెంబర్‌లో ఉంది. కానీ అంతకంటే ముందుగానే అయిదురోజుల పర్యటన కోసం స్కాట్లాండ్ చేరుకోవడం గమనార్హం. అక్కడే ఉన్న సొంత గోల్ఫ్ కోర్సు 'టర్న్‌బెరీ'లో ఆటను కూడా మొదలుపెట్టారు. ఇదే సమయంలో అబెర్డీన్ సమీపంలో కొత్తగా ఓ గోల్ఫ్‌కోర్సును ప్రారంభించనున్నారు. దీంతో సొంత వ్యాపారం ప్రమోషన్ కోసమే ట్రంప్ ఈ పర్యటన చేపట్టారని విమర్శలు మొదలయ్యాయి. అయితే ఇది అధికారిక పర్యటన అని, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, స్కాట్లాండ్ ఫస్ట్ మినిస్టర్‌తోనూ భేటీ అవుతారని అధికారులు చెబుతున్నారు. ఓవల్ ఆఫీస్ ట్రంప్ అనుబంధ సంస్థగా మారిందని, ఆయన బిల్లులను అమెరికా పన్ను చెల్లింపుదారులు కట్టాల్సి వస్తోందని సిఆర్‌ఇడబ్ల్యు అనే ఓ స్వచ్ఛంద సంస్థ కార్యకర్త జోర్డాన్ లిబోవిట్జ్ ఆరోపించారు. సొంత గోల్ఫ్ కోర్సుల మార్కెటింగ్ కోసం అధికారాన్ని ఉపయోగించుకుంటున్నారని వైట్‌హౌస్ మాజీ ఉద్యోగి, న్యాయవాది రిచర్డ్ పెయింటర్ మండిపడ్డారు. ఎయిర్‌ఫోర్స్ వన్‌తో పాటు మెరైన్ వన్, వాహనాలను తరలించడంతో కలిపి ఇలా మొత్తంగా స్కాట్లాండ్ ట్రిప్‌కు 3.8 మిలియన్ డాలర్లు ఖర్చు కానున్నట్లు హాఫింగ్టన్ పోస్టు కథనం అంచనా వేసింది. రెండోసారి అధికారం చేపట్టిన ట్రంప్ ఈ ఆరు నెలల్లో అనేకసార్లు గోల్ఫ్ ఆట కోసం తన సమయాన్ని కేటాయించినట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఇప్పటికే కనీసం 52 మిలియన్ డాలర్లు ఖర్చుపెట్టినట్లు అంచనా. గతంలో అధ్యక్షుడిగా పనిచేసిన సమయంలో మొత్తంగా 152 మిలియన్ డాలర్ల ప్రజాధనం గోల్ఫ్ ఆడేందుకు ఖర్చు చేశారనే విమర్శలు ఉన్నాయి.

# ముంబై-పుణే ఎక్స్‌ప్రెస్‌వేపై భారీ ప్రమాదం

## ఢీకొన్న 20 వాహనాలు.. ఒకరు మృతి, 16 మందికి గాయాలు



**ముంబై, జూలై 26:** వాహనాల రద్దీ విపరీతంగా ఉండే ముంబై-పుణే ఎక్స్‌ప్రెస్‌వేపై పెద్ద ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 20 వాహనాలు ఢీకొనగా, ఒకరు మరణించారు. దాదాపు 16 మందికి గాయాలయ్యాయి. మహారాష్ట్రలోని పుణే జిల్లాలో ఈ ప్రమాద ఘటన జరిగింది. శనివారం సాయంత్రి ముంబై-పుణే ఎక్స్‌ప్రెస్‌వేలోని సొరంగం ప్రవేశద్వారం వద్ద పెద్దప్రమాదం సంభవించింది. హైవేలోని లోనావాలా-ఖండాల ఘాట్ వద్ద కంటెయినర్ వాహనం బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. నియంత్రణ కోల్పోయిన ఆ కంటెయినర్ ముందున్న ఒక వాహనాన్ని బలంగా ఢీకొన్నది. దీంతో ముందున్న పలు వాహనాలు వరుసగా ఢీకొన్నాయి. పలు కార్లతోపాటు సుమారు 20 వాహనాలు దెబ్బతిన్నాయి. కాగా, ఈ భారీ ప్రమాదంలో ఒకరు మరణించగా సుమారు 16 మంది గాయపడ్డారు. వారిని వెంటనే అంబులెన్స్‌లలో ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటన నేపథ్యంలో ఆ ఎక్స్‌ప్రెస్‌వేపై పలు గంటలపాటు వాహనాలు నిలిచిపోయాయి. 5 కిమీ మేర ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. మరోవైపు పోలీసులు, ఎమర్జెన్సీ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. ధ్వంసమైన వాహనాలను రోడ్డుపక్కకు తొలగించారు. ట్రాఫిక్ జామ్‌ను క్లియర్ చేసేందుకు ట్రాఫిక్ పోలీసులు చాలా శ్రమించారు. వాహనాల రద్దీ తగ్గించడానికి ఇతరమార్గాల ద్వారా ట్రాఫిక్‌ను మళ్లించారు. కాగా, ముంబై-పుణే ఎక్స్‌ప్రెస్‌వేపై జరిగిన భారీ ప్రమాదానికి సంబంధించిన విడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

# అంబులెన్స్‌లో రోగిపై సామూహిక లైంగికదాడి




**పాట్నా,జూలై 26:** హోంగార్డు సెలక్షన్ కోసం హాజరైన మహిళ భౌతిక పరీక్షలో స్పృహ కోల్పోయింది. ఆమెను హాస్పిటల్‌కు తరలిస్తుండగా కదులుతున్న అంబులెన్స్‌లో నలుగురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఎన్డీయే అధికారంలో ఉన్న బీహార్‌లో ఈ దారుణం జరిగింది. జూలై 24న బోధ్ గయలోని బీహార్ మిలిటరీ పోలీస్ గ్రౌండ్‌లో హోంగార్డుల నియామకం కోసం ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌లో పాల్గొన్న 26 ఏళ్ల మహిళ స్పృహ కోల్పోయింది. వెంటనే స్పందించిన అధికారులు అక్కడున్న అంబులెన్స్‌లో ఆమెను హాస్పిటల్‌కు తరలించారు. కాగా, స్పృహ కోల్పోయిన ఆ మహిళపై కదులుతున్న అంబులెన్స్‌లో నలుగురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. హాస్పిటల్‌కు తరలించిన తర్వాత వైద్య సిబ్బంది, పోలీసులకు ఆ మహిళ ఫిర్యాదు చేసింది. ఆమె స్టేట్‌మెంట్ ఆధారంగా బోధ్ గయ పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు కోసం సిట్ ఏర్పాటు చేశారు. ఆధారాల సేకరణకు ఫోరెన్సిక్ బృందాన్ని నియమించారు. మరోవైపు అంబులెన్స్ కదలికలు, హాస్పిటల్‌కు చేరుకున్న సమయానికి సంబంధిన ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలించారు. కదులుతున్న అంబులెన్స్‌లో అపస్మారక స్థితిలో ఉన్న ఆ మహిళపై గ్యాంగ్‌రేప్ జరిగినట్లు నిర్ధారించారు. అంబులెన్స్ డ్రైవర్ వినయ్ కుమార్, టెక్నీషియన్ అజిత్ కుమార్‌ను అరెస్ట్ చేశారు. పోలీస్ కస్టడీలో ఉన్న వారిద్దరిని ప్రశ్నిస్తున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు. మరో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు.



# సన్వాలియాసేఠ్‌కు వెండి రివాల్వర్, బుల్లెట్లు కానుకలు

**చిత్తోర్‌ఘర్,జూలై 26:** దేవుళ్లకు బంగారు కిరీటాలు, ఆభరణాలు, డబ్బులు, విలువైన వస్తువులు కానుకలు రావడం సహజం అయితే భగవంతుడికి ఏకంగా వెండి రివాల్వర్, బుల్లెట్ కానుకగా సమర్పించాడు. ఇదే ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. రాజస్థాన్, చిత్తోఢ్‌గఢ్ జిల్లాలో ప్రసిద్ధ శ్రీ సన్వాలియా సేఠ్ ఆలయం ఉంది. ఇక్కడ శ్రీకృష్ణుడు ప్రధాన దైవం. ఈ ఆలయంలో ఏమైనా కోరుకుంటే, ఆ కోరికలు కచ్చితంగా నెలవేరుతాయని భక్తుల నమ్మకం. ఇలా కోరికలు నెరవేరిన వారు ఈ ఆలయంలో తమ శక్తికొలది కానుకల సమర్పిస్తూ ఉంటారు. అయితే తాజాగా ఓ అజ్ఞాత భక్తుడు దేవునికి వెండి రివాల్వర్, బులెట్ కానుకగా సమర్పించాడు. దీనితో ఇది స్థానికంగా హాట్ టాపిక్ అయ్యింది. దేవునికి ఒక ఆయుధాన్ని సమర్పించడం ఇదే మొదటిసారిని ఆలయ అర్చకులు చెబుతున్నారు. అజ్ఞాత భక్తుడు ఇచ్చిన వెండి రివాల్వర్ దాదాపు 300 గ్రాములు, బుల్లెట్ దాదాపు 190 గ్రాములు ఉంది. ఈ భక్తుడు రెండు వెండి వెల్లుల్లి రెబ్బలను కూడా సమర్పించాడని ఆలయ ఛైర్మన్ జానకీ దాస్ అలియాస్ హజారీ దాస్ వైష్ణవ్ చెప్పారు. దేవునికి కానుకగా సమర్పించిన వెండి రివాల్వర్, బుల్లెట్ ఇదే ఫస్ట్ టైమ్ ఇప్పటి వరకు దేవునికి కానుక ఇచ్చిన వెండి విమానం, ట్రాక్టర్, చేతి సంకెళ్లు వంటి అనేక ప్రత్యేక వస్తువులను చూశాను. కానీ ఒక ఆయుధాన్ని దేవునికి సమర్పించడం ఇదే మొదటిసారి. దీంతో రెండు వెండి వెల్లుల్లి రెబ్బలు కూడా ఇచ్చాడు. దీనిని బట్టి అతను వ్యాపారవేత్తగానీ, రైతు గానీ అయ్యుండవచ్చని భావిస్తున్నా అని ఆలయ పూజారి ఒకరు చెప్పారు. ఎందుకంటే గతేడాది రాజస్థాన్ లో వెల్లుల్లి ధర భారీగా పెరిగింది. బహుశా ఒక రైతు వెల్లుల్లి పండించి, భారీ లాభాలు ఆర్జించి ఉండవచ్చు. అందుకే ఆయన స్వామివారికి వెండి ఆయుధం సమర్పించి ఉండవచ్చని స్థానికులు ఊహిస్తున్నారు. శ్రీ సన్వాలియా సేఠ్ ఆలయానికి వచ్చే భక్తులు వెరైటీ కానుకలు సమర్పించడం ఇదే మొదటిసారి కాదు. గతంలో భక్తులు వెండితో చేసిన ఇల్లు, పెట్రోల్ పంపు, చేతి సంకెళ్లు, విమానం, ట్రాక్టర్, పది తలల రావణుడి విగ్రహం, ల్యాప్‌టాప్, ఐఫోన్‌లు సమర్పించిన సందర్భాలు ఉన్నాయి. కొందరు భక్తులైతే ఏకంగా పండిన పంటనంతా దేవునికి సమర్పించారు. వెండి పెట్రోల్ పంపు చిత్తోఢ్‌గఢ్ నుంచి 40 కి.మీ దూరంలోని మాండ్‌ఫియా గ్రామంలో సన్వాలియా సేఠ్ ఆలయం ఉంది. ఇక్కడ నల్లని రంగులో శ్రీకృష్ణుడు కొలువై ఉన్నాడు. ఇక్కడ శ్రీకృష్ణుడిని సేఠ్ అంటే సంపదకు అధిపతిగా పూజిస్తారు. ఈ ఆలయంలో నిజమైన భక్తితో ప్రార్థిస్తే, కోరిన కోరికలు నెరవేరుతాయని నమ్మకం. అందుకే పూర్ణిమ, ఏకాదశి, జన్మాష్టమి పండుగ సమయాల్లో ఇక్కడకు లక్షలాది మంది భక్తులు వస్తుంటారు. సావన్ మాసంలో అయితే భక్తుల సంఖ్య భారీగా పెరుగుతుంది.

## యుద్ధ విమానానికి ఎదురుగా వెళ్లిన మరో విమానం

# త్రుటిలో తప్పిన పెనుముప్పు

**వాషింగ్టన్, జూలై 26:** సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఓ విమానానికి త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. లాస్‌ఏంజెలెస్‌లోని హాలీవుడ్ బర్‌బ్యాంక్ విమానాశ్రయం నుంచి శుక్రవారం బయల్దేరిన సౌత్‌వెస్ట్ విమానం గగనతలంలో ప్రయాణిస్తున్న సమయంలో హాకర్ హంటర్ యుద్ధ విమానానికి ఎదురుగా వెళ్లింది. యుద్ధ విమానం రాకను గమనించిన పైలట్లు అకస్మాత్తుగా తమ విమానాన్ని 500 అడుగుల మేర కిందికి దించడంతో ప్రమాదం తప్పింది. అయితే విమానాన్ని కిందకు దించడంలో వచ్చిన కుదుపుల వల్ల విమానంలోని ఇద్దరు సహాయకులకు గాయాలైనట్లు ఎయిర్‌లైన్స్ అధికారులు పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించిన




రాడార్ విడియోను ప్రముఖ విమాన ట్రాకింగ్ వెబ్‌సైట్ ఫ్లైట్ రాడార్ 24 సోషల్ మీడియాలో షేర్ చేసింది. విడియోలో యుద్ధ విమానం ఎదురుగా వస్తుండడాన్ని గమనించిన పైలట్లు కేవలం సెకన్ల వ్యవధిలో విమానాన్ని 14,100 అడుగుల నుంచి 13,625 అడుగుల మేర కిందకు దించినట్లు చూపిస్తోంది. రెండు విమానాలు ఒకదానికొకటి దగ్గరగా వచ్చినప్పుడు ఎయిర్ ట్రాఫిక్ అలర్ట్, కొలిషన్ అవాయిడెన్స్ సిస్టమ్ (టిసిఎఎస్) ద్వారా హెచ్చరికను జారీ చేయడంతో పైలట్లు వేగంగా స్పందించగలిగినట్లు అధికారులు పేర్కొన్నారు. తర్వాత విమానాన్ని తన గమ్యస్థానంలో సురక్షితంగా ల్యాండ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు. ఇటీవల ఇలాగే మిన్నియాపోలిస్ నుంచి మైనట్‌కు వెళ్తున్న డెల్టా ఎయిర్‌లైన్స్ విమానం, బి-52 బాంబర్ యుద్ధ విమానాన్ని ఢీకొనబోయింది. వెంటనే స్పందించిన పైలట్లు విమానాన్ని వేగంగా మరోవైపునకు తిప్పడంతో ప్రమాదం తప్పింది. అయితే యుద్ధ విమానం తమకు ఎదు రుగా వస్తున్నట్లు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ నుంచి స్పష్టమైన ఆదేశాలు రాలేదని డెల్టా విమాన పైలట్ పేర్కొన్నారు.

# యుఎస్ వీసా, పౌరసత్వ పరీక్షలు మరింత కఠినతరం




**వాషింగ్టన్, జూలై 26:** అధ్యక్ష బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వలసల అంశంపై ప్రత్యేక దృష్టి సారించారు. వీసా, పౌరసత్వ విధానాలు మరింత కఠినతరం చేసేదిశగా కొత్త ఆలోచనలు చేస్తూనే ఉన్నారు. తమ ప్రభుత్వం నైపుణ్యం కలిగిన కార్మికుల కోసం వీసా వ్యవస్థలో మార్పులు చేయనుందని యుఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ నూతన అధ్యక్షుడు జోసెఫ్ ఎడ్లో ఓ అంతర్జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. అమెరికా పౌరసత్వం కోసం నిర్వహించే పరీక్షలు మరింత క్లిష్టంగా మార్చాలనే యోచనలో ఉన్నట్లు చెప్పారు. 'ప్రస్తుతం నిర్వహిస్తోన్న పరీక్షలు ఏమంత కఠినంగా లేవు. టెస్టుల్లో బట్టీపట్టి అప్పగించే సమాధానాలు ఉంటున్నాయి. యుఎస్ ఆర్థిక వ్యవస్థ కోసం హెచ్-1బి వీసాను ఎలా ఉపయోగించుకోవాలనే దానిపై పునరాలోచన చేస్తున్నాం' అని ఎడ్లో పేర్కొన్నారు. ట్రంప్ తొలిసారి అధికారంలోకి వచ్చినప్పుడే దీన్ని సంస్కరించే ప్రయత్నాలు చేపట్టారు. అయితే తర్వాత అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన జోబైడెన్ ఆ నిర్ణయాన్ని ఉపసంహరించారు. అమెరికాలో కొత్త ప్రభుత్వం వలసదారులపై కఠినవైఖరి అనుసరిస్తోంది. వీసాల జారీ కోసం 'సోషల్ మీడియా వెట్టింగ్'ను తప్పనిసరి చేసిన సంగతి తెలిసిందే. వీసా పొందిన తర్వాత కూడా నిబంధనలు పాటించకపోతే 'బహిష్కరణ ముప్పు' తప్పదని హెచ్చరించింది.

# కాల్పుల విరమణకు కంబోడియా పిలుపు

## కంబోడియాలో 13 మంది, థాయ్‌లాండ్‌లో 15 మంది మృతి

### ఐక్యరాజ్య సమితిలో వాడివేడిగా చర్చ



**బ్యాంకాక్, జూలై 26:** థాయ్‌లాండ్- కంబోడియా మధ్య సరిహద్దు ప్రాంతంలో జరిగిన ఘర్షణల్లో మృతుల సంఖ్య పెరుగుతుండడం ఆందోళన రేకెత్తిస్తోంది. ఈ నేపథ్యంలో కంబోడియా తక్షణ కాల్పుల విరమణకు పిలుపునిచ్చింది. కంబోడియా తక్షణ, బేషరతు కాల్పుల విరమణను కోరుతోందని, దీర్ఘకాలంగా కొనసాగుతున్న వివాదానికి శాంతియుత పరిష్కారం కోసం చూస్తోందని ఆ దేశ వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఘర్షణలు ప్రాథమికంగా ప్రియో విహార్, ప్రసాత్ తా, మ్యూన్ థామ్ దేవాలయాల చుట్టూ కేంద్రీకృతమయ్యాయి. ఇరు దేశాలు పరస్పరం రాకెట్లు, ఫిరంగి దాడులు చేసుకున్నాయి. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో ఈ ఘర్షణలపై చర్చ జరగ్గా.. కంబోడియా విచక్షణా రహిత, అమానవీయ దాడులు చేసిందని థాయ్‌లాండ్ ఆరోపించింది. అయితే, కంబోడియా రాయబారి థాయ్‌లాండ్ వాదనను తిప్పికొట్టే ప్రయత్నం చేశారు. తాము సంయమనం పాటిస్తున్నామని, దౌత్య మార్గాల ద్వారానే సమస్య పరిష్కారం కావాలి కోరుకుంటున్నామని నొక్కి చెప్పారు. ఘర్షణల కారణంగా కంబోడియాలో ఎనిమిది మంది సైనికులుసహా కనీసం 13 మంది మరణించారు. 35,000 మందికిపైగా ప్రజలు తమ ఇళ్లను వదిలి వెళ్లవలసి వచ్చింది. థాయ్‌లాండ్‌లో 15 మంది మరణించారు. 46 మంది గాయపడ్డారు. సరిహద్దు ప్రాంతాల నుంచి 1,38,000 మందికిపైగా ప్రజలను తరలించారు.

# భారీ వర్షాలతో చార్‌ధామ్ యాత్రకు బ్రేక్



**డెహ్రాడూన్,జూలై 26:** ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలతో ఆకస్మిక వరదలు సంభవించాయి. పలు చోట్ల కొండచరియలు విరిగిపడుతున్నాయి. అనేక జిల్లాల్లో జనజీవనం స్తంభించిపోయింది. ఈ వర్షాలు, వరదల కారణంగా చార్‌ధామ్ యాత్రకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొండచరియలు విరిగిపడటంతో కేదార్‌నాథ్ యాత్రను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. రుద్రప్రయాగలో శనివారం తెల్లవారుజామున 3:30గంటల ప్రాంతంలో గౌరీకుండ్ నుంచి కేదార్‌నాథ్‌కు వెళ్లే మార్గంలో కొండచరియలు విరిగిపడ్డాయి దీంతో అధికారులు ఆ మార్గంలో రాకపోకలను నిలిపివేశారు. దీంతో కేదార్‌నాథ్ యాత్రకు తాత్కాలికంగా బ్రేక్‌పడింది. ఆ మార్గంలో రహదారిని క్లియర్ చేసే పనులు కొనసాగుతున్నాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం తెల్లవారుజామున నుంచి కొండచరియలు విరిగిపడటం వల్ల ఈ ప్రాంతంలో తొమ్మిది రోడ్లు మూసుకు పోయాయి.


# సంక్షిప్తంగా..

## డబ్లిన్‌లో భారతీయునిపై జాత్యహంకార దాడి



**డబ్లిన్,జూలై 26:** ఐర్లాండ్ రాజధాని డబ్లిన్‌లోని టాలాట్ ప్రాంతంలో ఈ నెల 19న సాయంత్రం జరిగిన జాత్యహంకార దాడి అక్కడి భారతీయ సమాజంలో తీవ్ర భయాందోళనలను రేకెత్తించింది. అమెజాన్ ఉద్యోగి అయిన ఒక భారతీయుడి(40)పై టీనేజర్ల గుంపు కత్తులతో విచక్షణారహితంగా దాడిచేసింది. ఈ ఘటన తర్వాత దక్ష్ అనే భారతీయుడు సోషల్ మీడియాలో 'ఐర్లాండ్ ఇక సురక్షితం కాదు, ఇక్కడికి రాకండి' అని హెచ్చరిస్తూ చేసిన పోస్ట్ వైరల్ అయింది. ఈ నెల 19న సాయంత్రం 6 గంటల సమయంలో టాలాట్‌లోని పార్క్‌హిల్ రోడ్డులో ఈ దాడి జరిగింది. బాధితుడు ఐర్లాండ్‌కు వచ్చి కేవలం మూడు వారాలు మాత్రమే అవుతోంది. ఈ దాడిలో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. రక్తస్రావంతో రోడ్డుపై పడి వున్న అతడిని చూసిన స్థానిక మహిళ జెన్నిఫర్ ముర్రే అంబులెన్స్‌కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చింది. ఇది కచ్చితంగా జాత్యహంకార దాడేనని ముర్రే పేర్కొన్నారు. బాధితుడు టాలాట్ యూనివర్సిటీ ఆసుపత్రిలో చికిత్స పొంది, ఆది వారం ఉదయం డిశ్చార్జ్ అయ్యాడు. ఈ ఘటనను గార్డా (ఐరిష్ పోలీసులు) హేట్ క్రైమ్‌గా దర్యాప్తు చేస్తోంది.

## బాలివుడ్ నిర్మాతపై సీరియల్ నటి దాడి



**ముంబయి,జూలై 26:** బాలీవుడ్ నిర్మాత కరణ్ సింగ్ చౌహాన్ పై సీరియల్ నటి రుచి గుజ్జర్ దాడి చేసింది. కరణ్ సింగ్ నిర్మించిన 'సో లాంగ్ వ్యాలీ'చిత్రం స్క్రీనింగ్ సమయంలోనే ఈ దాడి జరగడం గమనార్హం. మీడియా ప్రతినిధుల సమక్షంలో రుచి గుజ్జర్ ఆయనపైకి చెప్పు విసిరింది. తనను మోసం చేశాడని, సహ నిర్మాతగా తీసుకుంటానని రూ.24లక్షలు కాజేశాడని రుచి ఆరోపించింది. దీనికి సంబంధించి చౌహాన్ పై మోసం, నమ్మకద్రోహం, బెదిరింపుల కేసు పెట్టానని తెలిపింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రుచి గుజ్జర్ తెలిపిన వివరాల ప్రకారం కరణ్ సింగ్ చౌహాన్ ఓ టీవీ సీరియల్ నిర్మిద్దామని ప్రతిపాదించగా తాను రూ.24 లక్షలు ఇచ్చానని చెప్పింది. అయితే, రోజులు గడుస్తున్నా ఈ ప్రాజెక్టు పట్టాలెక్కకపోవడంతో తాను కరణ్‌ను నిలదీయగా సాకులు చెప్పి తప్పించుకున్నాడని ఆరోపించింది. దీంతో తన డబ్బు తిరిగివ్వాలని కోరగా బెదిరింపులకు దిగాడని రుచి తెలిపింది. ఈ క్రమంలోనే 'సో లాంగ్ వ్యాలీ' మూవీ స్క్రీనింగ్ సమయంలో నిరసన తెలిపేందుకు వచ్చినట్లు రుచి గుజ్జర్ వివరించింది. ఈ వివాదం నేపథ్యంలో పోలీసులు కల్పించుకుని రుచి గుజ్జర్‌ను అక్కడి నుంచి తీసుకెళ్లారు. కరణ్ సింగ్‌పై నమోదైన కేసును దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కార్గిల్ అమరవీరులకు ప్రధాని, రాష్ట్రపతి సంతాపం



**న్యూఢిల్లీ,జూలై 26:** కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, యుద్ధంలో ధైర్యసాహసాలతో పోరాడిన జవాన్ల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అదే సమయంలో భారత వాయుసేన ఘనంగా నివాళులర్పించింది. కార్గిల్ యుద్ధం నాటి చిత్రాలతో ప్రత్యేక వీడియోను రూపొందించి విడుదల చేసింది. అమరవీరుల ధైర్యం, త్యాగం, దేశ ప్రజలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుందంటూ రాసుకొచ్చింది. జవాన్లు చేసిన త్యాగాలు ప్రతి తరానికి స్ఫూర్తినిస్తూనే ఉంటాయని ప్రధాని మోదీ తెలిపారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా దేశ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా కార్గిల్ అమరవీరులకు నివాళులర్పించారు. మన దేశాన్ని రక్షించడం కోసం అత్యంత కఠినమైన భూభాగాల్లో అసాధారణ ధైర్యం, దృఢ సంకల్పంతో పోరాడి ప్రాణ త్యాగం చేసిన వీర జవాన్లకు నివాళులర్పిస్తున్నా. కార్గిల్ యుద్ధంలో వారి త్యాగం మన సాయుధ దళాల సంకల్పానికి నిదర్శనం. వారికి ఈ దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుందని పోస్ట్ చేశారు. కార్గిల్‌లో మాతృభూమిని ధైర్యంగా రక్షించిన అమరవీరుల త్యాగానికి నమస్కరిస్తున్నట్లు మల్లికార్జున ఖర్గే పోస్టుచేశారు. త్రివిధదళాలకు, కార్గిల్ అమరవీరుల కుటుంబసభ్యులకు కార్గిల్ దివస్ శుభాకాంక్షలు తెలిపారు. అయితే 1999 మేజులైలో భారత్, పాకిస్థాన్ మధ్య కార్గిల్ యుద్ధం జరిగింది.

# రాష్ట్రంలో పదేళ్లపాటు స్వేచ్ఛాజీవితాన్ని కోల్పోయాం

## ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క

### వర్సిటీల్లో అధ్యాపకుల నియామకం చేపడతాం

### ఘనంగా ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల వార్షికోత్సవాలు



ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు జ్ఞాపికను అందజేస్తున్న ఒయు విసి ప్రొ కుమార్ మొలగరం, ప్రొ కాశీం తదితరులు

**హైదరాబాద్ (తార్నాక), జూలై 26 ప్రభాతవార్త :** సాధించుకున్న తెలంగాణలో పదేళ్లలో స్వేచ్ఛాజీవితాన్ని కోల్పోయామని ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క పేర్కొన్నారు. ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల వార్షికోత్సవాల్లో ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క పాల్గొని మాట్లాడుతూ ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రారంభం నుంచి ఉన్నతమైన చరిత్రను కలిగి ఉందని, ఇది తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబిస్తుందన్నారు. ఉన్నతవిద్యను స్కిల్‌బేస్డ్ నాలెడ్జ్ సెంటర్‌గా ప్రభుత్వ విశ్వవిద్యాల యాలను తయారుచేసే ప్రయత్నం చేస్తున్నామన్నారు. స్కిల్ యూని వర్సిటీని ఏర్పాటు చేశామని అన్నారు. అడ్వాన్స్ ట్రైనింగ్ సంస్థల ద్వారా ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను నేర్పించి యువతను ఉద్యో గులుగా తీర్చి దిద్దుతున్నామని అన్నారు. విశ్వ విద్యాలయాలల్లో అధ్యాపకుల నియావ ఒకం చేయబోతున్నామని అన్నారు. ప్రతి బిడ్డకు ఉద్యోగం వచ్చేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రతి విద్యార్థికి అంతర్జాతీయ భాషగా ఉన్న ఇంగ్లీష్ భాషలో చదువుకునే అవకాశం కల్పిస్తున్నామని అన్నారు. ప్రపంచంతో పోటీపడేవిధంగా విద్యా వ్యవస్థను తీర్చి దిద్దుతున్నామని అన్నారు.

పేద బతుకులు మారాలంటే విద్యను నిర్లక్ష్యం చేయవద్దని, బాగా చదివి తెలంగాణ, దేశ అభివృద్ధిలో భాగం అవ్వాలని సూచించారు. ప్రభుత్వం విద్య, వైద్యంపై దృష్టిసారించిందన్నారు. రాష్ట్రంలో 104 యంగ్ ఇండియా స్పోర్ట్స్, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూలను ప్రారంభిస్తున్నామని అన్నారు. వీటి వల్ల తెలంగాణ ముఖ చిత్రం మారుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

పబ్లిక్ యూనివర్సిటీలలో ఉన్న అన్ని బకాయిలను చెల్లిస్తున్నట్లు ప్రకటించారు. ఆడిటోరియం నిర్మాణం కోసం అవసరమైన చర్యల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని ప్రకటించారు.

కార్యక్రమానికి చీఫ్ ప్యాట్రన్ గా వ్యవహరించిన ఓయూ ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం మాట్లాడుతూ ఓ.యూ ఆర్ట్స్ కళాశాల చాలా చైతన్యవంతంగా పనిచేస్తుం దన్నారు. నిరంతరం విద్యార్థులతో అకడమిక్, కల్చరల్ కార్యక్రమాలతో నిండుగా కొనసాగుతుందని అన్నారు. గత ఎనిమిది నెలల్లో కళాశాలలో గుర్తించదగ్గ మార్పులు వచ్చాయని, దీనికి కారణమైన కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి. కాశీం, సిబ్బంది అన్నారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి. కాశీం మాట్లాడుతూ కళాశాల వార్షిక రిపోర్టును ప్రవేశపెట్టారు. ఆర్ట్స్ కాలేజీలో ప్రతిభావంతమైన విద్యార్థులు ఉన్నారని, ప్రభుత్వం నిర్వహించే అనేక ఉద్యోగ నోటిఫికేషన్లలో ఆర్ట్స్ కళాశాల విద్యార్థులే ఎక్కువగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ. జి. నరేష్ రెడ్డి, ఓ ఎస్ డి ప్రొ. ఎస్. జితేందర్ నాయక్, యూజిసి డీన్ ప్రొ. బి. లావణ్య, డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ ప్రొ. సయద్ తలాత్ సుల్తాన, వైస్ ప్రిన్సిపాల్స్ డా. కొండా నాగేశ్వరరావు, డా. బాలు నాయక్, డా. పి. స్వాతి, డా. సి. ఎస్. స్వాతిలతో పాటు వివిధ శాఖల అధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పెద్ద యెత్తున్న ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసారు.

వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులను అలరించాయి. టీచింగ్ అండ్ నాట్ టీచింగ్ స్టాఫ్ చేసిన అంత్యాక్షరి కార్యక్రమం విద్యార్థులను ఉర్రూతలూగించాయి.

# జిల్లాకు రూ.కోటి చొప్పున రూ.33 కోట్లు విడుదల

### వర్షాలు, వరదలపై ప్రభుత్వం ముందస్తు చర్యలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూలై 26:** రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలపై ప్రభుత్వం ముందస్తు చర్యలు ప్రారంభించింది. అందులో భాగంగా ప్రతి జిల్లాకు రూ.కోటి చొప్పున నిధులను కేటాయించింది. తాజాగా ఆ నిధులను విడుదల చేస్తూ జిఓ జారీ చేసింది. రాష్ట్రంలోని 33 జిల్లాలకు జిల్లాకు ఒక కోటి రూపాయల చొప్పున రూ.33 కోట్లను విడుదల చేసింది. ప్రాణ, ఆస్తి నష్టం తగ్గించేందుకే ఈ తక్షణ నిధులు అవసరపడుతాయని ప్రభుత్వం పేర్కొంది. అంతేకాకుండా విపత్కర సమయాల్లో వాడుకునేందుకు కలెక్టర్లకు అత్యవసర నిధిని కేటాయిస్తామని జిల్లా కలెక్టర్లతో సిఎం సమీక్షలో ఇటీవల హామీనిచ్చారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగాన్ని సిఎం రేవంత్‌రెడ్డి అప్రమత్తం చేశారు. అన్ని జిల్లా కలెక్టర్లు, వివిధ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసేలా దిశానిర్దేశం చేయాలని సిఎం రేవంత్ ఇప్పటికే ఆదేశించారు.



మంద కృష్ణమాదిగను శాలువాతో సత్కరిస్తున్న నాయకులు

# అలయ్ బలయ్ కార్యక్రమంలో మందకృష్ణ మాదిగకు ఘన సన్మానం

**హైదరాబాద్ (కెపిహెచ్‌బి కాలనీ), జూలై 26, ప్రభాతవార్త:** కూకట్‌పల్లిలోని బోయిన్‌పల్లి మల్లారెడ్డి గార్డెన్స్‌లో మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో నిర్వహించిన యస్.సి., యస్.టి., బి.సి., మైనారిటీల అలయ్ బలయ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా దళిత, బహుజన, పీడిత వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న దళిత నాయకుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగకి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పాల్గొని, మంద కృష్ణ మాదిగని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ మంద కృష్ణ దశాబ్దాలుగా దళితుల వర్గీకరణ, హక్కుల కోసం చేపట్టిన ఉద్యమాలు తెలుగు రాష్ట్రాల్లో చరిత్రలో నిలిచిపోతాయని, రాష్ట్రపతి చేతులు మీదుగా పద్మశ్రీ అవార్డు అందుకోవడం చాలా గర్వకారణం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



మీట్ ది ప్రెస్‌లో మాట్లాడుతున్న మర్రి శశిధర్‌రెడ్డి

# తక్కువ ఖర్చుతో చతుర్వేద జలవివాదాన్ని పరిష్కారించుకోవచ్చు: మర్రి శశిధర్‌రెడ్డి

**హైదరాబాద్ (సైఫాబాద్), జూలై 26. ప్రభాతవార్త:** అతి తక్కువ ఖర్చుతో విశ్రాంత చీఫ్ ఇంజనీర్ హనుమంతరావు రూపొందించిన చతుర్వేద జల వివాదాన్ని అనుసరిస్తే వివాధాలు పరిష్కారం అవుతాయని, మూడు పంటలకు సాగునీటి సౌకర్యం రైతులకు కల్పించవచ్చునని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి చెప్పారు. ఈ మేరకు శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో టియూడబ్ల్యూజే ఆధ్వర్యంలో 'రివర్ వాటర్ డిస్ట్రిబ్యూటర్ ్ర ప్యాక్ట్స్' అనే అంశంపై నిర్వహించిన మీట్ ది ప్రెస్‌లో ఆయన మాట్లాడారు. తాగు, సాగు నీటి కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న బనకచర్ల ప్రాజెక్టు పూర్తి కావడానికి లక్షా 20 కోట్ల ఖర్చు అవుతుందని, చతుర్వేద విధానం ద్వారా ఈ ఖర్చును తగ్గించి ప్రాజెక్టును నిర్మించవచ్చునని, ఈ విషయంపై తాను ఎపి సిఎం ఎన్. చంద్రబాబునాయుడికి లేఖ రాస్తానని తెలిపారు. ఆదే విధంగా కోడంగల్ లిఫ్ట్ పథకంపై సిఎం రేవంత్‌రెడ్డికి కూడా లేఖ రాస్తానన్నారు. బనకచర్ల ప్రాజెక్టుకు ఎపి ప్రభుత్వం 81 వేల 1000 కోట్ల రూపాయల అంచనా వేసిందని, ఆది పూర్తి అయ్యేనాటికి లక్షా 20 కోట్లకు పెరుగుతుందన్నారు. దీనికోసం 54 వేల ఎకరాల భూసేకరణ, అందులో 15 వేల 300 ఎకరాలు అటవీ ప్రాంతం ఉందన్నారు. 30 లక్షల ఎకరాలకు నీరు అందించడానికిగాను ఎకరానికి లక్ష రూపాయల ఖర్చుతో ఈ ప్రాజెక్టు నిర్మిస్తున్నారని, అయితే చతుర్వేద జల విధానం ద్వారా కేవలం 4 వేల రూపాయల ఖర్చుతో ఈ ప్రాజెక్టును నిర్మించవచ్చునన్నారు. చతుర్వేద విధానాన్ని రాజస్తాన్ ప్రభుత్వం అనుసరించి మంచి మంచి ఫలితాలను సాధించిందని, వర్షపు నీరు ఒక్క చుక్క కూడా వృదా కాకుండా రైతులు పంటలు పండించుకుంటున్నారని, ఈ విధానాన్ని తెలుగు రాష్ట్రాలు అనుసరిస్తే రైతులకు మేలు జరుగుతందని మర్రి శశిధర్‌రెడ్డి వివరించారు. సమావేశంలో టియూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విరాహత్‌ఆలీ, రాంనారాయణ పాల్గొన్నారు.

# చంద్రబాబుకు ఉన్న అతిపెద్ద కోవర్టు రేవంత్‌రెడ్డి

### పోలీసులు రేవంత్‌కు కట్టుబానిసలుగా పనిచేస్తున్నారు

### బిఆర్‌ఎస్వీ సదస్సులో కెటిఆర్ ప్రసంగం



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూలై 26:** తెలంగాణ పోలీసులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్లకుంట్ల తారక రామారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. పోలీసులు చేయాల్సిన పని ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. శనివారం మల్లాపూర్‌లో విఎన్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన బీఆర్ఎస్వీ సదస్సులో కేటీఆర్ ప్రసంగించారు. ఎవరూ సోషల్ మీడియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్నారో కనుక్కోవడమే పోలీసుల పనిగా మారిందని విమర్శించారు. తెలంగాణలో పోలీసు వ్యవస్థ ఘోరంగా ఉందని ఆరోపించారు. పోలీసుల మెడకాయపైన తలకాయ ఉన్న పనే చేస్తున్నారా?. పోలీసులు అన్నం తింటున్నారా? గడ్డి తింటున్నారా? అని ప్రశ్నించారు. తెలంగాణ పోలీసులు రేవంత్ రెడ్డి కట్టు బానిసలుగా పనిచేస్తున్నారని షాకింగ్ కామెంట్స్ చేశారు. అధికారం శాశ్వతం కాదని.. రేవంత్ బానిసలుగా పని చేస్తున్న ఒక్కో పోలీసు పేరు రాసి పెట్టుకోవాలని బీఆర్ఎస్ శ్రేణులకి పిలుపునిచ్చారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్ని లెక్కలు వడ్డీతో సహా కలిపి చెల్లిస్తామని హెచ్చరించారు. చంద్రబాబునాయుడుకు పెద్ద కోవర్టు అయిన రేవంత్‌రెడ్డి గోదావరి నీళ్లను ఆంధ్రకు అప్పగిస్తున్నారని, బనకచర్ల ప్రాజెక్ట్ ఆపేదాక తాము పోరాటం చేస్తామని కెటిఆర్ ఉద్ఘాటించారు. తెలంగాణ నీటి వాట మనకి ఇచ్చిన తర్వాత ఎవరూ ఏ ప్రాజెక్ట్ కట్టుకున్నా మనకి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. ఎలాంటి పర్మిషన్ లేకుండా ప్రాజెక్ట్ కడుతామంటే ఎలా? అని ప్రశ్నించారు. పోస్ట్ కార్డు, ఆన్‌లైన్ పిటిషన్ ద్వారా మన డిమాండ్ తెలియ చేద్దామని అన్నారు. సముద్రంలో కలిసే గోదావరి మిగులు జలాల విషయంలో కేంద్ర ప్రభుత్వం నోరు విప్పాలి. తెలంగాణ వాటా తేలుస్తూ స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం,ఫోన్ టాపింగ్ అంటూ బిఆర్ఎస్ మీద కాంగ్రెస్,బిజెపి ఒక్కటై కుట్రలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. అన్ని ప్రభుత్వాలు ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నాయని.. తాము కూడా ట్యాపింగ్ చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి ఒప్పుకున్నారని గుర్తుచేశారు. అధికారులు ట్యాపింగ్ చేస్తే చేయొచ్చని రేవంత్‌రెడ్డి అన్నారని చెప్పారు. రేవంత్ ప్రభుత్వంలో ట్యాపింగ్ చేస్తే అధికారుల తప్పా? అని నిలదీశారు. కేసీఆర్ ప్రభుత్వంలో ట్యాపింగ్ చేస్తే కేసీఆర్, కేటీఆర్‌లది తప్పా? అని ప్రశ్నించారు. కేసీఆర్ నాట్ల సమయంలో రైతుబంధు ఇస్తే... రేవంత్‌రెడ్డి ఓట్లప్పుడు ఇస్తున్నారని విమర్శించారు. మనకి సోషల్ మీడియా సపోర్ట్ తప్పా.. ఏ మీడియా సపోర్ట్ లేదని చెప్పుకొచ్చారు. సోషల్ మీడియాలో మన తడాఖా చూపెట్టాలని మాజీ మంత్రి కేటీఆర్ సూచించారు.

# ఎర్రగడ్డ-హైటెక్‌సిటీ ప్రధాన రహదారి సమస్యను పరిష్కరిస్తాం

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (యూసుఫ్‌గూడ), జూలై 26, ప్రభాతవార్త:** ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించే బాధ్యత ప్రజా ప్రతినిధులుగా తమపై ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. శనివారం ఎర్రగడ్డలోని బ్రిగేడ్‌లో జరిగిన సమావేశంలో అన్నిశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో జనప్రియ మెట్రో పాలిస్, వాసవి, కలపతరు బ్రిగేడు, మోతీనగర్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ, పాండురంగానగర్, అవంతినగర్ తోట, కళ్యాణ్‌నగర్ వెంచర్3, రాజీవ్‌నగర్, బీఎస్టీ కాలనీలకు చెందిన సంక్షేమ సంఘాలు పాల్గొన్నాయి. ఎర్రగడ్డ నుంచి హైటెక్ సిటీ ప్రధాన రహదారి పనులు చేపించాలంటూ జేఏసీగా ఏర్పాటు చేయటం జరిగిందని అందరి తరపున సమావేశం ఏర్పాటు చేసి కేంద్రమంత్రి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు అడుగుతున్న ప్రధాన సమస్య రహదారి సమస్య అని ఈ విషయమై జూన్ 3వ తేదీనే మూడు రోడ్లకు సంబంధించి తమ దృష్టికి వచ్చిందని వాటిని ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడటం జరిగిందని అందుకు అవసరమయ్యే ఎస్టిమేషన్ కూడా పూర్తయ్యిందని దాదాపు రూ.90 లక్షల వరకు నిధులు అవసరం ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా ఎర్రగడ్డ నుంచి హైటెక్ సిటీకి వెళ్లే రహదారిలో 7 స్థలాలు సంబంధించి సేకరణ చేయాల్సి ఉండగా అందుకు వారు అంగీకరించకపోవడంతో పనుల్లో జాప్యం జరుగుతుందని వెంటనే అందుకు సంబంధించిన స్థల సేకరణ పూర్తి చేయాలని శేరిలింగమ్‌పల్లి జోనల్ కమిషనర్‌కు, డిప్యూటీ కమిషనర్‌కు సర్కిల్ 19 డిప్యూటీ కమిషనర్‌కు సూచించారు. ఈ ప్రాంతంలో 4,200 ప్లాట్లు ఉన్నాయని వారంతా ప్రభుత్వానికి పన్ను చెల్లిస్తారని సమస్యలు పరిష్కరించాలంటూ అడిగే హక్కు వారికి ఉంద ని వాటికి పూర్తి చేసే బాధ్యత మనపై ఉందన్నారు. వాటర్ వర్క్స్, డ్రైనేజీ సమస్యలు కూడా పరిష్కరించాలన్నారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. నగరంలో వీధి దీపాల సమస్య అధికంగానే ఉందని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీలో నిధుల కొరత ఉన్నమాట వాస్తవమని తమ దృష్టికి వచ్చిన సమస్యలను త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తామని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తన వంతుగా పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. శేరిలింగమ్‌పల్లి జోనల్ కమిషనర్ హేమంత్, డిప్యూటి కమిషనర్ రజినీకాంత్‌రెడ్డి వాటర్‌వర్క్ జీఎం ప్రభాకర్, ఎలక్ట్రికల్ డీఈ బీమానయక్, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ అధ్యక్షులు లంకల దీపక్‌రెడ్డి, జేఏసీ కన్వీనర్ వెంకటనరసింహారావు, బ్రిగేడ్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు వాసవి బృందావనం అధ్యక్షులు జీ.హనుమంతరావు, చేకూరి హనుమంతు నాయుడు, ఉదయ్‌కుమార్, సీతారామయ్య, పాస్ మూర్తి, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.



ఎర్రగడ్డలోని బ్రిగేడ్‌లో సమస్యలపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిప్రతం అందజేస్తున్న జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు.

# కెటిఆర్.. అనవసరంగా నా జోలికి రావొద్దు

### అలా చేస్తే నిజాలు బయటకొస్తాయి..

### తెలంగాణలో ఎక్కడైనా చర్చకు సిద్ధమని సవాల్

### నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడకుంటే తీవ్ర పరిణామాలు: అనకాపల్లి ఎంపి సిఎం రమేష్



శనివారం క్యాంపు కార్యాలయంలో మీడియాలో మాట్లాడుతున్న అనకాపల్లి ఎంపి సిఎం రమేష్

**అనకాపల్లి, జూలై 26, ప్రభాతవార్త :** 'కెటిఆర్ ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడు.. నా జోలికి వస్తే నిజాలు బయటకు వస్తాయి జాగ్రత్త' అంటూ అనకాపల్లి ఎంపి సీఎం రమేష్ అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ మాజీమంత్రి కెటిఆర్ చేసిన ఆరో పణలపై స్పందించి ఘాటు వ్యాఖ్యలు చేసారు. తెలంగాణలో రిత్విక్ కంపెనీకి 1660 కోట్ల కాంట్రాక్ట్ వర్కులకు సంబంధించి నాపై ఆరోపణ చేయడం మూర్ఖత్వమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కుమ్మక్కయి నేను కాంట్రాక్ట్ పొందాను అనేది పూర్తిగా అవాస్తవమని అన్నారు. ఇందులో నాకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఆంధ్రాలో జగన్మోహన్ రెడ్డికి చెల్లెమ్మ షర్మిలతో పోరు ఉన్నట్టే తెలంగాణ లో నీకు కూడా చెల్లెలి పోరుతో పూర్తిగా మతిభ్రమించి మాట్లాడుతున్నావని అన్నారు. ప్రభుత్వం ఏదైనా కంపె నీలకు కాంట్రాక్ట్ ఇచ్చేటప్పుడు ఎటువంటి నియమ నిబంధనలు పాటిస్తారో పది సంవత్సరాలు మంత్రిగా పనిచేసిన నీకు తెలియదా అని ప్రశ్నించారు.

నువ్వు నాలుగు నెలల క్రితం ఢిల్లీలో నా ఇంటికి వచ్చిన నీవు మాట్లాడవో గుర్తుందా.. కావాలంటే నువ్వు వచ్చి వెళ్లిన సీసీటీవీ ఫుటేజి కూడా మీడియాకు పంపిస్తానని అన్నారు. మీ ప్రభుత్వంలో చేసిన అవినీతి బయటకు రాకుండా, కవితను వదిలేయడానికి ఏర్పాట్లు చేస్తే బిజెపి పార్టీలో మీ పార్టీని కలపడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పావు అవునా? కాదా? అని అన్నారు. నేను మా పార్టీ పెద్దలతో చర్చించి మీది అవినీతి పార్టీ అని, తెలంగాణలో మీ పని అయిపోయిందని, మీతో మాకు పని లేదని చెప్పడం వల్లే ఇటువంటి ఆరోపణ చేస్తున్నావని అన్నారు. గతంలో మీ పార్టీ టిడిపితో పొత్తు పెట్టుకు న్నప్పుడు 300 ఓట్ల మెజార్టీతో నువ్వు ఏవిధంగా ఎమ్మెల్యేగా గెలిచావో నన్ను చెప్పమంటావా అని అన్నారు. తుమ్మల నాగేశ్వరరావు లాంటి నాయ కుడిని మీ పార్టీ ఎందుకు వదిలేసుకుందని నిన్ను నేను అడిగితే మా పార్టీకి కమ్మ నా కొడుకులు అవసరం లేదని, రేవంత్‌రెడ్డి గెలిచిన తర్వాత మా పార్టీలో రెడ్డిలు కూడా రేవంత్ వెనకాల వెళ్లిపోయారని, ప్రస్తుతం ఎపిలో జగన్మోహన్‌రెడ్డితోనే కలిసి ప్రయాణం చేస్తున్నామని నువ్వు నాతో చెప్పావా లేదా? అన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలో బిజెపి టిడిపి పొత్తుతో పని చేస్తాయని అప్పుడు టిఆర్ఎస్‌కు పుట్టగతులు ఉండవని తెలిసే ఇటువంటి నిరాధార ఆరోపణలు చేస్తున్నావని అన్నారు. మీ పార్టీ పదేళ్ళ పాలనలో తెలం గాణలో 7 లక్షల కోట్ల కాంట్రాక్టులు ఇచ్చారు? అవి ఎవరెవరికి ఇచ్చారు? అందులో తెలంగాణ వాళ్ల ఎంతమంది? ఆంధ్రవాళ్లు ఎంతమంది అన్నది నా దగ్గర పూర్తి ఆధారాలు ఉన్నాయన్నారు. దమ్ముంటే రండి మీరు చెప్పిన చోటికి తెలంగాణభవన్ అయినా పర్లేదు ప్రెస్ క్లబ్బు అయినా పర్లేదు, హైదరా బాద్‌లో ఎక్కడైనా సరే నేను వస్తాను మీడియా సమక్షంలో బహిరంగంగా చర్చిద్దామని సవాల్ విసిరారు. కేటీఆర్ ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడకపోతే తీవ్రపరిణాలుంటాయి. అనవసరంగా నా జోలికి వస్తే ఇంకా మీ గురించి చాలా నిజాలు చెప్పాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

# సంతానం కోసం వస్తే వేరొకరి వీర్యంతో ఐవిఎఫ్!

### డిఎన్ఎ టెస్టులో వెలుగుచూసిన మోసం

### పోలీసులకు ఫిర్యాదు చేసిన దంపతులు

### సృష్టి టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్‌పై కేసు నమోదు

**హైదరాబాద్, జూలై 26, ప్రభాతవార్త:** వివాహం జరిగి ఏళ్లు గడుస్తున్న సంతానం కలగకపోవడంతో ఐవీఎఫ్ పద్ధతిలో పిల్లల కోసం సికింద్రాబాద్‌లోని సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్‌ను ఆశ్రయించారు. తన భర్త వీర్య కణాల ద్వారా సంతానం పొందాలనే ఆశతో వచ్చిన ఆ మహిళ ఐవీఎఫ్ విధానంలో గర్భం దాల్చి ఇటీవల మగబిడ్డకు జన్మనిచ్చింది. అయితే ఆ బాలుడు తరచూ అనారోగ్యం పాలవుతుండటంతో వైద్య పరీక్షలు నిర్వహించగా క్యాన్సర్ ఉన్నట్లు తేలింది. దంపతులిద్దరి కుటుంబాలకు క్యాన్సర్ చరిత్ర లేకపోవడంతో అనుమానం వచ్చి మరోసారి టెస్ట్ ట్యూబ్ సెంటర్‌కు వచ్చి వైద్యులను సంప్రదించారు. అక్కడ వాళ్లు అడిగిన ప్రశ్నలకు పొంతనలేని సమాధానం చెప్పడంతో అనుమానం వచ్చి డీఎన్ఏ పరీక్షలు చేయించుకున్నారు. దీంతో సదరు మహిళ భర్త వీర్యంతో కాకుండా మరో వ్యక్తి నుంచి వీర్యకణాలు సేకరించి, ఐవీఎఫ్ పద్ధతిలో పిండాన్ని అభివృద్ధి చేసినట్లు గుర్తించారు. ఈ క్రమంలో బాధిత దంపతులు తమకు జరిగిన అన్యాయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నార్త్ జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ సదరు సెంటర్‌ను పరిశీలించి మీడియాతో మాట్లాడారు. సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌లో పోలీసులు వైద్యాధికారులు రెవెన్యూ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారని అన్నారు. ఫెర్టిలిటీ క్లినిక్ పై వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని తెలిపారు. అక్రమంగా ఐవీఎఫ్ చికిత్స చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. హైదరాబాద్ జిల్లా వైద్య అధికారులు ఈ అంశంపై లోతుగా సమగ్రంగా విచారణ చేస్తున్నారని, ఫెర్టిలిటీ క్లినిక్‌కు అనుమతులు ఉన్నాయా లేదా అనే అంశంపై కూడా దర్యాప్తు జరుగుతుందన్నారు. విచారణ పూర్తయిన అనంతరం పూర్తి విషయాలు వెల్లడిస్తామని, అన్ని కోణాలలో దర్యాప్తు చేస్తూ వీలైనంత త్వరగా ఈ గొలుసు కట్టును చేధిస్తామని డీసీపీ స్పష్టం చేశారు.

# రాష్ట్రంలో ఆగని ఎటిఎం దోపిడీలు..

### పోలీసులకు సవాల్ విసురుతున్న ఉత్తరాది నేరగాళ్లు

### పక్కారెక్కీ.. సిసి కెమెరాలపై నలుపు రంగు స్ప్రేచేసి అనవాలు దొరక్కుండా వ్యూహాలు

**హైదరాబాద్, జూలై 26, ప్రభాతవార్త:** తెలంగాణలో ఎటిఎంల దోపిడీలు ఆగడం లేదు. ఉత్తరాది నేరగాళ్లు పక్కాగా రెక్కీ నిర్వహిస్తూ కాపలాలేని ఎ టిఎంలను ఎంచుకుని, అక్కడి సిసి కెమెరాలపై ముసుగులు ధరించిన దోపిడి దొంగలు నలుపు రంగు స్ప్రే చల్లడం ద్వారా తమ ఆనవాళ్లు లభించ కుండా చూస్తున్నారు. ఆరు నెలల వరకు కర్నాటకలో వరుసగా ఎటిఎంలను దోపిడి చేసిన నేరగాళ్లు కొన్ని నెలలుగా తెలంగాణలోని ఎటిఎంలను టార్గెట్ చేస్తున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ఎటిఎంల దోపిడికి ఉత్తరాది నేరగాళ్లే కారణమని పోలీసులకు ఆధారాలు లభించినా చాలా కేసుల్లో ఇప్పటి వరకు దొంగలు పట్టుబడక పోవడం గమనార్హం.

గత జనవరి నెలలో కర్నాటకలో గంటల వ్యవధిలో రెండు చోట్ల ఎటిఎంలను దోచుకుని అడ్డువచ్చిన ఒక గార్డును కాల్చి చంపిన ముఠా అనంతరం బిహార్‌కు పారిపోతూ హైదరాబాద్‌లోని అఫ్జల్‌గంజ్‌లో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో ఆపరేటర్‌పై కాల్పులకు దిగడం తెలిసిందే.

ఈ కాల్పుల్లో గాయపడ్డ వ్యక్తి కోలుకున్నా దొంగలు మాత్రం ఇప్పటి వరకు పట్టుబడలేదు. ఈ ఘటన తరువాత రాష్ట్ర పోలీసులతో పాటు ఇతర రాష్ట్రాల పోలీసులు కూడా ఎ టిఎంలను దోచుకునే దొంగలపై దృష్టి సారించారు. ఓవైపు దొంగల కోసం పోలీసులు గాలిస్తున్న దశలో రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో ఇంకో ఎ టి ఎంను నేరగాళ్లు లూటీ చేశారు. మహేశ్వరంలోరి రావిర్యాలలో పాత తరహా భద్రత వ్యవస్థ కలిగిన ఎస్‌బిఐ ఎటిఎంను నలుగురు దుండగులు కా రులో వచ్చి నాలుగు నిమిషాల వ్యవధిలో దోచుకున్నారు. ఈ సందర్భంగా సిసి కెమెరాలపై నల్లటి స్ప్రే చల్లి, కరెంటు తీగలను కట్ చేశారు.

ఈ సందర్భంగా 30 లక్షల రూపాయలను దుండగులు లూటీ చేశారు. దీని తరువాత శివార్లలోని మైలార్‌దేవుపల్లిలో మరో ఎటిఎంను దోచుకునేందుకు యత్నించారు. అయితే ఈ ఎటిఎంను లూటీ చేసే క్రమంలో దుండగులు కట్టర్‌ను వాడగా కరంట్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగా యి. దీంతో దుండగులు ఎటిఎంను వదిలి పారిపోయారు. దీని తరువాత గత మే నెల 31వ తేదీన సూర్యాపేట్ జిల్లాలోని హుజూర్‌నగర్‌లో ఎస్ బిఐ ఎటిఎంపై దుండగులు దాడిచేసి 20 లక్షల రూపాయలను దోచుకున్నారు. ఈ ఘటనలో ఎటిఎం యంత్రాన్ని నేరగాళ్లు కాల్చివేశారు. తాజాగా ఆదిలాబాద్ పట్టణంలో ఎస్‌బిఐకే చెందిన మరో ఎటిఎంను ధ్వంసం చేసి అందులోని 14 లక్షల రూపాయలను దోచుకున్నారు. దీంతో పాటు రాష్ట్ర ంలోని మరో రెండు చోట్ల ఎటిఎంలపై దుండగులు దాడులకు దిగారు. రాష్ట్రంలో ఎటిఎంల దోపిడి జరిగిన అన్నిచోట్ల దుండగులు ముందుగా అక్కడి సిసి కెమెరాలపై నలుపు రంగు స్ప్రే చల్లి తమ ఉనికి తెలియకుండా జాగ్రత్త పడ్డారు. దీంతో పాటు ముసుగులు ధరించి, చోరీ నంబర్ ప్లేట్ కలి గిన కారులో ప్రయాణించినట్లు పోలీసులు గుర్తించారు. కొన్నిచోట్ల ఎటిఎంలను దోచుకునే సమయంలో దుండగులు సమీపంలోని బంగారు నగల దుకాణాలను టార్గెట్ చేయడం గమనార్హం. ఆదిలాబాద్‌లో తాజాగా జరిగిన ఎటిఎం లూటీకి ముందు నేరగాళ్లు సమీపంలోని నగల దుకాణాన్ని దో చుకునేందుకు యత్నించారు. అయితే ఆ దుకాణం షట్టర్ తాళాలు గట్టిగా వుండడంతో దొంగల ఆటలు సాగలేదు.

**ఉత్తరాది నేరగాళ్ల హస్తం..**

**ఎటిఎంల వద్ద భద్రత శూన్యం**

ఇదిలా ఉండగా రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న ఎటిఎంల దోపిడీ వెనుక ఉత్తరాది నేరగాళ్ల ముఠాల హస్తం వుందని పోలీసులకు ఆధారాలు లభి ంచాయి. అయితే వీరంతా అంతరాష్ట్ర నేరగాళ్లు కావడం, నిరంతరం సంచరిస్తుండడంతో పట్టుకోవడం కష్టంగా మారుతోంది. మరోవైపు ఎటిఎంల వద్ద ఆయా బ్యాంకుల యాజమాన్యాలు కనీస భద్రత కూడా తీసుకోవడం లేదనే విమర్శలు వున్నాయి.

నిబంధనల ప్రకారం ఎటిఎంల వద్ద సెక్యూరిటీ గార్డులు వుండాలి. కానీ మెజారిటీ ఎటిఎంల వద్ద ఎవరూ వుండడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో జనసమ్మర్థం కలిగిన చోట, పోలీసు స్టేషన్లు, బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్ల వద్ద వీటిని ఏర్పాటు చేయాల్సి వున్నా దీని గురించి బ్యాంకుల యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. ఆఖరుకు ఎటిఎ ంలపై ఎవరైనా దాడిచేసే వెంటనే సమీప పోలీసు స్టేషన్లను అప్రమత్తం చేసేందుకు వీలుగా అలారం వ్యవస్థలు కూడా ఎక్కడా వుండడం లేదు. ఇవన్నీ ఎటిఎంలను దొంగలు విచ్చల విడిగా దోచుకునేందుకు ఉపయోగపడుతున్నాయి.

# గోదావరి- బనకచర్ల ద్వారా తెలంగాణకు తీరని అన్యాయం

### బిఆర్ఎస్‌వి సదస్సులో మాజీమంత్రి హరీశ్‌రావు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 26:** గోదావరిలో తెలంగాణకు 967 టీఎంసీలు, ఏపీకి 513 టీఎంసీలు కేటాయించారని బిఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి టి. హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణ చర్చ సందర్భంగా ఇవి కూడా చర్చకు వచ్చాయని అన్నారు. కానీ తెలంగాణకు రావాల్సిన 967 టీఎంసీలను కూడా ఏపీ వ్యతిరేకిస్తుందని మండిపడ్డారు. తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూ రాసిన లేఖలను ఏపీ ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మల్లాపూర్ వీఎన్ఆర్ గార్డెన్‌లో శనివారం నాడు నిర్వహించిన బీఆర్ఎస్‌వీ రాష్ట్ర స్థాయి సదస్సుకు హరీశ్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా బనకచర్ల ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. నదీ పరివాహక ప్రాంతంలో నాగరికత ఉంటుందని అన్నారు. కృష్ణా, గోదావరి జలాల్లో మన వాటా మనం దక్కించుకోవాలని పిలుపునిచ్చారు. గోదావరి బనకచర్ల ద్వారా తెలంగాణకు తీరని అన్యాయం జరుగుతుందని హరీశ్‌రావు అన్నారు. దీనిపై గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో యూనివర్సిటీల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. పోతిరెడ్డిపాడు వెనుక కాంగ్రెస్ రెగ్యులరైజ్ బనకచర్ల అని ఆయన వ్యాఖ్యానించారు.

# ఫిడే మహిళల చెస్‌వరల్డ్ కప్.. డ్రాగా ముగిసిన తొలి గేమ్

### నేడు రెండో గేమ్‌లో తలపడనున్న కోనేరు హంపి, దివ్య దేశ్‌ముఖ్

### 2వ గేమ్ డ్రా అయితే, సోమవారం టైబ్రేక్ ద్వారా విజేత ఫైనల్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 26:** జార్జియాలోని బాటుమిలో జరుగుతున్న వరల్డ్ చెస్ పోటీ భారత్ ఆధిపత్యానికి తాజా నిదర్శనం..ఫిడే మహిళల చెస్ వరల్డ్ కప్ ఫైనల్ ఆసక్తికరంగా సాగుతోంది. రెండు రోజుల తుది పోరు శనివారం ఆరంభమైంది. ఈ రోజు జరిగిన తొలి గేమ్ డ్రా అయింది.ఈ తుదిపోరులో భారత్‌కు చెందిన తెలుగు అమ్మాయి



కోనేరు హంపి, దివ్యా దేశ్‌ముఖ్ అమీతుమీ తేల్చుకోనున్నారు. 38 ఏళ్ల హంపి డిఫెండింగ్ వరల్డ్ ర్యాపిడ్ చాంపియన్ కాగా, 19 ఏళ్ల దివ్య వర్ధమాన సంచలనం. వరల్డ్ నెం. 5 హంపి, 18వ ర్యాంకర్ దివ్యా దేశ్‌ముఖ్ సెమీఫైనల్స్‌లో చైనా స్టార్లకు షాకివ్వడం విశేషం. ప్రపంచ కప్‌లో ఇద్దరు భారత క్రీడాకారిణులు ఫైనల్‌కు చేరడం చరిత్ర. టైటిల్ ఫైట్‌కు చేరడం ద్వారా గ్రాండ్‌మాస్టర్ హంపి, ఇంటర్నేషనల్ మాస్టర్ దివ్య ప్రతిష్ఠాత్మక క్యాండిడేట్స్ టోర్నమెంట్‌కు క్వాలిఫై అయ్యారు. క్యాండిడేట్స్ టోర్నీ ద్వారా ప్రపంచ చాంపియన్ జు వెన్‌జున్‌తో టైటిల్‌కోసం తలపడే క్రీడాకారిణిని నిర్ణయిస్తారు. ఇక..వరల్డ్ కప్ ఫైనల్లో శనివారం జరిగిన క్లాసికల్ ఫార్మాట్ మొదటి గేమ్‌లో హంపి, దివ్య తలపడ్డారు. హంపి నల్లపావులు, దివ్య తెల్లపావులతో ఆడారు. ఈ గేమ్ డ్రా కావడంతో ఇరువురి మధ్య ఆదివారం రెండో గేమ్ జరగనుంది. ఒకవేళ రెండు గేముల్లో విజేత తేలకపోతే..ఇది కూడా డ్రా అయితే సోమవారం టై బ్రేక్ ద్వారా విజేతను ప్రకటిస్తారు. ఈ ఆసక్తికర అంతిమ సమరంలో అనుభవజ్ఞురాలైన హంపి విజేతగా నిలుస్తుందా లేక దివ్య సంచలనం సృష్టిస్తుందా? ఎవరు నెగ్గినా వరల్డ్ కప్‌లో స్వర్ణ, రజత పతకాలు భారత్‌కే దక్కనున్నాయి. ప్రపంచకప్ విజేతకు టైటిల్‌తో పాటు రూ.43లక్షలు,రన్నరప్‌కు రూ.30లక్షల ప్రైజ్‌మనీ దక్కనున్నాయి. టెలివిజన్,ఓటీటీల్లో ప్రత్యక్ష ప్రసారం లేదు. లైవ్ మ్యాచ్‌ను ఫిడే అధికారిక యూట్యూబ్‌లో చూడొచ్చు.

# కర్ణాటక సిఎం, డిప్యూటీ సిఎంల ఓఎస్‌డిల ఘర్షణ

**న్యూఢిల్లీ,జూలై 26:** కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మధ్య నెలకొన్న విభేదాలు మరో మలుపు తిరిగాయి. ఇరువురి సహాయక అధికారుల మధ్య ఘర్షణ జరిగింది. ఢిల్లీలోని కర్ణాటక భవన్‌లో వారిద్దరూ భౌతికంగా కొట్టుకునే పరిస్థితికి ఉద్రిక్తతలు దారి తీశాయి. అసిస్టెంట్ రెసిడెంట్ కమిషనర్, సీఎం సిద్ధరామయ్య స్పెషల్ డ్యూటీ ఆఫీసర్ (ఎస్డీవో) సీ మోహన్ కుమార్, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఎస్డీవో హెచ్ ఆంజనేయ మధ్య నెలకొన్న వివాదం తీవ్రమైంది. ఈనెల 22న కర్ణాటక భవన్‌లోని పరిపాలన బ్లాక్‌లో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో షూ తీసి కొడతానని మోహన్ కుమార్ తనను బెదిరించినట్లు ఆంజనేయ ఆరోపించారు. మిగతా అధికారుల ముందు తన పట్ల అసభ్యత, అవమానకరంగా ప్రవర్తించినట్లు విమర్శించారు. కర్ణాటక భవన్ రెసిడెంట్ కమిషనర్ ఇమ్‌కాంగ్లా జమీర్, కర్ణాటక ప్రధాన కార్యదర్శి షాలిని రజనీష్‌కు ఆంజనేయ అధికారికంగా ఫిర్యాదు చేశారు. మోహన్ కుమార్ తనను వేధించడంతోపాటు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, విధులకు పదే పదే అడ్డంకులు సృష్టించారని ఆయన ఆరోపించారు. తనకు ఏదైనా జరిగితే దానికి మోహన్ కుమార్ బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఆయనపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో కర్ణాటక ప్రధాన కార్యదర్శి రజనీష్ అధికారిక విచారణకు ఆదేశించారు.

# బాలల సంరక్షణ, పునరావాసం బలోపేతం

### చైల్డ్ వెల్ఫేర్, జువైనల్ జస్టిస్ బోర్డులకు నోటిఫికేషన్

**హైదరాబాద్, జూలై 26, ప్రభాతవార్త:** తెలంగాణలో బాలల సంరక్షణ, పునరావాస కార్యక్రమాలను బలోపేతం చేసే దిశగా రాష్ట్ర సర్కార్ నిర్ణయం తీసుకుంది. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, జువైనల్ జస్టిస్ బోర్డుల నియామకాలకు ప్రకటన జారీ చేసింది. ఈ నియామకాలను పిల్లల సంరక్షణ, మోడల్ రూల్స్ 2016లోని నిబంధనలకు అనుగుణంగా చేపట్టనున్నారు. ప్రతి జిల్లాలో ఏర్పాటు చేయబోయే ఒక్కో చైల్డ్ వెల్ఫేర్ కమిటీలో ఒక చైర్ పర్సన్‌తో పాటు నలుగురు సభ్యులుంటారు.

రాష్ట్రంలో ప్రస్తుతం 36 చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు ఉండగా, 17 జువైనల్ జస్టిస్ బోర్డులు పనిచేస్తున్నాయి. వీటితోపాటు, ఈ సారి కొత్తగా మరో 16 జువైనల్ జస్టిస్ బోర్డులను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ కమిటీలు, బోర్డులు బాలల సంరక్షణ, రక్షణ, పునరావాసం, నేరాలకు పాల్పడిన బాలలకు న్యాయం అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ నియామకాల ద్వారా రాష్ట్రంలోని బాలల సంరక్షణ వ్యవస్థ మరింత పటిష్టమవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఆగస్టు 8వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# అసంపూర్తిగా ఉన్న డబుల్‌బెడ్ ఇళ్లకు రూ.5 లక్షలు

### వచ్చే నెల 15లోగా ఇళ్ల కేటాయింపు పూర్తి చేయాలి

### ఇందిరమ్మ ఇళ్ల సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నెంబర్

### రాష్ట్ర రెండో రాజధానిగా వరంగల్ సమగ్రాభివృద్ధికి ప్రత్యేకచర్యలు

### రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



సచివాలయంలో శనివారం వరంగల్ నగర అభివృద్ధిపై మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో కలిసి పలు అంశాలపై సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 26:** ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో ఇండ్ల స్థలాలు లేని అర్హత కలిగిన లబ్ధిదారులకు అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను వచ్చే నెల 15వ తేదీలోగా కేటాయించాలని, ఇందుకు అర్హులైన లబ్ధిదారుల ఎంపికను వెంటనే చేపట్టాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అంపూర్తిగా ఉన్న ఇండ్లను పూర్తిచేసుకోవడానికి ప్రభుత్వమే లబ్ధిదారులకు రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తుందని ప్రకటించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు దరఖాస్తు ఎప్పుడు చేసుకున్నారనేది ముఖ్యం కాదని నిరుపేదలకు ఇళ్లు ఇవ్వడమే ప్రధానమన్నారు. ఇప్పుడు దరఖాస్తు చేసుకున్నాకూడా వాటిని పరిశీలించాలని కలెక్టర్లకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఇసుక, చెల్లింపులు, లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి సమస్యలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శ్రావణ మాసం మొదలైన నేపథ్యంలో త్వరలోనే ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాలు కూడా ఉంటాయని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఫిర్యాదులు, సందేహాలు, సమస్యల పరిష్కారానికి హైదరాబాద్‌లోని హౌసింగ్ కార్యాలయంలో త్వరలో ఒక టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేస్తామని తెలపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల ప్రకారం శాసనసభ్యులను భాగస్వామ్యం చేసి ప్రతి మండలంలో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలని ఇందుకు సంబంధించిన ప్రణాళికను రూపొందించుకోవాలని కలెక్టర్లకు సూచించారు. వరంగల్ నగర సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా అధికారులు పని చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. సచివాలయంలో శనివారం వరంగల్ నగర అభివృద్ధిపై పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డితో కలిసి వరంగల్ విమానాశ్రయం, మెగా టెక్స్‌టైల్ పార్క్, భద్రకాళి దేవస్థానం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఔటర్‌రింగ్ రోడ్డు, రైల్వే తదితర అంశాలపై సమీక్షించారు. సిఎం రేవంత్‌రెడ్డి ఆలోచనకు అనుగుణంగా చారిత్రాత్మక వరంగల్ నగరాన్ని తెలంగాణ 2వ రాజధానిగా చేయాలన్ని సంకల్పంతో పనిచేస్తున్నామని తెలిపారు.గతంలో ఎన్నడూ లేని విధంగా వరంగల్ నగరా భివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ప్రభుత్వ ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకొని అధికార యంత్రాంగం పనిచేయాలన్నారు.వరంగల్ అభివృద్ధికి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన డిపిఆర్. టెండర్, పనులు ప్రారంభించడానికి, పూర్తి చేయడానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని పనిచేయాలని సూచించారు. వరంగల్ ప్రాంత చిరకాల స్వప్నమైన మామునూరు ఎయిర్ పోర్ట్ కల త్వరలో సాకారం కానుందని అయితే ఎయిర్ పోర్ట్‌కు అవసరమైన భూ సేకరణ యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

భూ సేకరణకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేవని రెండు రోజుల క్రితం రూ.205 కోట్లను విడుదల చేశామని, ఈ భూ సేకరణకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు విడుదల చేస్తామన్నారు. కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ కు సంబంధించి అక్కడ రాజీవ్ గాంధీ టౌన్ షిప్‌లో ఆర్ ఆర్ ప్యాకేజీ కింద 1398 మంది లబ్ధిదారులను గుర్తించి 863 ప్లాట్‌లు కేటాయించడం జరిగిందని తెలపారు. ఈ కాలనీకి సంబంధించి సెప్టెంబర్ నెలాఖరు నాటికి మౌలికసదుపాయాల కల్పన పూర్తికావాలని ఆదేశించారు. అలాగే వెటర్నరీ హాస్పిటల్, ప్రాథమిక పాఠశాల, గ్రామ పంచాయితీ కార్యాలయ భవనం నిర్మించాలని, మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగ కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రూ.4170 కోట్లతో 2057 జనాభాను దృష్టిలో పెట్టుకొని వరంగల్ పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని, పనులను వీలైనంత త్వరగా ప్రారంభించడానికి వీలుగా పనులను విభజించుకొని దశల వారీగా చేపట్టాలని సూచించారు. భద్రకాళి ఆలయ మాడవీధులతోపాటు కల్యాణ మండపం, పూజారి నివాసం, విద్యుత్ అలంకరణలను వచ్చే దసరా నాటికి అందుబాటులోకి తెచ్చేవిధంగా ప్రణాళికను రూపొందించుకొని పనిచేయాలని ఆదేశించారు. అమ్మవారి ఆలయ అభివృద్ధి పనుల పర్యవేక్షణకు తానే స్వయంగా వస్తానని చెప్పారు. రోప్‌వే, గ్లాస్‌బ్రిడ్జితో సహా అన్ని పనులు వచ్చే డిసెంబర్ కల్లా పూర్తిచేయాలన్నారు. భద్రకాళి చెరువు ప్రాంతంలో ఇంతవరకు 3.5 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించామని, 2.06 కోట్ల రూపాయిల మట్టిని విక్రయించామని అధికారులు తెలిపారు. ఈ వర్షాకాలం పూర్తయిన వెంటనే ఈ చెరువు మట్టిని తరలించాలని మంత్రి సూచించారు.

ఆలయంలో యంత్రాల సాయంతో భోజన తయారీ కార్యక్రమాన్ని చేపడతామని దీనికి తగ్గట్టుగా నిర్మాణాలు చేయాలన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ప్రకటనకు అనుగుణంగా వరంగల్ జిల్లాలో క్రికెట్ స్టేడియానికి అవసరమైన భూమిని గుర్తించాలని సూచించారు. హాస్టల్ లో విధ్యార్థులకు, హాస్పిటల్‌లో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందేలా చూడడానికి మండలానికి సంబంధించిన ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని తెలిపారు.ఈ సమావేశంలో ఎంపీ బలరాం నాయిక్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి,కె.నాగరాజు, గండ్ర సత్యనారాయణ, నాయని రాజేందర్,ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, బస్వరాజు సారయ్య, అంజిరెడ్డి, బండ ప్రకాష్, వరంగల్ మేయర్ గుండు సుధారాణి వివిధ శాఖలకు సంబంధించిన రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన కలెక్టర్లు, ఎస్పీలు, తదితరులు పాల్గొన్నారు.

# దేశ, హిందూ విభజనకు రాహుల్, రేవంత్ కుట్ర

### మాజీ ఎంపి బూర నర్సయ్యగౌడ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 26:** ఏఐసిసి అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఇరువురూ కలిసి ఒకరు దేశ విభజనకు, మరొకరు హిందూ విభజనకు కుట్ర చేస్తున్నారని బిజెపి నాయకుడు, మాజీ ఎంపి బూర నర్సయ్య గౌడ్ విమర్శించారు.రాహుల్ గాంధీ హిందూ వ్యతిరేకి అని, రేవంత్ రెడ్డి ఒబిసిలకు వ్యతిరేకంగా బిసి జపం చేస్తున్నారని వ్యాఖ్యానించారు.శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. గతంలో యుపిఏ అధికారంలో ఉన్నప్పుడు కులగణన చేయలేదని, బిసిలకు అన్యాయం చేశారని ఆయన విమర్శించారు. ఇప్పుడేమో ఆ తప్పంతా తనదేనని రాహుల్ చెప్పడం ఆశ్చర్యంగా ఉందని, దీనిని ప్రజలు విశ్వసించరని ఆయన అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎక్కువ కాలం ఢిల్లీలోనే ఉంటున్నారని, ఢిల్లీకి హవా, మోడీకా దవా బహుత్ అచ్చా లగ్తా హై అని ఆయన అన్నారు. ప్రధాని నరేంద్రమోడీ కన్వర్టెడ్ బిసి అని ముఖ్య మంత్రి చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. స్వాతంత్ర్యం లభించిన తర్వాతే బిసి, ఎస్‌సి, ఎస్‌టిలు జీవోల ద్వారానే లీగల్‌గా గుర్తింపు పొందారని ఆయన తెలిపారు. వర్గీకరణ అనేది ప్రభుత్వం నిర్ణయించిందే తప్ప తల్లి గర్భం నుంచి వచ్చేప్పుడే కులంతో రారని ఆయన చెప్పారు. జవహర్‌లాల్ నెహ్రూ పూర్వీకులు భారత దేశానికి చెందిన వారు కాదని, పర్షియన్ దేశస్తులని ఆయన తెలిపారు. కాశ్మీర్ లోయ, ఘాట్ జమ్మూకాశ్మీర్ ఇలా మొత్తం దేశంలో నెహ్రూ అనే సర్ నేమ్ ఒక్క నెహ్రూ కుటుంబానికే ఉందన్నారు. ఈ పేరు ఖచ్చితంగా తన మూలాలను గుర్తు పెట్టుకోవడానికి మోతీలాల్ తండ్రి భారత దేశంలో స్థిరపడినప్పుడు పెట్టుకున్నదే నెహ్రూ పదం అని ఆయన తెలిపారు. రాహుల్ గాంధీ కుటుంబానికి గాంధీకి ఏమి సంబంధం అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు ప్రధాని నరేంద్ర మోడీని విమర్శించే ముందు వారి నేతల మూలాల గురించి తెలుసుకోవాలని నర్సయ్యగౌడ్ హితవు పలికారు.

# కల్నల్ జాయ్‌దాస్‌గుప్తాకు సిఎం రేవంత్‌రెడ్డి సన్మానం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 26:** విజయ్ కార్గిల్ దివస్ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్‌కు చెందిన కార్గిల్ యుద్ధ వీరుడు, 18 గ్రెనడియర్స్‌కు చెందిన కల్నల్ జాయ్ దాస్ గుప్తాను సన్మానించారు. ఆయన చేసిన సేవలను అభినందించారు. టోలోలింగ్ హిల్ స్వాధీనం చేసుకునే ఆపరేషన్‌లో భాగంగా గుప్త పాల్గొనడం గర్వకారణమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. 18 గ్రెనడియర్స్ బహుళ ప్రాంగణాల దాడులను ప్రారంభించి టోలోలింగ్ హిల్‌ను విజయవంతంగా స్వాధీనం చేసుకున్న ఆపరేషన్‌లో భాగస్వామిగా (మేజర్)గుప్త ఉన్నారు. కార్గిల్ యుద్ధ సమయంలో టోలోలింగ్ హిల్ నుంచే పాకిస్తాన్ సైన్యం భారత్ సైన్యంపై కాల్పులు జరిపేది. దానిని స్వాధీనం చేసుకోవడం కీలకంగా మారింది.

కాగా,కల్నల్ జాయ్ దాస్‌గుప్తా సికింద్రాబాద్ లోని వెస్లీ కళాశాలలో ఇంటర్మీడియట్, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పట్టభద్రుడయ్యాడు. చెన్నైలోని ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో శిక్షణ పొందాడు. ఆయన ధైర్యసాహసాల ఆధారంగా సేనా పతకాన్ని అందుకున్నాడు. కల్నల్ దాస్‌గుప్తా, ఆయన 80 ఏండ్ల తల్లితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎంపీ మల్లు రవి పలు అంశాలను చర్చించారు.



### అమర జవానుల త్యాగాలను స్మరించుకున్న సిఎం రేవంత్‌రెడ్డి

భారత సాయుధ దళాల ధైర్యం,పరాక్రమాలకు ప్రతీకగా జరుపుకునే కార్గిల్ విజయ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అమర జవానుల త్యాగాలను స్మరించుకున్నారు. వీర సైనికుల త్యాగం,వారు ప్రదర్శించిన శౌర్యం దేశ ప్రజలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. యుద్ధంలో ప్రాణాలర్పించిన వీర సైనికులకు ముఖ్యమంత్రి నివాళులు అర్పించారు.

# అలిపిరిలో హోమం టిక్కెట్లు ఇక ఆన్‌లైన్‌లో

### ఆగస్టు 1 నుండి జారీకి ఏర్పాట్లు

**తిరుమల,జూలై 26 ప్రభాతవార్తప్రతినిధి:** ఏడు కొండల వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం సామాన్య భక్తులకు తిరుపతి అలిపిరిలోని సప్తగోప్రదక్షిణ మందిరంలో రోజువారీగా చేపట్టే శ్రీనివాసదివ్యానుగ్రహహోమం టిక్కెట్లను ఆఫ్ లైన్‌లో జారీచేసే ప్రక్రియను ఆన్‌లైన్‌లోకి టిటిడి మార్పుచేసింది. ఈ టిక్కెట్లను రోజుకు 50 ఆఫ్‌లైన్‌లో కరెంట్ బుకింగ్ ద్వారా ఉదయం 5గంటలకు జారీచేస్తారు. ఇందుకోసం పెద్దసంఖ్యలో భక్తులు వేకువజామున 1గంట నుండి అలిపిరిలో బారులుతీరి నిలబడి నిరీక్షిస్తారు. 1,600 రూపాయలు చెల్లించి ఇద్దరు గృహస్థ భక్తులు ఈహోమంలో పాల్గొంటే వారికి అదేరోజు తిరుమలలో 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శనం క్యూలైన్‌లో స్వామివారి దర్శనం కూడా కల్పిస్తారు. ఈ సౌలభ్యంతో ఈ హోమం టిక్కెట్లు పొందేందుకు సామాన్యభక్తులు సుముఖత చూపుతుంటారు. గత టిటిడి పాలకమండలి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఈ విధానం అమలు చేయించారు. దీనికి భక్తుల నుండి విశేషస్పందన ఉంది. రోజువారీగా 200 టిక్కెట్లు జారీచేసి హోమంలో భక్తులకు అవకాశం కల్పిస్తారు. ఈ హోమం టిక్కెట్లకు భక్తుల నుండి పెద్దగా డిమాండ్ రావడంతో 150 టిక్కెట్లు ఆన్‌లైన్‌లో, 50 టిక్కెట్లుమాత్రం ఆఫ్‌లైన్‌లో జారీచేసేలా చూశారు. ఇప్పుడు అలిపిరి వద్ద ఆఫ్‌లైన్‌లో హోమం టిక్కెట్లకు భక్తులు ఇబ్బందులు పడుతుండటంతో వాటిని కూడా ఆన్‌లైన్ లోనే జారీచేసేలా టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి నిర్ణయించారు. ఆఫ్‌లైన్ విధానం రద్దుచేసి వాటిని ఆన్‌లైన్‌లో జారీచేస్తారు. ఆగస్టు 1వతేదీ నుండి భక్తులకు ఈ హోమం టిక్కెట్లు 200 మొత్తం పూర్తిగా ఆన్‌లైన్‌లోనే జారీచేస్తారు. భక్తులు ఈ విషయాన్ని గమనించి శ్రీనివాస దివ్యానుగ్రహ హోమం టిక్కెట్లను ఆగస్టు 1నుండి ఆన్‌లైన్‌లో పొందాలని టిటిడి విజ్ఞప్తి చేసింది. ఇదిలా ఉండగా గతంలో శ్రీవారి భక్తుల కోరిక మేరకు అలిపిరి శ్రీవారి పాదాల వద్ద శుభకార్యాలు, విశేషమైన రోజుల్లో స్వామివారి అనుగ్రహం పొందడానికి సంకల్పం చెప్పుకుని యజ్ఞంలో పాల్గొని హోమం నిర్వహించుకునేలా టిటిడి ఏర్పాట్లు చేసింది. ఈ విశేష హోమంలో గృహస్థభక్తులు రూ. 1,600 చెల్లించి పాల్గొన్నవారికి తిరుమలలో రూ. 300 ప్రత్యేక ప్రవేశ దర్శనం కల్పిస్తున్నారు.

# బిసి రిజర్వేషన్ల ఆర్డినెన్స్ ఆమోదంపై సస్పెన్స్

### కేంద్ర అటార్నిజనరల్ కోర్టులో బాల్

### గవర్నర్ నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ

**హైదరాబాద్, జూలై 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోంది. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా బీసీ వర్గాల కోసం పెంచిన రిజర్వేషన్లను అమలు చేయాలని ఆలోచిస్తోంది. ఈ దిశగా పంచాయతీరాజ్ చట్టం, 2018కి సవరణలు చేయాలని నిర్ణయించి, తగిన ఆర్డినెన్సు ముసాయిదాను సిద్ధం చేసింది. జులై 11న జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ విషయంపై నిర్ణయం తీసుకుని, ఆర్డినెన్సును గవర్నర్ ఆమోదానికి జులై 15న పంపించారు. అయితే గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆ ఫైల్‌ను సమగ్రంగా పరిశీలించి, తనంతట తానే నిర్ణయం తీసుకోకుండా ఢిల్లీలోని అటార్నీ జనరల్‌కు న్యాయసలహా కోసం పంపించినట్లు సమాచారం. కాగా కులగణన ఆధారంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే ప్రతిపాదనకు రాష్ట్రం పూర్తిగా అంకితమైంది. ఈ మేరకు ఇప్పటికే అసెంబ్లీలో రెండు బిల్లులను ఆమోదించి, అవి రాజ్యాంగ 9వ షెడ్యూల్‌లో చేర్చాలని కేంద్రాన్ని కోరింది. ఆ బిల్లులు ప్రస్తుతం రాష్ట్రపతి ఆమోదానికి ఎదురు చూస్తున్నాయి. ఇంకా ఆమోదం రాకపోవడం, తిరస్కరణ కూడాకపోవడంతో ప్రభుత్వం ఆర్డినెన్సు ద్వారా ముందడుగు వేసింది. ఇప్పటికే రెండు బిల్లులు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో, ఆర్డినెన్సుకు గవర్నర్ ఆమోద మిస్తారా? లేదా? అనే సందేహం కొనసాగుతోంది. ప్రత్యేకించి అటార్నీ జనరల్ ఏ విధమైన న్యాయ సలహా ఇస్తారన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించి 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, అది రాష్ట్రానికి బలమైన అధికారాన్ని ఇస్తుంది. కానీ, సుప్రీం కోర్టు గతంలో చెప్పినట్లు మొత్తం రిజర్వేషన్లు 50 శాతాన్ని మించకూడదన్న నిబంధనను గవర్నర్ పరిగణనలోకి తీసుకుంటారేమో అన్న అనుమానాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అటార్నీ జనరల్ ఎటువంటి సలహా ఇస్తారు, దానిపై రాష్ట్ర గవర్నర్ ఏ నిర్ణయం తీసుకుంటున్నారనేదానిపై ఉత్కంఠభరితంగా ఎదురు చూస్తున్నారు.

# 1.93 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను ఆగస్టు కేటాయింపులతో సరఫరా చేయండి

### కేంద్ర ఎరువుల శాఖ మంత్రికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 26:** కేంద్ర ప్రభుత్వం ఎరువులు వచ్చే నెలవారీ కేటాయింపులతో పాటు ఇప్పటి దాకా ఏర్పడిన 1.93లక్షల మెట్రిక్ టన్నుల లోటు ఎరువులను ఆగస్టు కేటాయింపులతో కలిపి సరఫరా చేయాలని కేంద్ర ఎరువుల శాఖ మంత్రి జెపి నడ్డాకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. రెండు రోజుల కితం జాయింట్ సెక్రటరీ శివశంకర్ కేంద్ర ఎరువుల శాఖ అధికారులను కల్సి, రాష్ట్రానికి రావాల్సిన ఎరువులను త్వరితగతిన పంపించాల్సిందిగా కోరారు. వచ్చే మాసంలో రాష్ట్రానికి కేటాయింపులు, రాష్ట్ర అవసరాల మేరకు పంపిణీ చేస్తామని కేంద్ర ప్రభుత్వ అధికారులు హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా ఇప్పటికే 4.73 లక్షల మెట్రిక్టన్నులు యూరియాను రైతులు కొనుగోలు చేశారని, వచ్చే ఆగస్టులో యూరియా వాడకం ఎక్కువగా ఉంటుందని, తగిన చర్యలు చేపట్టాలని అదికారులకు సూచించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలతో సమావేశమై, వారి అవసరాలను పరిశీలించి ఎరువుల సరఫరాకు సంబంధించిన వార్షిక కేటాయింపులు చేసేందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పేర్కొన్నారు. శనివారం ఎరువుల సరఫరాపై సచివాలయంలో వ్యవసాయశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఖరీఫ్ సీజన్ కు రాష్ట్రానికి 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించింది.

ఏప్రిల్ నుంచి జూన్ వరకు 5.00 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాలని కేంద్రం ప్రణాళిక చేసి కేవలం 3.07 మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేసిందన్నారు. దీంతో 1.93 మెట్రిక్టన్నుల యూరియా లోటు ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సరఫరా పెంచాలని డిమాండ్ చేస్తూ, మే నెలలో రెండు సార్లు, జూన్ నెలలో రెండు సార్లు, జులైలో ఒకసారి లేఖల ద్వారా విజ్ఞప్తి చేశామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కూడా కేంద్ర రసాయన ఎరువుల మంత్రిని కలిసి ప్రత్యేకంగా వినతిపత్రం సమర్పించారు. అయినప్పటికి కేంద్ర ఎరువుల శాఖ ఎరువుల సరఫరాలో జాప్యం చేస్తుందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎక్కడా కూడా యూరియా ఎం.ఆర్.పి కంటే అధిక ధరలకు అమ్మకుండా పటిష్ట చర్యలను ఆయా జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యములో చేపట్టడం జరిగిందని డైరెక్టర్ గోపి తెలిపారు.

వివిధ ఎరువుల కంపెనీల డీలర్లను ఏ ప్రొడక్టు లింకులు పెట్టకుండా విక్రయించేటందుకు వీలుగా కంపెనీ ప్రతినిధులను ఆదేశించాల్సిందిగా, అదేసమయంలో ఏ డీలరు కూడా లింక్ పెట్టి అమ్మితే చర్యలు తీసుకోవాల్సిందిగా మంత్రి తుమ్మల ఆదేశించారు.

# మహిళా మావోయిస్టు అరెస్టు

**హైదరాబాద్, జూలై 26, ప్రభాతవార్త:** సంగారెడ్డి పోలీసులు మహిళా మావోయిస్టును అరెస్టు చేశారు. నగర శివార్లలోని మియాపూర్‌లో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ, మావోయిస్టు విద్య శాఖ కమిటీ సభ్యురాలుగా వున్న నార్ల శ్రీవిద్య అలియాస్ రూప (49) మూడు రోజుల క్రితం ఆసుపత్రి నుంచి కనిపించకుండా పోయిందని, ఆమెను సాయుధులు అపహరించారని కుటుంబ సభ్యులు,మాన వ హక్కుల సంఘాల నేతలు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై మియా పూర్ పోలీసులు విచారణ చేస్తుండగానే సంగారెడ్డి జిల్లా పోలీసు లు విద్యను తాము అరెస్టు చేసినట్లు మీడియాకు తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఆమెపై పలు కేసులు వున్నాయని, సైబరాబాద్, రాచకొండలో నూ ఆమెపై అనేక కేసులున్నాయని జిల్లా పోలీసులు తెలిపారు. విద్యను కంది సబ్ జైలుకు రిమాండుకు తరలించారు. కాగా అనారోగ్యంతో బాధప డుతున్న విద్యకు వైద్య సేవలు అందించాలని మానవ హక్కుల సంఘాల నేతలు పోలీసులను కోరారు. నాగర్‌కర్నూలు జిల్లా పెద్ద కొత్తపల్లి మండల ం తిరుమాలపురం గ్రామానికి చెందిన విద్య హైదరాబాద్‌లోని జెఎన్‌టియులో బిటెక్ వరకు చదివారు. ఆమె తండ్రి విశ్రాంత ఉపాధ్యాయుడు. ఆమె సోదరుడు నార్ల రవి శర్మ, సోదరి నార్ల శ్రీదేవి కూడా మావోయిస్టులు కావడం గమనార్హం. ఇందులో రవి శర్మ 2009లో అరెస్టయ్యాడు. 1999 సె ప్టెంబర్‌లో నగరంలోని సంజీవరెడ్డి నగర్‌లో ఐపిఎస్ అధికారి ఉమేష్ చంద్ర కాల్చివేత, 2003లో ఎపిలోని అలిపిరిలో ఉమ్మడి ఎపి సిఎం చంద్ర బాబు నాయుడుపై జరిగిన దాడిలోనూ శ్రీవిద్య పాల్గొన్నారు. 2006 నుంచి ఆమె అజ్ఞాతంలో వున్నారు.

# పర్యావరణ మార్పులు, చీడ పీడలకు చెక్

### ఉద్యాన వర్సిటీ వైస్‌ఛాన్సలర్ రాజిరెడ్డి

**హైదరాబాద్, జూలై 26, ప్రభాతవార్త:** పర్యావరణ మార్పులు తట్టుకొని చీడపీడలను ఎదుర్కొనే కూరగాయల విత్తనాలను త్వరలోనే తెలంగాణలోని రైతులకు అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఉద్యాన వర్సిటీ వీసీ డాక్టర్ దండ రాజిరెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ ఉద్యాన విశ్వ విద్యాలయం కళాశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో ఉద్యాన రైతులకు నాణ్యమైన విత్తనాన్ని అందించడం జరుగుతుందన్నారు. తద్వారా అధిక దిగుబడులు, లాభాలు ఆర్జించేందుకు విశ్వవిద్యాలయం సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. కూరగాయ పంటల్లో సూటి (నాటు), హైబ్రిడ్ రకాల నాణ్యమైన విత్తనం ఖర్చుతో కూడుకున్నదని, అందుకే నాణ్యమైన ఉత్పత్తి లక్ష్యంగా విత్తన, ప్రభుత్వ సంస్థలు ముందుకుసాగాలని ఆయన కోరారు.

# 'మిరాయ్' ఫస్ట్ సింగిల్

హనుమాన్ సంచలన విజయంతో దేశవ్యాప్తంగా క్రేజ్ సంపాదించుకున్న సూపర్ హీరో తేజ సజ్జా, ఇప్పుడు కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించిన మోస్ట్ అవైటెడ్ మూవీ మిరాయ్‌లో సూపర్ యోధగా అలరించనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రం గ్లింప్స్, టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. మొదటి సింగిల్ వైబ్ ఉంది ప్రోమో సంచలనం సృష్టించింది. ఉత్సాహాన్ని రేకెత్తించింది. ఇప్పుడు, టీం సాంగ్ పూర్తి లిరికల్ వీడియోను విడుదల చేసింది. వైబ్



ఉంది తుఫానులా మిమ్మల్ని తాకే మ్యూజికల్ వైబ్, పవర్ ఫుల్ కంపో జిషన్‌తో సాంగ్ అదిరి పోయింది. ఈ ట్రాక్‌లో అకార్డియన్లు, సాక్సోఫోన్లు, పవర్ ఫుల్ డ్రమ్స్ హైఆక్టేన్ ఎనర్జీని క్రియేట్ చేశాయి. కృష్ణకాంత్ లిరిక్స్ తెలుగు, ఇంగ్లీషులను నేచురల్‌గా బ్లెండ్ చేసి హీరో ఎమోషన్‌ని, హీరోయిన్ అందాన్ని అద్భుతంగా హైలైట్ చేశాయి. తేజా సజ్జా ప్రతి ఫ్రేమ్‌లో ఎనర్జీ, ఛార్మ్, డాన్స్ స్టెప్స్‌తో అదరగొట్టాడు. డ్యాన్స్ మూమెంట్స్‌లో అతని గ్రేస్ మెస్మరైజ్ చేసింది. అర్మాన్ మాలిక్ మాజిక్ వోకల్స్‌తో ఆకట్టుకున్నాడు. సాఫ్ట్‌గా, అలాగే హై బీట్‌కి తగ్గట్టే పవర్ఫుల్‌గా పాడాడు. విజువల్‌గా పాట నెక్స్ట్ లెవల్‌లో వుంది. అర్బన్ సెట్టింగ్‌లో, స్టైలిష్ షాట్స్, లైటింగ్, డిజైన్ చూస్తుంటే అద్భుతం అనిపించింది. తేజరితికా నాయక్ కెమిస్ట్రీ, డాన్స్ మూమెంట్స్ అలరించారు. తేజ స్టైల్ గ్రేస్ టాప్ గేర్‌లో ఉంది. రుతికా గ్లామరస్‌గా కిల్లింగ్ లుక్‌లో మెరిసిపోతుంది. మొత్తానికి ట్రెండీ టచ్‌తో పాటు చిన్న క్లాసికల్ హింట్స్‌తో వైబ్ ఉంది పాట మాస్‌ని, క్లాస్‌ని రెండిటినీ కనెక్ట్ చేస్తోంది. వైబ్ ఉంది అన్ని మ్యూజిక్ చార్ట్స్‌తో టాప్‌లో ఉండబోతోంది. మనోజ్ మంచు ఈ సినిమాలో పవర్ ఫుల్ విలన్‌గా కనిపించ బోతున్నారు.

# సెప్టెంబర్ నుంచి 'స్పిరిట్' షూటింగ్



వరుస పాన్‌ఇండియా హిట్స్ అందించిన తర్వాత రెబల్ స్టార్ ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తన తదుపరి ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ స్పిరిట్‌లోకి ఎంటరవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. హైఆక్టేన్ పాన్‌వరల్డ్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం సంచలనం క్రియేట్ చేసే పవర్ ఫుల్ కొలాబరేషన్‌ని చూస్తోంది. ఈ చిత్రంలో ప్రభాస్‌కు జోడిగా త్రిప్తి ద్రిమి కనిపించనుంది. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహించిన యానిమల్‌లో తన అద్భుతమైన నటనతో పేరుతెచ్చుకున్న త్రిప్తి ఫస్ట్ టైమ్ ప్రభాస్ సరసన హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ సెప్టెంబర్ చివరి నుండి ప్రారంభం కానుందని టీం అధికారికంగా తెలియజేసింది. ఇది గ్రాండ్ సినిమాటిక్ జర్నీకి ప్రారంభాన్ని సూచిస్తుంది. స్పిరిట్ గ్లోబల్ మూవీగా రూపొందుతోంది. దీనిని తొమ్మిది భాషలలో విడుదల చేయడానికి ప్లాన్స్ సిద్ధం చేస్తున్నారు. ఇంటర్నేషనల్ స్కేల్, యూనివర్సల్ అప్పీల్‌తో ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా అలరించబోతోంది. ప్రణయ్‌రెడ్డివంగా, భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని భద్రకాళి పిక్చర్స్ ప్రొడక్షన్స్, టిసిరీస్ ఫిల్మ్స్ బ్యానర్లపై నిర్మిస్తున్నారు. మ్యాసీవ్ స్కేల్, ఫ్రెష్ లీడ్ పెయిర్, బ్లాక్ బస్టర్ దర్శకుడితో స్పిరిట్ ఇండియన్ సినిమాలో ఒక ల్యాండ్ మార్క్‌గా మారనుంది.

# సాయి కుమార్ బర్త్‌డే స్పెషల్



విలక్షణ నటుడు సాయి కుమార్ పేరు వింటే ఎన్నో అద్భుతమైన డైలాగ్‌లు మన కళ్ల ముందు మెదులు తాయి. హీరోగా, విలన్‌గా, కారెక్టర్ ఆర్టిస్ట్‌గా, డబ్బింగ్ ఆర్టిస్టుగా ఎన్నో అద్భుతమైన చిత్రాలతో దక్షిణాది సినీ ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు. నేడు (జూలై 27) ఆయన 65వ పుట్టిన రోజు. ఇక ఈ ఏడాదితోనే ఆయనకు నటుడిగా 50 ఏళ్లు నిండాయి. ఈ 50ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో గొప్ప చిత్రాలతో మెప్పించిన సాయి కుమార్ ఈ ఏడాది బ్లాక్ బస్టర్ ప్రాజెక్ట్‌లతో బాక్సాఫీస్ వద్ద సందడి చేశారు. ఇలాంటి అద్వితీయ నటుడి పుట్టిన రోజు సందర్భంగా ప్రత్యేక కథనం మీకోసం. 1975 జనవరి 9న దేవుడు చేసిన పెళ్లి చిత్రంతో నటుడిగా అరంగేట్రం చేశారు. ఆ చిత్రం కూడా సంక్రాంతికి విడుదలై అప్పట్లో సంచలనం సృష్టించింది. నటుడిగా 50వ ఏటలోకి అడుగు పెట్టిన సాయి కుమార్ ఈ ఏడాది సంక్రాంతికి వస్తున్నాం అనే చిత్రంలో నటించి మెప్పించారు. ఆ సినిమా ఇండస్ట్రీ హిట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఇక ఇదే ఏడాది సాయి కుమార్ ప్రధాన పాత్రను పోషించిన కోర్ట్ మూవీ కూడా భారీ విజయాన్ని సాధించింది. కొత్త తరం ఆర్టిస్టులు వస్తున్నా, గట్టి పోటీ ఏర్పడినా.. నటుడిగా 50 ఏళ్లు గడిచినా కూడా సాయి కుమార్ ఇప్పటికీ చేతి నిండా ప్రాజెక్టులతో బిజీగా ఉంటూ.. ప్రతీ సినిమాతో ప్రేక్షకుల్ని మెప్పిస్తున్నారు. కుమార్ కేవలం తెలుగు ప్రాజెక్టులతోనే కాకుండా కన్నడ, తమిళ చిత్రాలతోనూ సందడి చేస్తున్నారు.

# 'అతడు' రీ రిలీజ్

సూపర్ స్టార్ మహేష్ బాబు, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వచ్చిన అతడు క్లాసిక్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. అతడు చిత్రం క్రేజ్ ఇప్పటికీ ఎప్పటికీ చెక్కు చెదరకుండా అలానే నిలిచింది. జయభేరి ఆర్ట్స్ బ్యానర్ మీద మురళీ మోహన్ నిర్మించిన ఈ చిత్రాన్ని మహేష్ బాబు పుట్టిన రోజు సందర్భంగా ఆగస్ట్ 9న రీ రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో శనివారం నాడు రీ రిలీజ్ ప్రెస్ మీట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో, మురళీ మోహన్ మాట్లాడుతూ, మా బ్యానర్‌లో 2005 ఆగస్ట్ 10న అతడు సినిమాను రిలీజ్ చేశాం. ఇప్పుడు ఆగస్ట్ 9న మహేష్ బాబు బర్త్ డే సందర్భంగా రీ రిలీజ్ చేస్తున్నాం. టెక్నాలజీ పరంగా అప్ గ్రేడ్ చేసి ఈ మూవీని మళ్లీ విడుదల చేస్తున్నాం. ఈ క్రమంలో మాకు ప్రసాద్ అండ్ టీం సహకరించింది. రైటర్‌గా త్రివిక్రమ్ మంచి సక్సెస్‌లో ఉన్నప్పుడు మా బ్యానర్‌లో దర్శకుడిగా పరిచయం చేసి, ఆయనతో మొదటి సినిమా చేయాలని అనుకున్నాం. ఆ టైంలో కథ చెప్పమని ఆయన్ను పిలిపించాం. స్రవంతి కిషోర్‌కి మాటిచ్చాను.. వారి బ్యానర్‌లో సినిమా చేసిన తరువాత మీ వద్దకు వస్తానని త్రివిక్రమ్ అన్నారు. ఆ తరువాత మా వద్దకు వచ్చి మూడు గంటల పాటుగా ఈ 'అతడు' కథను కళ్లకు కట్టినట్టుగా చెప్పారు. హీరో అంటే సుగుణాభిరాముడు అని అంతా అనుకునేలా పాత చిత్రాలు వస్తుండేవి. కానీ ఇందులో హీరో పాత్ర కాస్త నెగెటివ్ ధోరణిలో ఉంది కదా? అని అంటే.. ఇప్పుడు అదే ట్రెండ్ అని త్రివిక్రమ్ అన్నారు. సరే అని అంతా ఆయన మీదే భారం వేశాం. ఓ ఇంటి సెట్‌ను వేస్తే అందరూ అద్భుతంగా ఉందని మెచ్చుకున్నారు. దాదాపు 90 శాతం సీన్లు అదే సెట్‌లో షూటింగ్ చేశాం. ఆ తరువాత ఆ సెట్‌ను చాలా మంది వాడుకున్నారు. అయితే ఆ తరువాతి కాలంలో ఓఆర్ఆర్ రావడంతో ఆ సెట్ వెళ్లిపోయింది. లేదంటే అక్కడే ఓ స్టూడియో కూడా కట్టేవాళ్లం. అతడు మూవీ కోసం మహేష్ బాబు చాలా సహకరించారు. ఎంత ఆలస్యమైనా సరే, ఎన్ని డేట్లు అయినా సరే మహేష్ బాబు ఇచ్చారు. క్లైమాక్స్ ఫైట్ కోసం చాలా కష్టపడ్డారు. సినిమాకు చాలా మంచి పేరు వచ్చింది. బుల్లితెరపై అతడు కొత్త చరిత్రను సృష్టించింది. ఈ చిత్రం మా సంస్థకు మంచి గౌరవాన్ని తీసుకు వచ్చింది. నా సోదరుడు కిషోర్ తనయ ప్రియాంక ఈ మూవీని టెక్నికల్‌గా అప్ గ్రేడ్ చేసి అందరి ముందుకు తీసుకు వస్తున్నారు. ఇక ముందు ప్రియాంక ఆధ్వర్యంలో జయ భేరి ఆర్ట్స్ నుంచి సినిమాలు వస్తూనే ఉంటాయి. థియేట్రికల్ పరంగా మేం అనుకున్నంత రేంజ్‌లో ఆడలేదు. కానీ బుల్లితెరపై మాత్రం రికార్డులు క్రియేట్ చేసింది. ఈ మూవీ కోసం వేసిన సెట్‌ను ఇతర ప్రొడక్షన్ కంపెనీలు కూడా వాడుకున్నాయి. వాటి ద్వారా కూడా చాలా డబ్బులు వచ్చాయి. కమర్షియల్‌గా అతడు పట్ల మేం సంతృప్తిగానే ఉన్నాం. మేం తీసిన అన్ని చిత్రాలు ఒకెత్తు.. అతడు ఇంకో ఎత్తు. అప్పటికే అధునాతన సాంకేతికతో అతడు మూవీని తీశాం. అద్భుతమైన డైలాగ్స్‌తో త్రివిక్రమ్ అందరినీ మెప్పించారు. అందుకే త్రివిక్రమ్ మాటల మాంత్రికుడు అయ్యారు. నాకు ఈ చిత్రంలో త్రివిక్రమ్ వేషం ఇవ్వలేదు. నాకు వేషం ఇవ్వండి అని ఎవ్వరినీ అడగొద్దు అంటూ మా ఆవిడ నాకొక కండీషన్ పెట్టారు. అందుకే ఇంత వరకు ఎవ్వరినీ నేను వేషం అడగలేదు. మహేష్ బాబు, త్రివిక్రమ్ డేట్లు ఇస్తే అతడు సీక్వెల్‌ను మా బ్యానర్ నిర్మిస్తుంది. అతడు మూవీకి మొదట్లో డివైడ్ టాక్ వచ్చింది. కానీ బుల్లితెరపై వచ్చాక అతడు గొప్పదనాన్ని అందరూ తెలుసుకున్నారు. అందుకే ఈ రీ రిలీజ్‌కు ఇంత క్రేజ్ ఏర్పడింది. ఒకప్పుడు థియేటర్లో మాత్రమే సినిమాలు చూస్తుండేవారు. ఆ తరువాత టీవీలు వచ్చాయి.





ప్రియాంక జవాల్కర్ నయా లుక్

# కార్తి ఖైదీ 2.. టార్గెట్ ఫిక్స్..!

ఖైదీలో సూర్య రోలెక్స్ రోల్ ఉంటుందన్న టాక్ వినిపిస్తుంది. విక్రం సినిమాలో చివర్లో సూర్య రోలెక్స్ రోల్ అదరగొట్టాడు. సినిమా మొత్తం ఒక లెక్క చివర రోలెక్స్ రోల్ వచ్చి చేసిన హంగామా ఒక లెక్క అనిపించింది. కార్తి ఖైదీ2లో ఢిల్లీతో పాటు రోలెక్స్ పాత్ర కూడా ఉంటే మాత్రం సినిమా రేంజ్ వేరే లెవెల్ అని చెప్పొచ్చు. కార్తి ఖైదీ 2 కోసం రఫ్ లుక్‌తో కనిపిస్తాడట. ఆగష్టులో కూలీ సినిమా రిలీజ్ అవ్వడమే ఆలస్యం. లోకేష్ ఖైదీ 2ని సెట్స్ మీదకు తీసుకెళ్తాడని తెలుస్తుంది. ఖైదీ 2ని పర్ఫెక్ట్ ప్లానింగ్‌తో అంతా సెటప్ చేస్తున్నారట. సినిమాలో కార్తి క్యారెక్టరైజేషన్ ఆడియన్స్‌ని సర్ ప్రైజ్ చేస్తుందని టాక్. ఖైదీ2 కథ కూడా బాగా వచ్చిందని తెలుస్తుంది. ఐతే అక్టోబర్‌లో సెట్స్ మీదకు వెళ్లబోతున్న ఖైదీ 2ని నెక్స్ట్ ఇయర్ అంటే 2026 సెకండ్ హాఫ్ మళ్లీ దసరా, దీపావళికి రిలీజ్ చేసేలా ప్లానింగ్ ఉందట. ఖైదీ 2లో ఇంకా సర్ ప్రైజింగ్ రోల్స్ కూడా లోకేష్ సినిమాటిక్ యూనివర్స్ క్రేజ్‌ని మరింత పెంచే ప్రయత్నం చేస్తాయని అంటున్నారు. కార్తి మాత్రం ఎప్పుడెప్పుడు ఖైదీ 2 సెట్స్‌లో జాయిన్ అవ్వాలా అన్న ఆసక్తితో ఉన్నాడు. కార్తి ఖైదీ 2 తప్పకుండా అంచనాలకు తగినట్టుగానే ఉండే ఛాన్స్ కనిపిస్తుంది. కార్తి సర్దార్ 2, వాతియా, మార్షల్ సినిమాలు లైన్‌లో ఉన్నాయి. వీటితో పాటు తెలుగులో హిట్ 4కి కూడా సైన్ చేశాడని తెలుస్తుంది. ఐతే వీటిలో ఖైదీ 2 మీద మాత్రం భారీ హైప్ ఉందని తెలిసిందే.



# బుచ్చిబాబుతో జాన్వీ ఫోటో వైరల్

బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా మంచి పేరు తెచ్చుకున్న శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ ఇప్పుడు తెలుగు సినిమాల మీద పూర్తిగా ఫోకస్ పెట్టింది. మొదటి సినిమానే ఎన్టీఆర్‌తో దేవర, ఆ తర్వాత రెండో సినిమాగా రామ్ చరణ్ పెద్ది మూవీతో ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఇలా టాలీవుడ్‌లో వరుసగా అవకాశాలు అందుకుంటూ సౌత్ ఆడియన్స్‌కి కూడా దగ్గరైపోతుంది. జాన్వీ గ్లామర్‌తో పాటు తన కొత్త లుక్స్‌తో యూత్‌ను ఆకట్టుకుంటోంది. ఇప్పుడు హైదరాబాద్‌లో పెద్ది సినిమాకు సంబంధించిన పాట చిత్రీకరణ కోసం జాన్వీ కపూర్ టీమ్‌తో కలిసి ఉందని వార్తలు వస్తున్నాయి. ఇటీవలే దర్శకుడు బుచ్చిబాబు సనా, జాన్వీ కపూర్‌తో కలిసి ఉన్న ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఫోటోలో జాన్వీ సింపుల్ పింక్ జాకెట్, బ్లాక్ జీన్స్‌లో కనిపించింది. సింపుల్ గ్లామర్ లుక్‌లో కూడా ఎంత క్యూట్‌గా, ఎట్రాక్టివ్‌గా ఉందనే కామెంట్లు వెల్లువెత్తుతున్నాయి.



దర్శకుడు బుచ్చిబాబుతో కలిసి సినిమా థియేటర్‌లో కనిపించడంతో, ఏ సినిమా చూసారోనని ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ ఫోటో క్లిక్ అయిన ప్రదేశం హైదరాబాద్లోని ఏఎంబీ సినిమాస్. జాన్వీ, బుచ్చిబాబు అక్కడ కనిపించడం విశేషం. అయితే ఆ సమయంలో థియేటర్లో ఏ సినిమా ప్రివ్యూకు వెళ్లారో స్పష్టత లేదు. కొందరు ఫ్యాన్స్ మాత్రం హరి హర వీరమల్లు చూసారని అంటుండగా, మరికొందరు వేరే మూవీ అని అభిప్రాయపడుతున్నారు. ఏదైనా జాన్వీ కపూర్ క్యాజువల్ లుక్‌లో కనిపించడం మోడ్రన్ యూత్‌ను ఎంతగానో ఆకర్షించింది. ఇప్పుడు పెద్ది సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంటోంది. ముఖ్యంగా కీలక సాంగ్ షూట్‌ను గ్రాండ్‌గా ప్లాన్ చేస్తున్నారు. సారీ చెప్పాల్సిందే.. లేకుంటే కింగ్డమ్‌ను అడ్డుకుంటాం రామ్ చరణ్, జాన్వీ కపూర్ జోడీగా కనిపించనుండటంతో, ఈ కాంబోలో వస్తున్న సినిమాపై ఇప్పటికే భారీ బజ్ ఏర్పడింది. మ్యూజిక్ డైరెక్టర్ ఏఆర్ రెహ్మాన్ సంగీతం అందిస్తుండటంతో పాటలకు ప్రత్యేక ఆకర్షణ ఏర్పడుతోంది. దివ్యేండూ శర్మ, శివ రాజ్ కుమార్, జగపతిబాబు వంటి ప్రముఖులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. పెద్ది సినిమాపై మేకర్స్ కూడా భారీ ఆశలు పెట్టుకున్నారు. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌తో రూరల్ మాస్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే అంచనాలు పెరిగిపోయాయి. జాన్వీ కపూర్ తక్కువ కాలంలోనే తెలుగులో రెండు బిగ్ ప్రాజెక్ట్స్ పట్టేసింది. పైగా ఇప్పుడు పారితోషికం కూడా ఒక్కో చిత్రానికి పెంచేస్తుండటంతో ఇండస్ట్రీలో బజ్‌కు కారణమవుతోంది. మరి అమ్మడి సెకండ్ మూవీ ఏ స్థాయిలో సక్సెస్ అవుతుందో చూడాలి.

# కింగ్ డమ్..హీరోయిన్ లవ్లీ డెడికేషన్

జెర్సీ ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌పై విడుదలకు ముందే భారీ బజ్ నెలకొంది. టీజర్, పాటలు, ప్రమోషన్లతో సినిమాకు మంచి హైప్ వచ్చింది. ఇందులో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తుండగా, ఆమె పాత్ర గురించి ప్రత్యేకంగా చర్చ జరుగుతోంది. రీసెంట్‌గా చిత్ర బృందం ప్రమోషన్‌లో మరింత ఊపునిచ్చేలా ప్లాన్స్ స్టార్ట్ చేసింది. ఇక మరోవైపు భాగ్యశ్రీ బోర్సే చేసిన పని సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సినిమా త్వరలోనే విడుదల కానుండటంతో, భాగ్యశ్రీ తన పాత్రకు సంబంధించిన డబ్బింగ్ పూర్తి చేసింది. ఈ విషయాన్ని తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ద్వారా షేర్ చేయగా, అభిమానులు ఎంతో ఎగ్జైట్ అయ్యారు. గర్ల్‌ఫ్రెండ్ నధివే.. రష్మిక మాయతో నెంబర్ వన్ ట్రెండింగ్ కేవలం నటనలోనే కాదు, తనే సొంతంగా డబ్బింగ్ చెప్పడం ద్వారా భాగ్యశ్రీ తన పాత్ర పట్ల ప్రేమను చూపించింది. చాలా మంది నాయికలు భాషా పరంగా ఇబ్బంది పడుతూ డబ్బింగ్ ఆర్టిస్టులను ఉపయోగిస్తుంటారు. కానీ భాగ్యశ్రీ మాత్రం పూర్తి తెలుగు డైలాగ్స్‌కి స్వయంగా డబ్బింగ్ చెప్పడం స్పెషల్ హైలైట్ అయింది. కొత్త హీరోయిన్‌గా ఇండస్ట్రీకి వచ్చి, ఇంత డెడికేషన్ చూపించడంపై సినీ జనాల్లో కూడా ప్రశంసలు వినిపిస్తున్నాయి. నటనతో పాటు డైలాగ్స్‌లో ఎమోషన్‌ను అద్భుతంగా ప్రెజెంట్ చేయడమే కాకుండా, తెలుగు డైలాగ్స్‌ను కూడా కంటెంట్‌కు తగ్గట్టుగా చెప్పినట్లు తెలుస్తోంది. భగ్యశ్రీ మాట్లాడుతూ, ఒక సినిమాకు డబ్బింగ్ అనేది కేవలం లైన్స్ చెప్పడం కాదు. ప్రతి మాటలో భావాన్ని చూపించడం ముఖ్యం. తెలుగు భాషలో సొంతంగా వాయిస్ ఇవ్వడం నా లక్ష్యం. పాత్రలో జీవం పోసే అవకాశం డబ్బింగ్‌తో వచ్చింది అని తెలిపింది. ఆమె మాటల్లోనూ, ప్రయత్నంలోనూ తెలుగు పట్ల ఉన్న ప్రేమ స్పష్టంగా కనిపిస్తోంది. ప్రాణ ముప్పు ఉందంటున్న అలనాటి స్టార్ హీరోయిన్ ఈ డెడికేషన్ వల్ల కింగ్‌డమ్ సినిమాపై అంచనాలు మరింత పెరిగిపోయాయి. ప్రేక్షకులు భగ్యశ్రీ నటనతో పాటు ఆమె వాయిస్‌వినడానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సినిమా విడుదల తర్వాత ఆమెకు టాలీవుడ్‌లో మరిన్ని అవకాశాలు రావొచ్చన్న అభిప్రాయం ఫిలిం వర్గాల్లో వ్యక్తమవుతోంది. ముఖ్యంగా ఓ నార్త్ ఇండియన్ హీరోయిన్ తెలుగులో ఇంత ప్రాముఖ్యత ఇవ్వడాన్ని సినీ ప్రియులు ప్రశంసించారు. కింగ్‌డమ్‌లో భగ్యశ్రీ బోర్సే ప్రదర్శన ఎలా ఉండబోతోందో తెలుసుకోవాలంటే ఇంకొన్ని రోజులు వేచిచూడాల్సిందే.



# రాజాసాబ్‌తో 'నిధి'కి మళ్లీ క్రేజ్!

ప్రస్తుతం వెండితెర మీద సందడి చేస్తున్న హరి హర వీరమల్లు సినిమాతో నిధి మళ్లీ టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. నాలుగేళ్ల క్రితం చేసిన సినిమా ఎప్పుడో తన పోర్షన్ పూర్తైనా కూడా రిలీజ్ టైంలో నిధి ఆ సినిమాకు అందించిన కోపరేషన్ గురించి ఎంత చెప్పినా తక్కువే. అందుకే వీరమల్లు రిలీజ్ ఈవెంట్‌లో పవన్ కళ్యాణ్ కూడా నిధి గురించి చాలా బాగా మాట్లాడారు. ఆమె సింగిల్ హ్యాండ్‌గా ప్రమోట్ చేసింది ఆమెను చూసి నేను కూడా ప్రమోషన్స్‌లోకి దిగా అన్నారు. మండలా మర్డర్స్ టాక్ ఏంటి..? సినిమా పట్ల నిధికి ఉన్న కమిట్మెంట్ చూసి అందరు సూపర్ అనేస్తున్నారు. ఐతే వీరమల్లు సినిమాతో నిధి మంచి పాపులారిటీ సంపాధించింది. ఇది రాబోతున్న ప్రభాస్ రాజా సాబ్‌కి కచ్చితంగా కలిసి వచ్చే అంశమే. ప్రభాస్ రాజా సాబ్‌లో మాళవిక మోహనన్, నిధి అగర్వాల్ ఇద్దరు హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. నిధి అగర్వాల్ వీరమల్లుతో టాలీవుడ్‌లో మంచి క్రేజ్ సంపాధించింది. అమ్మడి కెరీర్‌లోకి ఒకసారి తొంగి చూస్తే మిస్టర్ మజ్ను, సవ్యసాచి సినిమాలు చేసినా క్రేజ్ రాలేదు. ఆ సినిమాల ఫలితాలు నిరాశపరిచాయి. ఐతే పూరీ జగన్నాథ్‌తో చేసిన ఇస్మార్ట్ శంకర్‌తో కమర్షియల్ సక్సెస్ అందుకుంది నిధి అగర్వాల్. ఆ సినిమా ఇచ్చిన బూస్టింగ్ తో వరుస సినిమాలు చేస్తుంది అనుకుంటే గల్లా అశోక్‌తో హీరో సినిమా చేసి ఆ తర్వాత కోలీవుడ్ షిఫ్ట్ అయ్యింది. అక్కడ మంచి పాపులారిటీ తెచ్చుకున్నా ఎందుకో మళ్లీ అమ్మడికి ఛాన్సులు రాలేదు. ఐతే వీరమల్లు సినిమాపై చాలా హోప్స్ పెట్టుకున్న నిధి కరెక్ట్ టైంలో మంచి ప్రమోషన్ సపోర్ట్ చేసింది. పవర్ స్టార్ ఫ్యాన్స్ అయితే నిధి అగర్వాల్‌ని బాగా ఎంకరేజ్ చేస్తున్నారు. ఐతే వీరమల్లుకి చేసినట్టుగానే నిధి అగర్వాల్ రాజా సాబ్‌కి డ్యూటీ చేస్తే మాత్రం తప్పకుండా అమ్మడికి మరింత క్రేజ్ వస్తుంది. ప్రభాస్ రాజా సాబ్ సినిమాను మారుతి డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ సినిమా ఈ ఇయర్ డిసెంబర్‌లో రిలీజ్ లాక్ చేశారు. థమన్ మ్యూజిక్ అందిస్తున్న ఈ సినిమా టీజర్‌తోనే సంథింగ్ స్పెషల్ అనిపిం చారు. మరి రాజా సాబ్ నిధి క్రేజ్ కొనసాగిం చేలా చేస్తుందా లేదా అన్నది చూడాలి. వీరమల్లు క్రేజ్‌తోనే నిధికి ఒకటి రెండు ఆఫర్లు వచ్చే ఊపు కనబడుతుంది. ఇక రాజా సాబ్ కూడా వస్తే కచ్చితంగా టాలీవుడ్‌లో మళ్లీ నిధి హవా మొదలయ్యే ఛాన్స్ ఉంది.



# మొదటి సర్టిఫైడ్ చాక్లెట్ టేస్టర్

**చాక్లెట్ రుచి ఎలా ఉంటుంది అంటే, 'తియ్యగా'... అనేస్తాం మనం. కానీ, పూనమ్ చోరియాను అడిగితే దాని అసలు రుచింటో చూడండి, నాణ్యత ఏంటో ఇట్టే చెప్పేస్తారు. అదెలా అంటారా? మనదేశంలోనే మొట్టమొదటి సర్టిఫైడ్ చాక్లెట్ టేస్టర్ ఈవిడే మరి. తను కథ ఏంటో, ఈ భిన్నవృత్తిని ఎలా ఎంచుకోవాలో తెలుసుకుందామా!**




చెన్నైలో పుట్టిన పూనమ్ చోర్డియాకు చిన్నప్పటి నుంచీ చాక్లెట్లంటే చాలా ఇష్టం. కళ్లు మూసుకు కూడా ఏ బ్రాండ్ ఏంటో చెప్పేసేది. ఆ నైపుణ్యాన్ని కుటుంబ సభ్యులు సరదాగా చూసేవారట. కానీ, పూనమ్ మాత్రం దాన్ని సీరియస్‌గా తీసుకుని కెరియర్‌ని నిర్మించుకోవాలనుకుంది. చదువయ్యాక నితిన్ చోర్డియాతో వివాహమైంది. ఆపై ఇద్దరూ కలిసి యూరప్ వెళ్లారు. ఇద్దరికీ స్వతహాగా చాక్లెట్ల మీద ఉన్న ఇష్టంతో దాని గురించి మరింతగా తెలుసుకోవడం మొదలుపెట్టారు. స్విట్జర్లాండ్, బెల్జియం వంటి దేశాల్లో ఉన్న బీన్ టు బార్ చాక్లెట్ టెక్నాలజీతో పాటు వాటి రుచి, టెక్స్చర్ స్థానంలో పూనమ్ని బాగా ఆకర్షించింది. దాంతో చాక్లెట్ తయారీని వ్యాపారంగా ఎంచుకోవాలను కున్నారు. ఇందులో భాగంగానే యూకే ఇంటర్నేషనల్ ఇన్ డిగ్రీ ఆఫ్ చాక్లెట్ అండ్ కోకో టెస్టింగ్‌లో చేరారు. అక్కడ కోర్సు పూర్తి చేసి భారతదేశపు మొట్టమొదటి మహిళా సర్టిఫైడ్ చాక్లెట్ టేస్టర్గా గుర్తింపు పొందారు. లాగని వాటి రుచి చూడటం మాత్రమే కాదు... నాణ్యమైన ముడిసరకు సేకరించడం, చాక్లెట్ తయారుచేయడం, అత్యుత్తమ ఎంపిక చేయడం, ప్రిజర్వేషన్, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్... ఇలా వివిధ దశల్లో టేస్టర్ పూనమ్ పనిచేస్తున్నారు.

**సొంత బ్రాండ్..** మనదేశంలో చాక్లెట్ డిమాండ్‌కి తగినట్లు తయారీ లేకపోవడం గమనించాక 2015లో చెన్నైలో 'కోకోశాల' పేరుతో శిక్షణ సంస్థను స్థాపించారు. ఇది ఆసియాలోనే తొలి బీన్ టూ బార్ చాక్లెట్ స్కూల్. ఇక్కడ చిన్న వ్యాపారులు, హోమ్ బేకర్లు, ఫుడ్ టెక్నాలజీ విద్యార్థులకు చాక్లెట్ తయారీ టెస్టింగ్, సెన్సరీ అనాలిసిస్ వంటి శిక్షణలు అందిస్తున్నారు. ఇప్పటి వరకూ వేలమందికి శిక్షణ ఇచ్చారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయుల్లో అనేక వర్క్‌షాప్‌లు ఉన్నాయి. హ్యాండ్‌మేడ్ చాక్లెట్... పూనమ్ తన సొంత బ్రాండ్ ఎన్మాంటే చాక్లెట్స్ ద్వారా హ్యాండ్‌మ్యాడ్ క్రియేటివ్ చాక్లెట్స్‌ని రూపొందించడం. కాఫీ ఇన్ఫ్యూజ్ చాక్లెట్లు, ఫ్లోరల్, ఫ్రూటీ నోట్స్, తేనె, దాల్చిన చెక్క.... వంటి పదార్థాలతో తయారుచేసిన ప్రత్యేకమైనవి ఎన్నో ఉన్నాయి. వీటికి విదేశాల్లోనూ డిమాండ్ ఉంది. ఆపై భర్తతో కలిసి పర్యావరణహిత చాక్లెట్ కోక్టెట్ బ్రాండ్ తీసుకొచ్చారు. ఇది ప్రపంచంలోనే మొట్టమొదటి జీరోవేస్ట్ బీన్ టు బార్ చాక్లెట్ బ్రాండ్. ప్యాకేజింగ్ కోసం కోకో ఫ్యాస్, రీసైకిల్డ్ కాటన్ ఉంచబడింది. □

# సింగిల్ మేక్ రేసింగ్ ఛాంపియన్ షిప్‌ను నెలకొల్పింది..



**ప్రశాంతత, నిదానం సంగీత సాధకుల లక్షణం, దూకుడు, వేగం రేసర్ల స్వభావం. ఈ రెండింటిలోనే ఉండటం అరుదే. అలాంటి అమ్మాయే 21 ఏళ్ల స్రవంతికా లక్ష్మి... స్వయంగా రేసర్ కావడమే కాదు, 'రెవిటాప్ కప్' పేరుతో సింగిల్ మేక్ రేసింగ్ ఛాంపియన్ షిప్‌ను నెలకొల్పిన యువ రేవర్లవీ ప్రోత్సహిస్తోంది. ఈమెది కోయంబత్తూరు. తండ్రి శ్యామ్ కుమార్, తల్లి సంగీత, ఐదేళ్ల వయసు నుంచే సంగీతాన్ని అభ్యసించింది.**

ఏడెనిమిదేళ్ల క్రితం వరకూ సంగీతమే ఆమె ప్రపంచం. గాయకుడు ఉన్నికృష్ణన్ అంటే ఎంతో ఇష్టం. ఆయన కచేరీ ఎక్కడున్నా వెళ్లేది. ఆమెలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించింది ఆయనే. అలా చిన్నవయసులోనే కోయంబత్తూరు, చెన్నైలో ఎన్నో కచేరీలు చేసింది. విదేశాల్లోనూ ప్రదర్శనలిచ్చింది. 2017లో ఓసారి హైదరాబాద్ వచ్చిన ఆమెను కార్టింగ్ ట్రాక్ ఆకర్షించింది. అలా మోటార్ స్పోర్ట్స్ పట్ల ఇష్టాన్ని పెంచుకుంది. తండ్రి ప్రోత్సాహంతో ఎస్ఎమ్ఎస్సీఐ (ఫెడరేషన్ ఆఫ్ మోటార్ స్పోర్ట్స్ క్లబ్స్ ఆఫ్ ఇండియా) అధ్యక్షుడైన అక్బర్ ఇబ్రహీం దగ్గర శిక్షణ తీసుకుని, ఏడాది తిరక్కుండానే 2018లో జాతీయ గోకార్టింగ్ పోటీల్లో పాల్గొనండి. 2018లో రోమ్‌లో జరిగిన ప్రపంచ మోటార్ స్పోర్ట్స్ క్రీడల్లో భారతదేశానికి ప్రాధాన్యమిచ్చింది. స్థానిక జాతీయ, అంతర్జాతీయ స్థాయుల్లో అనేక రేసింగ్ స్పోర్ట్స్‌లో పాల్గొని విజేతగానూ నిలిచాడు. లాక్ డౌన్ సమయంలో మోటార్స్పోర్ట్స్ పాల్గొనే మహిళలకి మార్షల్ ఆర్ట్స్ ప్రాణాయామం, ధ్యానం, భావోద్వేగ సమన్వయం... వంటి వాటిలో శిక్షణ ఇచ్చింది. తాజాగా లెవిటాప్ కప్ని నెలకొల్పి మోటార్స్పోర్ట్లో పోటీలను నిర్వహిస్తోంది స్రవంతిక.

ఈ కప్ జేకే నేషనల్ రేసింగ్ ఛాంపియన్‌లో భాగంగా ఉంటుందట.

**పక్కటెముక విరిగినా..** మోటారుస్పోర్ట్స్ అంటేనే ప్రమాదాలతో సహజీవనం. వాటికి భయపడ కూడదు. నేనూ ఎదురుదెబ్బలెన్నో తిన్నా. ఓసారి పక్కటెముకకి గాయమైంది. అలాగే 'రోటాక్స్ నేషనల్ ఛాంపియన్‌షిప్'లో పాల్గొన్న ప్పుడు లక్ష్యం మరో ఐదు అడుగుల దూరంలో ఉండగా నా కారు ఇంజన్ అయిపోయింది. దిగి వెహికల్ని ముందుకు తోసుకెళితే మూడోస్థానంలో వచ్చేదాన్ని. ఆ విషయం నాకు తెలియదు. చీఫ్ స్టీవార్డ్ పక్కనే



ఉన్న నాన్నకు తెలుసుగానీ నియమాల ప్రకారం ఆయన చెప్పలేదు. అలా అనుభవాల నుంచే ఎన్నో నేర్చుకున్నా. మరీ ఒత్తిడిగా ఉన్నప్పుడు పాటలు పాడుకుంటాఖి అంటోంది యువ రేసర్. రేసింగ్ ధనవంతుల క్రీడ అనుకుంటారంతా. కానీ నైపుణ్యాలున్న యువతకి ఉంది అందుకే ఈ లెవిటాస్. దీనికోసం ఒకేలాంటి 18 మారుతి సుజుకి ఇగ్నిస్ రేస్ కార్లు తీసుకున్నాం. ఒక్కో సీజన్‌లో ఎనిమిది రేసులతో ఈ క్యాప్ నిర్వహించ బోతున్నాం. కోయంబత్తూరులోనే కారి మోటార్ స్పీడ్‌వేలో ఈ రేస్‌లు జరుగుతాయి. తయారీ సంస్థ మద్దతు లేకుండా ప్రైవేట్ కంపెనీ ఆధ్వర్యంలో కంపెనీ మేక్ రేసింగ్ నిర్వహించడం దేశంలోనే తొలిసారి. ఇవి రేస్ సిరీస్ మాత్రమే కాదు, లెవల్ కార్టింగ్‌కి అగ్రస్థాయి రేసింగ్ పోటీలకు మధ్య అంతరాన్ని తగ్గించే పోటీ, అలాగే రేసింగ్ డ్రైవర్లుగా, అధికారులుగా మహిళలకు మరిన్ని అవకాశాలు సృష్టించాలన్నదే నా లక్ష్యం అంటోన్న స్రవంతికను చూస్తుంటే భవిష్యత్తు అమ్మాయిలదే అనిపించడం లేదూ! □

# కెరియర్ మారుతున్నారా?

ఇదివరకు అమ్మాయిలు స్థిరత్వం, ఉద్యోగ భద్రత కోరుకునేవారు. కానీ ఇప్పటివాళ్లంతా ఇందుకు భిన్నంగా ఉన్నారు. నచ్చకపోతే ఎంత పెద్ద ఉద్యోగాన్ని వదిలేయడానికి వెనకాడటం లేదు. ఈ ఎదురయ్యే ఒత్తిడిని తట్టుకోవాలంటే.. చదువవ్వగానే ఏదోక పనిలో చేరాలని లక్ష్యంగా పెట్టుకునేవారు గతంలో అమ్మాయిలు. వాళ్ల నైపుణ్యాలకు తగిన రంగం కాకపోయినా ఉద్యోగంలో చేరిపోయేవారు. కానీ విద్యావంతులు ఇప్పటి వరకు జాబ్ దొరికే వరకు ప్రయత్నిస్తు న్నారు.. పైగా వృత్తి, ప్రవృత్తి అంటూ ఏకకాలంలో రెండు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అలానే కోరి, చేరిన ఉద్యోగం నచ్చకపోతే... మానేసి వేరేది చూసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆర్థికంగా, మానసికంగా ఇంకొకరిమీద ఆధారపడుతున్నారు. దాంతో ఒత్తిడీ, ఆందోళన, ప్రతికూల ఆలోచనలు. వీటన్నింటిని అధిగమించాలంటే... చేస్తున్న పని మానేసే ముందు, పక్కగా ఈ అంశాలను దృష్టిలో ఉంచుకోవాలి.



★ ఉద్యోగంలో చేరాక మనం చేసే ప్రతి పని జీవిత పాఠాల్ని నేర్పుతుంది. నచ్చక మానేసినా పాత పనిలో ఎదురైన సమస్యలన్నీ మీకు అనుభవాలే వాట భర్తీ తీసుకుని వేరేదానిలో ఇవేవీ పునరావృతంకాకుండా చూసుకోండి.

★. కొత్త ఉద్యోగం వెతుక్కునే అవసరం మీ రెజ్యూమెది ప్రధానపాత్ర మీ నైపుణ్యాలనీ, గతానుభవాలనీ ప్రస్తావిస్తూ దీన్ని తయారు చేసుకోవాల్సిన బాధ్యత మీదే. చాలామంది రెజ్యూమె, సివి తయారీకి ఆన్‌లైన్ మీద ఆధారపడుతుంటారు దీనివల్ల విషయాలు మిస్ అయిపోతుంటాయి. కొన్ని కంపెనీలైతే... లేని అర్హతల్ని ప్రస్తావిస్తుంటాయి. మీ వృత్తిగత ఉనికికి చేటే మీ రెజ్యూమెను మీరే చేసుకోవడానికి ప్రయత్నించారు.

★. ఇంటర్వ్యూకి వెళ్లేటప్పుడు విషయపరిజ్ఞానం మీద దృష్టి పెట్టండి. కంపెనీ వివరాలు, వృద్ధి, బ్రాంచ్‌ల వంటి విషయాల్ని తెలుసుకుంటే పనిపట్ల మీకున్న ఆసక్తి వాళ్లకు అర్థమవుతుంది. తొందరగా ఉద్యోగమూ దొరుకుతుంది.

★ ముఖ్యంగా ఓ ఆరు నెలల ఉద్యోగం దొరకకపోయినా మీ వ్యక్తిగత ఖర్చుల కోసం ఎవరి మీద ఆధారపడకుండా ఉండేటట్లు సేవింగ్స్ ఉంచుకోండి. □

## ఉల్లిపాయ కదలదిక..



కాపింగ్ బోర్డు మీద చాకుతో ఉల్లి పాయలు, కూరగాయలు కోస్తున్నప్పుడు ఒక్కోసారి ఎగిరి చుట్టుపక్కల చెల్లాచెదురుగా పడుతుంటాయి. అలా కిందపడ్డ వాటిని పారేయడంతో వృథా కూడా ఎక్కు వగానే ఉంటుంది. ఇలాంటి ఇబ్బందులేవీ లేకుండా చేస్తుంది హోల్డర్. దీన్ని ఉల్లిపాయలకు గట్టిగా గుచ్చి పట్టుకోవడంతో ఎటూ కదలకుండా ఉంటాయి. అలాగే నిమ్మకాయలు, కీరాలనూ పలుచగా, చక్రాల్లా కోసుకోవచ్చు కూడా. □

# మరమరాల రుచులు

కొంచెం కారంగా.. కొంచెం పుల్లగా
కాస్త పుల్లగా ఉన్నవి ఏమైనా తింటుంటే భలే ఉంటుంది కదా..
అలాగని వాటిని తయారుచేయడానికి ఎక్కువ సమయం పట్టకుండా
వెంటనే చేసుకోగలగాలి. రుచి మాత్రం అదరిపోవాలి సండే అనుకుంటున్నారా?
అయితే ఓ సారి ఈ మరమరాల రుచులను ప్రయత్నించండి

## స్వీట్ ..

**కావలసినవి:** మరమరాలు రెండు కప్పులు, బెల్లం పొడి కప్పు, కాచి చల్లార్చిన పాలు ఒక గ్లాసు, జీడిపప్పు, పల్లీలు గుప్పెడు చొప్పున, నెయ్యి రెండు టీస్పూన్లు, యాలకుల పొడి చిటికెడు.

తయారీ: వెడల్పాటి పాత్రలో మరమరాలు జీడిపప్పు, పల్లీలను వేయించుకోవాలి, చల్లారిన తర్వాత మిక్సీలో వేసి పిండి చేయాలి. పాలల్లో బెల్లం పొడివేసి కరగనివ్వాలి. తర్వాత మరమరాలు, యాలకుల పొడి వేసి ఉండలు లేకుండా గట్టిగా కలపాలి. ఈ మిశ్రమాన్ని నెయ్యి రాసిన గిన్నెలో వేసుకుని ముక్కలు కోసుకోవాలి. ఈ స్వీటు చేసుకునేటప్పుడు కొంచెం పిండిని పక్కన పెట్టుకుంటే మంచిది. మిశ్రమం పల్చగా అయితే దాన్ని



కలపొచ్చు. పిండి అయితే బాగా పాలు పోసుకోవచ్చు. కొబ్బరి తురుము వేసుకున్నా రుచిగా ఉంటుంది. బెల్లంతోనే కాకుండా పంచదార పొడితోనూ చేసుకోవచ్చు..

## ముంత మసాలా ..

**కావలసినవి:** మరమరాలు రెండు కప్పులు, కార్న్ ఫ్లేక్స్ అరకప్పు, పల్లీలు పావుకప్పు, ఉల్లిపాయ ఒకటి, టొమాటో ఒకటి, పచ్చిమిర్చి రెండు, కొత్తమీర తురుము రెండు టేబుల్ స్పూన్లు, కారం రెండు టీస్పూన్లు, ధనియాల పొడి టీస్పూన్, వేయించిన జీలకర్ర పొడి టీస్పూన్ , చాట్ మసాలా టీస్పూన్, నూనెవేయించడానికి సరిపడా, ఉప్పు తగినంత, నిమ్మరసం టీస్పూన్.



**తయారీ:** ఉల్లిపాయ, టొమాటోలను సన్నగా తరిగి పక్కన పెట్టుకోవాలి. కడాయిలో మరమరాలు వేసి మంటను మధ్యస్థంగా ఉంచి.. రెండు నిమిషాలపాటు వేయించి పక్కన ఉంచాలి. ఇలాచేస్తే మరమరాలు కరకరలాడుతూ ఉంటాయి. కడాయిలో నూనె పోసి వేడిచేసి కార్న్ ఫ్లేక్స్ వేయించి టిష్యూ పేపర్ మీద పెట్టుకోవాలి. బాగా వేడెక్కిన తర్వాత నూనెను వేయించాలి. సరిగ్గా కాకపోతే ఎక్కువ నూనె పీల్చేస్తాయి. ఇప్పుడు పల్లీలు కూడా వేసి వేయించాలి. వేయించి పెట్టుకున్న మరమరాల్లో కార్న్ ఫ్లేక్స్, పల్లీలు, ఉల్లిపాయలు, టొమాటో ముక్కలు కలపాలి. తర్వాత పచ్చిమిర్చి, కొత్తిమీర తరుగు, ధనియాల పొడి, వేయించిన జీలకర్ర పొడి, కారం, ఉప్పు, కొద్దిగా నూనె: వేయించి పెట్టుకున్న పల్లీలు వేయాలి. చివరగా ఉల్లిపాయ ముక్కలు, కొద్దిగా కొత్తిమీర తరుగు వేసి బాగా కలిపి పైన నిమ్మరసం చల్లుకుంటే చాలా బాగుంటుంది.

## దోశ

**కావలసినవి:** మరమరాలు రెండు కప్పులు, బొంబాయి రవ్వ కప్పు, పెరుగు అరకప్పు, బేకింగ్ పౌడర్ అర టీస్పూన్, ఉప్పు రుచికి సరిపడా, నూనె తగినంత.

తయారీ: మరమరలను నీళ్లలో, బొంబాయి రవ్వను పెరుగులో పదినిమిషాల చొప్పున నానబెట్టాలి. తర్వాత మరమరలను ఫిల్టర్‌లో వేసి నీళ్ల లేకుండా వడకట్టాలి. ఇప్పుడు మరమ రాలు, పెరుగులో నానబెట్టిన బొంబాయి రవ్వలో కొన్ని నీళ్ల పోసి మిక్సీలో వేసి మెత్తగా పిండి పట్టాలి. దీంట్లో ఉప్పు, బేకింగ్ పౌడర్ వేసి బాగా కలపాలి. బేకింగ్ పౌడర్ లేకపోతే బేకింగ్ సోడానైనా తీసుకోవచ్చు. బేకింగ్ పౌడర్ను నీళ్లలో కలిపితే పిండిలో బాగా కలువు తుంది. ఇప్పుడు పెనానికి నూనె రాసి గరిటెడు పిండితో దోశ పోసి పైన మూత పెట్టాలి. ఒకవైపు ఎర్రగా వేగిన తర్వాత తీసేయాలి. దోశ కరకరలాడుతూ ఉండాలంటే పిండిని మరింత పల్చగా చేసు కోవాలి. ఈ పిండితో స్పాంజిలా మెత్తగా లేదా కరకంలాడేలా దోశ వేసుకోవచ్చు. ముందు రోజు మిన పప్పు, బియ్యం నానబెట్ట డం లాంటివి ఏమీ లేకుండా ఇలా. సులువుగా దోశల ను సిద్ధం చేసు కోవచ్చు. పల్లీ లేదా కొబ్బరి చట్నీతో తింటే ఇవి చాలా బాగుం టాయి.



## మిక్చర్

**కావలసినవి:** మరమరాలు రెండు కప్పులు, పసుపు పావు టీస్పూన్, పల్లీలు అరకప్పు, నూనె వేయించడానికి సరిపడా, ఉప్పు తగినంత, కారం టేబుల్ స్పూన్, కరివేపాకు నాలుగు రెబ్బలు, వేయించిన జీలకర్ర పొడి అరటీస్పూన్, నిమ్మరసం టేబుల్ స్పూన్, =ది పంచదారపొడి పావుటీస్పూన్ ,



**తయారీ:** కడాయిలో నూనె పోసి వేడిచేసి పసుపు తర్వాత మరమరాలు వేసి ఎక్కువ మంట మీ కరకరలాడేలా వేయించాలి. వీటిని తీసి పక్కన పెట్టుకుని అదే నూనెలో పల్లీలు వేసి వేయించాలి. ఇప్పుడు కరివేపాకును వేయించి పక్కన పెట్టుకోవాలి. వెడల్పాటి గిన్నెలో మరమరాలు, పల్లీలు, జీలకర్రపొడి, కారం, ఉప్పు, నిమ్మరసం, కరివేపాకు, పంచదార పొడి వేసి బాగా కలపాలి. వేయించిన జీలకర్ర పొడి, పంచదార పొడుల వల్ల సరికొత్త రుచి వస్తుంది. ఇష్టమైతే దీంట్లో వేయించిన కొబ్బరి ముక్కలను కూడా కలపొచ్చు. గాలిచొరబడని డబ్బాలో పెట్టుకుంటే వారం రోజుల వరకూ నిల్వ ఉంటుంది.

## ఉగ్గాని



**కావలసినవి:** మరమరాలు పావుకేజీ, ఉప్పు తగినంత, పచ్చిమిర్చి మూడు, కరివేపాకు రెండు రెబ్బలు. పొడి కోసం: మూడు ఎండుమిర్చి, వేయించిన శెనగపప్పు పావుకప్పు, ఎండుకొబ్బరిపొడి రెండు టేబుల్స్పూన్లు. తాలింపు కోసం: ఆవాలు, జీలకర్ర రెండు టీస్పూన్ల చొప్పున, ఎండుమిర్చి మూడు, ఉల్లిపాయలు తరుగు పావు కప్పు, టొమాటో తరుగు అరకప్పు, కారం అర టీస్పూన్, కరివేపాకు రెబ్బ ఒకటి, కొత్తమీర తరుగు గుప్పెడు.

**తయారీ:** మరమరలను నీళ్లలో వేసి నిమిషం తర్వాత పిండి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడే ఉప్పు కలిపితే మర మరలకు బాగా పడుతుంది. ఎండు మిర్చి, శెనగపప్పు, ఎండుకొబ్బరిపొడిని మిక్సీలో వేసి మెత్తగా పొడి చేసుకోవాలి. పచ్చిమిర్చి, కరివేపాకును కచ్చాపచ్చాగా దంచుకోవాలి. పచ్చిమిర్చిని చిన్నముక్కల్లా కోయకుండా దంచితే రుచిగా ఉంటుంది. కడాయిలో నూనె పోసి వేడిచేసి ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి వేసి వేయించాలి. తర్వాత ఉల్లిపాయ తరుగు, కరివేపాకు జతచేసి రెండు నిమిషాలు వేయించాలి. ఇప్పుడు టొమాటో తరుగు, పసుపు వేయాలి. టొమాటో తరుగు మెత్తబడి, నూనె పైకి తేలేంతవరకూ వేయించి కారం కలపాలి. నానబెట్టిన మరమరాలు, తయారుచేసి పెట్టుకున్న పొడి, కొత్తమీర తురుము ఉప్పు కలిపి కాసేపు వేయించాలి. చివరిగా మిర్చీ లేదా అరటికాయబజ్జిని చిన్న ముక్కల్లా కోసుకుని కలిపితే రాయలసీమవాసులు ఎంతో ఇష్టంగా తినే ఉగ్గాని సిద్ధమవు తుంది. □

# ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలం..

అంతర్వాణి

ధనవంతులగుటకు ఆపేక్షించువారు శోధన లోను, ఉరిలోను, అవివేకయుక్త ములును హానికరము లునైన అనేక దురాశలలోను పడుదురు. అట్టివి మనుష్యులకు నష్టము లోను నాశనములోను ముంచివేయును. ఎందు కనగా ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము, కొందరు దానిని ఆశించి విశ్వాసము నుండి తొలగిపోయి, నానాబాధలతో తమ్మును తామే పొడుచుకొనిరిఖి (1 తిమోతి 6:9,10). చాలామందికి డబ్బేప్రపంచం. డబ్బే వారి ఆశ, ఆశయం, లక్ష్యం, గురి. దీనికోసం రాత్రిపగలు కష్టపడుతుంటారు. డబ్బు ఆశకు అంతం లేదు. సంపాదించేకొద్దీఇంకా..ఇంకా కూడబెట్టాలి అనే తపన ఉంటుందే తప్ప, ఇంతటితో ఆగిపోదాం అనే భావన ఉండదు. ఎంత సంపాదించినా తృప్తి ఉండదు. మరింతగా ఆస్తుపాస్తులను పిల్లల పిల్లలకు రెండుమూడు తరాలకు సరిపడినంతగా సంపాదించాలనే కోరిక ఉంటుంది. ఇందుకోసంఎంతకైనా తెగిస్తారు. అనుబంధాల కంటే డబ్బేముఖ్య మంటారు. జీవించేందుకు డబ్బు అవసరమే కానీ జీవితమే డబ్బు సంపాదనగా ఉండకూడదని అందరికీ తెలుసు. అయినా సరే ఉన్న దాంతో సంతృప్తి చెందరు. అయితే విశ్వాసులు కూడా ఇందులో ఏమాత్రం తీసిపోరు.ఎవరో కొందరికి తప్ప అనేకుల విశ్వాసుల్లో కూడా ధనాపేక్ష పెరిగిపోతు న్నది.



అందుకే దేవుడు మనల్ని హెచ్చరిస్తూనే ఉంటారు. డబ్బుకోసం పరుగులు తీసి, నాశనంతో పడిన కొందరి గురించి మనకందరికీ బాగా తెలుసు. పాతనిబంధనలో బిలాము, ఆకాను. డబ్బుకోసం దేవుడిచిత్తానికి వ్యతిరేకంగా ప్రవర్తించిన బిలాము చివరికి ఖడ్గంతో చంపబడ్డాడు (యెహూషువ 13:22). ఆకాను కూడా శపించబడిన యెరికోబంగారం, వెండి, షీనారు పైవస్త్రమును దొంగలించాడు. అతడు చేసిన పాపం బట్టి ఆకానును, అతని కుటుంబసభ్యులను, అతనికికలిగిన పశువు లను కూడా రాళ్లతో చావగొట్టి, అగ్నితో తగలబెట్టారు (యెహూషువ 7:2426). కొత్త నిబంధనలో ఇస్కరియోతు యూదా గురించి తెలిసిందే. యేసుక్రీస్తును 30వెండి నాణాలకు అమ్మివేసి, చివరికి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు (మత్తయి 27:5). చిత్తం ఏమై ఉందో గ్రహించి, ఆదిశగా మనంనిర్ణయాలు తీసుకుని, ముందుకు సాగిపోదాం.

-పి.వాణిపుష్ప

## చెలి చిట్కాలు

★ బలహీన ముగా వున్నవారు రాత్రిపూట వేడి అన్నములో వేడిపాలు పోసి తెల్లపాయలు ముక్కలుగాచేసి వేసి తోడుపోసి ఉదయాన్నే తినవలెను.

★ వేడి ఎక్కువగా వున్నవారు ఖర్జూరవుకాయ (ఎండినవి) కొట్లో దొరికేవి ప్రతిరాత్రి కాయలను ఒకగ్లాసుడు నీటిలో నానబెట్టి ఉదయమునసే ఆ నీరు త్రాగితే వేడి తగ్గును గుజ్జు తినండి.

★ మజ్జిగ లో కల కండ మిరియాల చూర్ణము కలిపి పుచ్చుకొనిన ఉదర రోగములు తగ్గును.

★ వెల్లుల్లిపాయల రసమును ఒక పెద్ద ఉల్లిపాయను మెత్తగానూరి తేనెతో తాగించిన ఊపిరి గొట్టునొప్పి తగ్గును.

## ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో..

# భారత్ యువ షటర్లు తన్వి, వెన్నెల జోరు

**న్యూఢిల్లీ:** ఇండోనేషియాలోని సోలోలో జరిగిన బ్యాడ్మింటన్ ఆసియా జూనియర్స్ వ్యక్తిగత ఛాంపియన్‌షిప్-2025లో భారత యువ షట్లర్లు తన్వి శర్మ మరియు హైదరాబాద్‌కు చెందిన కలగోట్ల వెన్నెల జోరు చూపుతున్నారు. ఈ టోర్నమెంట్‌లో తమ అద్భుతమైన పరుగును కొనసాగించి సెమీఫైనల్‌కు చేరుకున్నారు. మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ తన్వి తన ఆధిపత్య ఫామ్‌ను కొనసాగించింది, 35 నిమిషాల వేగవంతమైన పోరాటంలో ఇండోనేషియాకు చెందిన ఐదవ సీడ్ థలితా రామధాని విర్యావన్‌ను 21-19, 21-14 తేడాతో ఓడించింది. టోర్నమెంట్ అంతటా తన్వి అద్భుతమైన ప్రదర్శనతో ఇప్పటివరకు వరుస గేమ్‌లలో అన్ని విజయాలను సాధించింది. ఇక చివరి నాలుగు స్థానాల్లో కలగోట్ల వెన్నెల కూడా చేరింది, ఆమె 58 నిమిషాల పాటు జరిగిన పోటీలో థాయిలాండ్‌కు చెందిన జన్యపోర్న్ మీపాంతోంగ్ నుండి బలమైన సవాలును





ఎదుర్కొంది. వెన్నెల పదునైన ర్యాలీలతో ప్రారంభ గేమ్‌ను 21-18తో గెలుచుకుంది, కానీ జన్యపోర్న్ రెండవ గేమ్‌ను 21-17తో ఆధిక్యంలోకి నెట్టి, మ్యాచ్‌ను నిర్ణయాత్మకంగా మార్చింది. చివరి గేమ్‌లో వెన్నెల ఎట్టకేలకు 21-18, 17-21, 21-17 తేడాతో విజయం సాధించి తన సెమీఫైనల్ బెర్తును సంపాదించుకుంది. ఇక పురుషుల డబుల్స్‌లో టాప్ సీడ్లు భార్గవ్ రామ్ మరియు విశ్వ తేజ్ 21-15, 21-15 తేడాతో జపాన్‌కు చెందిన హారు మసుదా మరియు షోగో మియాషితను ఓడించి రౌండ్ ఆఫ్ 16కి చేరుకున్నారు. పురుషుల సింగిల్స్‌లో రౌనక్ చౌహాన్ 25-23, 21-18 తేడాతో థాయిలాండ్‌కు చెందిన ఉచ్చన్ రుయాసాప్‌ను ఓడించగా, అన్ష్ నేగి 21-14, 21-16 తేడాతో వియత్నాంకు చెందిన లే మిన్ సన్‌ను ఓడించి, ఇద్దరూ రౌండ్ ఆఫ్ 16కి చేరుకున్నారు.



## ఆట

## టాంపరే ఓపెన్‌లో..

# సెమీస్‌కు సుమిత్

**న్యూఢిల్లీ:** టాంపెరే ఓపెన్-2025లో భారత్ ప్లేయర్ సుమిత్ నాగల్ సెమీఫైనల్స్‌కు చేరుకున్నాడు. క్వాలిఫైయర్ నికోలస్ కిక్కర్‌పై వరుస సెట్ల తేడాతో విజయం సాధించిన తర్వాత, ఫిన్లాండ్‌లో జరిగిన టాంపేర్ ఎటిపి ఛాలెంజర్ ఈవెంట్‌లో సుమిత్ సింగిల్స్ సెమీఫైనల్‌లోకి దూసుకెళ్లాడు. 306వ ర్యాంక్‌లో ఉన్న నాగల్, సింగిల్స్ ఎటిపి చార్టులో 361వ ర్యాంక్‌లో ఉన్న కిక్కర్‌పై 6-4, 6-3 తేడాతో విజయం సాధించాడు. ఇద్దరు ఆటగాళ్ల మధ్య ఇది మూడో మ్యాచ్. నాగల్ ఇప్పుడు హెడ్ టుహెడ్ రికార్డులో 2-1తో ఆధిక్యంలో ఉన్నాడు. వీరిద్దరూ చివరిసారిగా 2022లో తలపడగా, అందులో కిక్కర్ గుయాక్విల్ ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో విజేతగా నిలిచాడు. 28 ఏళ్ల ఈ భారతీయుడు తన ప్రత్యర్థిపై 67 పాయింట్లకు 51 పాయింట్లు సాధించాడు. క్రమంగా ఫామ్‌లోకి తిరిగి వస్తున్న నాగల్ ఈ సీజన్‌లో తన అత్యుత్తమ ముగింపును సాధించాడు. నాగల్ 10 ఫైనల్స్ నుండి ఆరు ఛాలెంజర్ సింగిల్స్ టైటిళ్లను గెలుచుకున్నాడు. ఇక అమెరికాలో జరిగిన క్రాన్‌బ్రూక్ టెన్నిస్ క్లాసిక్‌లో పోటీ పడుతున్న భారత రెండవ సీడ్ జంట అనిరుధ్ చంద్రశేఖర్-రామ్‌కుమార్ రామనాథన్ 6-4 4-6 7-10 తేడాతో స్థానిక వైల్డ్‌కార్డులు స్టీఫన్ దోస్తానిక్ మరియు బెంజమిన్ కిట్టే చేతిలో ఓడి క్వార్టర్ ఫైనల్ నుండి నిష్క్రమించారు.

## ఆస్ట్రేలియాదే టి20 సిరీస్

# 3-0తో వెస్టిండీస్ ఓటమి



**న్యూఢిల్లీ:** వెస్టిండీస్ సొంతగడ్డపై ఆస్ట్రేలియా జైత్ర యాత్ర కొనసాగుతోంది. సెయింట్స్ కిట్స్ వేదికగా శనివారం వెస్టిండీస్‌తో జరిగిన మూడో టీ20లో 6 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించిది. తద్వారా 5 టీ20ల సిరీస్‌ను మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే 3-0 తేడాతో కంగారులు సొంతం చేసుకున్నారు. ఈ మూడో టీ20 మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కరేబియన్ జట్టు 4 వికెట్లు నష్టానికి 214 పరుగుల భారీ స్కోర్ సాధించింది. విండీస్ కెప్టెన్ షాయ్ హోప్ (102) అజేయ శతకంతో కదం దొక్కగా, బ్రాండెన్ కింగ్ (62) రాణించాడు. ఆసిస్ బౌలర్లలో మిచెల్ ఓవెన్, ఎల్లీస్, జంపా తలా వికెట్ సాధించారు. అనంరతం 215 పరుగుల భారీ లక్ష్యాన్ని ఆస్ట్రేలియా కేవలం 4 వికెట్లు మాత్రమే కోల్పోయి 16.1 ఓవర్లలో చేధించింది. ఈ లక్ష్య సాధనలో ఆసిస్ ప్లేయర్ టిమ్ డేవిడ్ విధ్వంసకర సెంచరీతో చెలరేగాడు. కేవలం 37 బంతుల్లో 6 ఫోర్లు, 11 సిక్సర్ల సాయంతో 102 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఆస్ట్రేలియా తరపున టీ10ల్లో ఫాసెస్ట్ సెంచరీ చేసిన ప్లేయర్‌గా డేవిడ్ రికార్డులకెక్కాడు. డేవిడ్‌తో పాటు, మిచెల్ ఓవెన్ (36), మార్ష్ (22), మాక్స్‌వెల్ (20) రాణించారు. విండీస్ బౌలర్లలో షెఫర్డ్ 2 వికెట్లు పడగొట్టగా, హోల్డర్ ఒక వికెట్ సాధించాడు. మరో వికెట్ రనౌట్ రూపంలో లభించింది.

# టీమిండియా క్లిష్ట పరిస్థితి

## బౌలర్ల ఘోర తప్పిదాలు.. ఇంగ్లండ్ టూర్‌లో లోపించిన స్థిరత్వం









**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్ పర్యటనలో టీమిండియా బౌలర్ల ప్రదర్శన ఒక పట్టాన అర్థం కావట్లేదు. మొదటి టెస్ట్ నుంచి ఈ పరిస్థితి ఇలాగే కొనసాగుతోంది. అందుకే నాలుగో టెస్ట్ ప్రారంభానికి ముందే భారత్ సిరీస్‌లో వెనుకబడిపోయింది. ఐదు టెస్ట్ మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో నాలుగో మ్యాచ్‌లో టీమిండియా బౌలింగ్ అత్యంత బలహీనంగా కనిపించింది. భారత బౌలర్లు బంతిని వేసే విధానంలో స్థిరత్వం లేకపోవడం ఒక సమస్య అయితే, ప్రతీ మ్యాచ్‌లో ఒకేలా చేసిన మరో తప్పు క్రమశిక్షణ లేకపోవడం. మొదటి మ్యాచ్ నుంచే భారత బౌలర్లు తమ పరిమితులను అతిక్రమిస్తున్నారు. మాంచెస్టర్‌లో జరుగుతున్న నాల్గో టెస్ట్‌లో కూడా ఇందులో ఎలాంటి మెరుగుదల కనిపించలేదు. ఈ విషయంలో టీమ్ స్టార్ పేస్ బౌలర్ జస్ ప్రీత్ బుమ్రా అందరికంటే ముందు ఉన్నాడు. ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్‌లో బుమ్రా, మహ్మద్ సిరాజ్ తో సహా ఏ భారత బౌలర్ కూడా ఇంగ్లీష్ బ్యాట్స్‌మెన్‌లను స్థిరంగా ఇబ్బంది పెట్టలేకపోయారు. దీని ప్రభావం వల్ల మూడో రోజు ముగిసేసరికి ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్‌లో 180 పరుగులకు పైగా ఆధిక్యాన్ని సంపాదించింది. భారత బౌలర్లలో పదును, వేగం కంటే క్రమశిక్షణ లోపమే ఎక్కువగా కనిపించింది. ఈ మ్యాచ్‌లో రెండో రోజు ఇంగ్లండ్ బ్యాటింగ్‌లో మొదటి ఓవర్ నుంచే భారత పేస్ బౌలర్లు బంతిపై సరైన నియంత్రణ సాధించలేకపోయారు. ఇది మూడో రోజు ఆట ముగిసే వరకు కొనసాగింది. ఈ సమయంలో భారత బౌలర్లు తమ పరిమితిని, అంటే బౌలింగ్ క్రీజ్‌ను చాలాసార్లు దాటారు. దీనివల్ల ఇంగ్లండ్‌కు అదనపు పరుగులు వచ్చాయి. మూడో రోజు ఆట ముగిసే సమయానికి టీమిండియా మొత్తం 136 ఓవర్లు బౌలింగ్ చేసింది. ఇందులో మొత్తం 13 నోబాల్స్ ఉన్నాయి. వీటిలో అత్యధికంగా 5 నోబాల్స్‌ను టీమ్‌లో అత్యంత సీనియర్ పేస్ బౌలర్ జస్ ప్రీత్ బుమ్రా వేశాడు. కేవలం బుమ్రా మాత్రమే కాదు, ఇతర బౌలర్లు కూడా ఈ విషయంలో వెనుకబడలేదు. మాంచెస్టర్ టెస్ట్‌తో అరంగేట్రం చేస్తున్న యువ పేస్ బౌలర్ అన్షుల్ కంబోజ్ 18 ఓవర్లలోనే 4 సార్లు నోబాల్ వేశాడు. ఇక స్పిన్నర్ అయినప్పటికీ నోబాల్స్ వేయడంలో పేరుగాంచిన రవీంద్ర జడేజా కూడా ఇక్కడ ఆగలేదు. 33 ఓవర్లలో ఆయన ఖాతాలో 3 నోబాల్స్ చేరాయి. శార్దూల్ ఠాకూర్ కూడా 1 నోబాల్ వేశాడు. ఈ విషయంలో మహమ్మద్ సిరాజ్, వాషింగ్టన్ సుందర్ మాత్రం క్రమశిక్షణ చూపించారు.

## వరల్డ్ టేబుల్ టెన్నిస్‌లో..

# రన్నరప్‌గా మిక్స్‌డ్ జోడీ బైస్య, ఆకాష్

## మహిళల సింగిల్స్‌లో సెమీస్‌కు శ్రీజ

**న్యూఢిల్లీ:** వరల్డ్ టేబుల్ టెన్నిస్ కాంటెండర్-2025, మిక్స్‌డ్ డబుల్స్‌లో బైస్య-ఆకాష్ జోడీ రన్నరప్‌గా నిలిచింది. అలాగే మహిళల సింగిల్స్‌లో హైదరాబాద్ అమ్మాయి అకుల శ్రీజ సెమీఫైనల్‌కు చేరుకోగా, ఆకాష్ సథియన్ పురుషుల డబుల్స్‌లో ఫైనల్‌కు చేరుకున్నారు. లాగోస్‌లో జరిగిన ఈ టోర్నీలో భారత టేబుల్ టెన్నిస్ మిక్స్‌డ్ డబుల్స్ జోడీ పోయ్‌మంటీ బైస్య మరియు ఆకాష్ పాల్ రన్నరప్‌తో సరిపెట్టింది. క్వాలిఫికేషన్ రౌండ్లలో ఫ్రాన్స్‌కు చెందిన జుల్స్ రోలాండ్-ప్రితికా పావాడే చేతిలో టాప్ సీడ్ జోడీ బైస్య-పాల్ 10-12, 5-11, 11-6, 7-11 తేడాతో ఓడిపోయారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రస్తుత జాతీయ ఛాంపియన్‌లైన బైస్య-పాల్, మొదటిసారి కలిసి ఆడుతున్న ఫ్రెంచ్ జంట చేతిలో కేవలం 27 నిమిషాల్లోనే పూర్తిగా ఓడిపోయారు. లాగోస్‌లో భారత జట్టు మొదటి రౌండ్,





క్వార్టర్ ఫైనల్స్‌లో వరుసగా రెండు గేమ్‌ల విజయాన్ని నమోదు చేసింది. ఆ తర్వాత సెమీఫైనల్లో ఇటలీకి చెందిన జాన్‌ఓయెబోడ్, గయా మోన్‌ఫార్డినిని 3-1 తేడాతో ఓడించి ఫైనల్‌కు అర్హత సాధించారు. అలాగే సత్యన్ జ్ఞానశేఖరన్‌తో కలిసి పురుషుల డబుల్స్ ఫైనల్‌కు చేరుకున్నాడు. అన్‌సీడెడ్ సాథియన్-పాల్ జంట ఘనాకు చెందిన జేమ్స్ మార్ఫీ-ఇమ్మాన్యుయేల్ కామీలను 11-3, 11-3, 11-4 తేడాతో ఓడించి సెమీఫైనల్‌ను సాధించారు. మహిళల డబుల్స్‌లో భారత జంట బైస్య-కృత్వికా రాయ్ సెమీఫైనల్లో టాప్ సీడ్ కిమ్ నయోంగ్-ర్యు హన్నా చేతిలో 8-11, 2-11, 14-12, 8-11 తేడాతో ఓడిపోయారు. ఇక అంతకు ముందు మహిళల సింగిల్స్‌లో శ్రీజ సెమీఫైనల్స్‌కు చేరుకుంది.

---

# పొదుపే కాదు.. ఖర్చు కూడా చేయాలి: రాధికా గుప్తా సూచనలు

**ముంబై, జూలై 26:** జీవితం అంటే పొదుపు చేయడమే కాదు.. ఖర్చు పెట్టడమూ అవసరమే అంటున్నారు ఎడెల్‌వీస్ మ్యూచువల్ ఫండ్ సీఈఓ, ఎండీ రాధికా గుప్తా. వ్యక్తిగత ఆర్థిక క్రమశిక్షణ అత్యవసరమే అయినప్పటికీ కొన్నిసార్లు చిన్న చిన్న ఆనందాల కోసం వెచ్చించాలని చెప్పారు. అప్పుడే జీవన ప్రయాణానికి నిజమైన అర్థం లభిస్తుందన్నారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఆమె చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. నా కలను సాకారం చేసుకునేందుకు ప్రయాణం ప్రారంభించాను. ఇప్పుడు నా హృదయం ఆనందంతో నిండిపోయింది. కష్టపడటంలో ఉండే మాధుర్యమే ప్రత్యేకం. సిప్‌లు చేయండి అని చెప్పడం నా వృత్తే కాదనను.. కానీ, చిన్నాపెద్దా తేడా లేకుండా అందరికీ నేనో విషయం చెబుతాను. కష్టపడటం వల్ల మీకు అందిన ఫలాలను ఆస్వాదించడానికి సమయం కేటాయించుకోండి. పొదుపు చేయడం ముఖ్యమే.. కానీ ఖర్చు చేయడమూ అవసరమే. మీకు సంతోషానిచ్చే వాటిపై వెచ్చించినప్పుడే జీవిత ప్రయాణానికి అర్థం ఉంటుంది. పరిపూర్ణమైన జీవితం అనేది ఎవరు ఎక్కువ ఆస్తులు సంపాదించారని లెక్కగట్టే రేస్ కాదు. ఎవరు ఎంత ఆనందంగా జీవించారన్న దానిపై ఆధారపడి ఉంటుంది. ఆర్థిక వివేకం, వ్యక్తిగత ఆనందం మధ్య సమతుల్య ప్రయాణం ఎప్పటికీ మంచిద్దే అని రాధికా గుప్తా తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఆర్థిక వ్యవహారాలపై యువతకు సలహాలు, సూచనలు ఇచ్చే రాధిక గుప్తా.. అప్పుడప్పుడు సామాజిక అంశాల పైనా తన అభిప్రాయాలను వెల్లడిస్తుంటారు. ఈ మధ్య ఒబెసిటీ సమస్య గురించి మాట్లాడుతూ, రెస్టరంట్లు హాఫ్ ప్లేట్ ఐడియాను పాటిస్తే మంచిదన్నారు. దానివల్ల ఆహారం, డబ్బువృథాకాకుండా.. కొంచెం తినే అవకాశం లభించినట్లవుతుందని తెలిపారు. ఇక, అంతకుముందు పని గంటల చర్చ పైనా స్పందించారు. సుదీర్ఘ పని గంటలు ఉన్నంత మాత్రాన ఉత్పాదకత ఏమీ ఉండదన్నారు. అంతేగాక, కుటుంబం, మానసిక ఆరోగ్యం కూడా ప్రతీ వ్యక్తికి ముఖ్య మేనని గుర్తు చేశారు.



# వోల్వో కార్లకు డబ్బులు చెల్లించని నార్త్ కొరియా

## వెయ్యి కార్లు కొనుగోలు చేసి 50యేళ్లు..

**న్యూఢిల్లీ, జూలై 26:** ప్రపంచం మొత్తం ఒకవైపు ఉంటే ఉత్తర కొరియా మాత్రం మరోవైపు ఉంటుంది. ప్రజలను ఇప్పటికీ పాతకాలంలోనే బతికేలా చేస్తుంటుంది. నియంతృత్వ పోకడలతో ఆ దేశ అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ ప్రజలను నియంత్రిస్తుంటాడనే విషయం ప్రపంచం మొత్తానికీ తెలుసు. అలాంటి ఉత్తర కొరియాతో స్వీడన్ కంపెనీలు ఓ బిజినెస్ డీలింగ్ కుదుర్చుకున్నాయి. 1,000 వోల్వో కార్లను సప్లై చేసేందుకు అంగీకరించాయి. ఇది 1974 నాటి మాట. అప్పట్లో ఈ ఒప్పందాన్ని స్వీడన్ కంపెనీ చాలా గొప్పగా భావించింది. ఉత్తర కొరియాలో ఇక తమ కంపెనీ వేగంగా విస్తరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది. ఒప్పందం ప్రకారం వెయ్యి కార్లను అనతికాలంలోనే ఎగుమతి చేసింది. అయితే, ఆ కార్లకు సంబంధించి పైసా కూడా ఉత్తర కొరియా చెల్లించలేదు. ఈ కార్ల విలువ అప్పట్లోనే 73 మిలియన్ డాలర్లు. రేపో మాపో చెల్లిస్తుందని ఆ కంపెనీ ఈ రోజుకూ ఎదురుచూస్తూనే ఉంది కానీ 50 ఏళ్లు గడిచినా నేటికీ ఉత్తర కొరియా నుంచి ఒక్క డాలరు కూడా ముట్టలేదు. స్వీడన్ కంపెనీ పలుమార్లు లేఖలు రాసినా ఉపయోగం లేకుండా పోయింది. నాడు 73 మిలియన్ డాలర్లుగా ఉన్న మొత్తం ప్రస్తుతం వడ్డీతో కలిసి సుమారు 330 మిలియన్ డాలర్లకు చేరింది. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. 50 ఏళ్ల నాటి వోల్వో కార్లను ఉత్తర కొరియా నేటికీ ఉపయోగిస్తూనే ఉంది. విదేశీ ప్రతినిధులు, జర్నలిస్టులు తమ దేశానికి వచ్చినపుడు వారిని వివిధ ప్రాంతాలకు తీసుకెళ్లేందుకు ఈ వోల్వో కార్లనే ఉపయోగిస్తుండడం విశేషం.




# ఆగస్టు 1 నుంచి యుపిఐ కొత్త రూల్స్..

**ముంబై, జూలై 26:** డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో కీలకమైన యూపీఐకి సంబంధించి పలు మార్పులు రాబోతున్నాయి. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) ఆగస్టు 1 నుంచి కొత్త రూల్స్ తీసుకొస్తోంది. ఒకప్పుడు బ్యాంకు ఖాతాలో ఎంత నగదు ఉందో తెలుసుకోవడం చాలా కష్టంగా ఉండేది. యూపీఐ అందుబాటు లోకి వచ్చాక ఫోన్‌పే, పేటీఎం, గూగుల్‌పే వంటి యాప్స్ సాయం తో ఒక్క క్షణంలో తెలుసుకునే వీలు ఏర్పడింది. బ్యాంకు శాఖ/ఏటీఎం కేంద్రానికి వెళ్లే అవసరం తప్పింది. ఇలా చెక్ చేసుకునే విషయంలో ఇప్పటివరకు ఎలాంటి పరిమితీ లేదు. ఇకపై రోజులో 50సార్లు మాత్రమే బ్యాలెన్స్ తనిఖీ చేసుకునేందుకు అనుమతిస్తారు. అలాగే, ఒక మొబైల్‌నంబర్‌పై ఎన్ని బ్యాంకు ఖాతాలు లింక్ అయ్యాయో 25 సార్లకు మించి చూసుకోలేరు. నెట్‌వర్క్‌పై భారం తగ్గించడం ద్వారా.. వినియోగదారులకు మరింత మెరుగైన, అంత రాయంలేని సేవలు అందించడమే లక్ష్యంగా బ్యాంకు లు, యూపీఐ సేవల సంస్థలకు ఎన్‌పీసీఐ ఈ ఆదేశాలు జారీ చేసింది. ఆటో పేమెంట్ లావాదేవీల విషయంలోనూ ఎన్‌పీసీఐ నిబంధనల్లో మార్పులు చేసింది. సబ్‌స్క్రిప్షన్లు, యుటిలిటీ బిల్లులు, ఈఎంఐలు వంటి ఆటో పేమెంట్‌లను రద్దీ లేని సమయంలో మాత్ర మే నిర్వహించాలి. ఆటోపేమెంట్ రిక్వెస్ట్ పెట్టే సంస్థలు రద్దీ లేని సమయంలోనే యూపీఐ కలెక్షన్‌రిక్వెస్ట్‌ను షెడ్యూల్ చేయాలి. యూజర్లు చేసే చెల్లింపులకు ఈ నిబంధన వర్తించదు. యూపీఐ ద్వారా నెలకు దాదాపు రూ.1800 కోట్లకు పైగా లావాదేవీలు జరుగుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ మే నెలల్లో పలుమార్లు యూపీఐ సేవలకు అంతరాయం ఏర్పడింది. అనవసర ఏపీఐ (అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేసెస్ కాల్స్) వల్ల ఈ పరిస్థితి నెలకొందని ఎన్‌పీసీఐ గుర్తించింది. అంటే పదేపదే బ్యాలెన్స్ తనిఖీ చేయడం, పేమెంట్ స్టేటస్ చెక్ చేయడం వంటివి ఇందుకు కారణమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆగస్టు 1 నుంచి తాజా మార్పులకు శ్రీకారం చుట్టింది. వీటివల్ల సాధారణ వినియోగదారులపై పెద్దగా ప్రభావం ఉండదు. ఎందుకంటే రోజులో ఎక్కువసార్లు ఎవరూ బ్యాలెన్స్ తనిఖీ చేపట్టరు. ఒకవేళ ఆ పరిమితికి మించి చేసినప్పుడే అంతరాయాన్ని గుర్తిస్తారు. పేటీఎం, ఫోన్‌పే, గూగుల్ పే వాడేవారందరికీ ఈ నిబంధనలు వర్తిస్తాయి.




# అమెరికన్ల చేతిలో భారత్ ఫోన్లు..

**న్యూఢిల్లీ, జూలై 26:** స్మార్ట్‌ఫోన్ల తయారీలో భారత్ దూసుకెళుతోంది. పీఎల్ఐ స్కీమ్ కారణంగా దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరింది. అగ్రరాజ్యం అమెరికాలోనూ నేడు మేడిన్ ఇండియాఫోన్లు పెద్దఎత్తున దర్శనమిస్తున్నాయి. ఈ ఏడాది తొలి ఐదు నెలల కాలానికి ఆ దేశ స్మార్ట్‌ఫోన్ల దిగుమతుల్లో మన వాటా 36 శాతానికి చేరింది. అంటే ప్రతి ముగ్గురిలో ఒకరి వద్ద దేశీయంగా తయారైన ఫోన్లు ఉంటున్నాయన్నమాట. గతేడాది ఈ వాటా 11 శాతంగా ఉంది. అదే సమయంలో 82 శాతంగా ఉన్న చైనా మార్కెట్ వాటా 49 శాతానికి తగ్గింది. ఆ మేర డ్రాగన్ ఆధిపత్యానికి గండిపడింది. అమెరికా ఇంటర్నేషనల్ ట్రేడ్ కమిషన్ గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది జనవరి-మే నెల మధ్యకాలంలో 21.3మిలియన్ యూనిట్ల స్మార్ట్‌ఫోన్లను భారత్ అమెరికాకు ఎగుమతి చేసింది. 9.35 బిలియన్ డాలర్ల విలువైన స్మార్ట్‌ఫోన్లను అగ్రరాజ్యా నికి భారత్ ఎగుమతి చేసింది. మన దేశం నుంచి ఎగుమతి చేసిన వస్తువుల్లో విలువ పరంగా స్మార్ట్‌ఫోన్లదే అగ్రస్థానం కావడం విశేషం. అమెరికాకు ఇప్పటికీ అత్యధికంగా స్మార్ట్‌ఫోన్లను ఎగుమతి చేస్తున్నది చైనానే అయినప్పటికీ, ఆదేశ దిగుమతులు క్రమంగా క్షీణిస్తున్నాయి. ఈ ఏడాది జనవరి-మే మధ్య 29.4 మిలియన్ యూనిట్లను ఆ దేశం అమెరికాకు ఎగుమతి చేసింది. గతేడాదితో పోలిస్తే ఈ సంఖ్య 27 శాతం తగ్గడం గమనార్హం. మొత్తంగా 10 బిలియన్ డాలర్ల విలువైన స్మార్ట్‌ఫోన్లను ఎగుమతి చేసింది. ప్రస్తుతం చైనా 49 శాతం వాటాతో అగ్రస్థానంలో ఉండగా, భారత్ 36 శాతం వాటాతో రెండో స్థానంలో ఉంది. వియత్నాం 14 శాతం మార్కెట్‌వాటాతో మూడో స్థానంలో నిలిచింది. అమెరికాకు ఎగుమతి అవుతున్న స్మార్ట్ ఫోన్లలో అత్యధికం యాపిల్‌వే. 2020 వరకు స్మార్ట్ ఫోన్ల ఉత్పత్తి విషయంలో చైనా పైనే అధికంగా ఆధారపడిన యాపిల్, ఆ తర్వాత తన పంథాను మార్చుకుంది. భారత్ తయారీని ప్రారంభించింది. ముఖ్యంగా ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల పథకం గేమ్ ఛేంజర్‌గా నిలిచింది. తొలుత కేవలం పాత మోడళ్లు మాత్రమే ఉత్పత్తి చేసే యాపిల్.. ఇప్పుడు ప్రో మోడళ్ల తయారీనీ దేశంలోనే చేపడుతోంది.



## వాణిజ్యం

# చాట్‌జిపిటితో సీక్రెట్లు చెబితే అంతే..: శామ్ ఆల్ట్‌మన్ అలర్ట్

**వాషింగ్టన్, జూలై 26:** ఈ రోజుల్లో చాట్‌జీపీటీకి ఉన్న క్రేజ్ అంతాఇంతా కాదు. ముఖ్యంగా యువత అయితే ప్రతి చిన్న సందేహాన్నీ ఈ చాట్‌బాట్‌లోనే అడిగి తెలుసుకుంటున్నారు. దాన్నో ఫ్రెండ్‌లా భావించి మనసు విప్పి మాట్లాడుకుంటున్నారు. అయితే, ఈ విషయంలో కాస్త జాగ్రత్తగా ఉండాలంటున్నారు చాట్‌జీటీపీ సృష్టికర్త, ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్. ఈ చాట్‌బాట్‌తో యూజర్లు పంచుకునే విషయాలు రహస్యంగా ఉండవని చెప్పారు. న్యాయస్థానాలు ఉత్తర్వులు ఇస్తే తాము ఏ విషయాన్నైనా వెల్లడి చేయాల్సి ఉంటుందని స్పష్టంచేశారు. ఓ కమెడియన్ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ, శామ్ ఆల్ట్‌మన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ మధ్య చాలా మంది యూజర్లు తమ జీవితాల్లో జరిగే వ్యక్తిగత విషయాలను చాట్‌జీపీటీకి చెప్పేస్తున్నారు. ముఖ్యంగా యువత దీన్ని ఓ థెరపిస్ట్‌గా, లైఫ్ కోచ్‌గా భావిస్తున్నారు. కానీ, యూజర్లతో జరిపే వ్యక్తిగత సంభాషణలను భద్రంగా ఉంచే ఎఐ రంగం ఇంకా పురోగతి సాధించాల్సి ఉంది. ఓ డాక్టర్‌తోనో, న్యాయవాది లేదా థెరపిస్ట్‌తో జరిపిన సంభాషణకు ఉన్నంత గోప్యత ఎఐ చాట్‌లలో ఉండదు. చాట్‌జీపీటీలో విశ్వసనీయత ఉంటుందని మీరు భావించొద్దు. ఒక్కోసారి న్యాయపరమైన సమస్యలు వచ్చినప్పుడు కోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా మేం వ్యవహరించాల్సి ఉంటుంద్ధి అని ఓపెన్‌ఏఐ సీఈఓ వెల్లడించారు.




ప్రస్తుతం చాట్‌జీపీటీ ఫ్రీ, ప్లస్, ప్రో అకౌంట్లలో డిలీట్ చేసిన చాట్‌లను 30 రోజుల్లోపు సిస్టమ్స్ నుంచి పూర్తిగా తొలగిస్తున్నారు. అయితే, న్యాయపరమైన సమస్యలు ఎదురైతే మాత్రం వాటిని అలాగే ఉంచుతామని ఆల్ట్‌మన్ తెలిపారు. కేసుకు సంబంధించి కోర్టు ఉత్తర్వులు ఇచ్చినప్పుడు మాత్రం.. తమ వద్ద ఉన్న మొత్తం సమాచారాన్ని బయటపెట్టాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అందువల్ల చాట్‌జీపీటీతో వ్యక్తిగత వివరాలు పంచుకునే విషయంలో పునరాలోచన చేయాలని సూచించారు.

# టెక్నాలజీ అందుబాటులోకి తేవడమే మా ధ్యేయం

**న్యూఢిల్లీ, జూలై 26:** రిలయన్స్ రిటైల్ ఇటీవల ఎలక్ట్రోలక్స్ గ్రూప్ కన్జ్యూమర్ డ్యూరబుల్స్ బ్రాండ్ కెల్వినేటర్ కొనుగోలు డీల్‌పై కంపెనీ రిలయన్స్ రిటైల్ వెంచర్స్ లిమిటెడ్ (ఆర్ఆర్‌విఎల్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇషా అంబానీ స్పందించారు. కంపెనీ ఉత్పత్తుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రతి వినియోగదారుడి విభిన్న అవసరాలను తీర్చడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. 'కెల్వినేటర్ కొనుగోలు కంపెనీ అభివృద్ధికి ఒక కీలక ఘట్టాన్ని సూచిస్తుంది. ఇది భారతీయ వినియోగదారులకు నమ్మకమైన ప్రపంచ ఆవిష్కరణలను అందుబాటులోకి తీసుకురావడానికి వీలు కల్పిస్తుంది. దానికి కంపెనీ మార్కెట్ లీడింగ్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ఎంతో తోడ్పడుతుంది' అని ఇషా చెప్పారు. ఈ డీల్ విలువ సుమారు రూ.160 కోట్లు. దేశీయంగా అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రీమియం గృహోపకరణాల విభాగంలో కార్యకలాపాలు మరింతగా విస్తరించేందుకు రిలయన్స్ రిటైల్‌కి ఇది ఉపయోగపడనుంది. రిలయన్స్ రిటైల్ గతంలో కెల్వినేటర్ బ్రాండ్‌కి లైసెన్సు తీసుకుని ఉపయోగించుకుంది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.